

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 24-5-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక | www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 92 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ఉద్యమం ఉధృతం

ఆగని రెజ్లర్ల పోరాటం

- ఇండియా గేట్ వద్ద కొవ్వొత్తులతో కవాతు
- కదంతొక్కిన పౌర సమాజం
- నెల రోజులు పూర్తి చేసుకున్న మల్లయోధుల ఆందోళన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రెజ్లర్లు ప్రారంభించిన ఆందోళన రోజురోజుకూ ఉధృతమవుతోంది. మంగళవారం నాటికి ఈ ఉద్యమం ..నెల రోజులు పూర్తి చేసుకున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం జంతర్ మంతర్ నుంచి ఇండియా గేట్ వరకు వేలాది మంది ప్రజలు క్యాండిల్ లైట్ మార్చ్ చేపట్టారు. రెజ్లర్లకు మద్దతుగా ఢిల్లీ వీధుల్లో పౌర సమాజం కదం తొక్కింది. పోరాట వేదిక జంతర్‌మంతర్ నుంచి కాలినడకన అగ్రశ్రేణి రెజ్లర్లు ప్రారంభించిన పాదయాత్రలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, విద్యార్థులు, యువకులు, రైతులు, మహిళలు ...9లో

సివిల్స్‌లో అమ్మాయిలదే విజయం



ఇషితా కిశోర్

మొదటి నాలుగు ర్యాంకుల్లో వారే

- యూపీకి చెందిన ఇషితా కిశోర్‌కి మొదటి ర్యాంక్
- బీహార్‌కి చెందిన గరిమ లోహియాకి రెండో ర్యాంక్
- మూడో ర్యాంకులో తెలంగాణ అమ్మాయి ఉమా హారతి
- నాలుగో ర్యాంక్‌లో యూపీకి చెందిన స్మృతి మిశ్రా
- సత్తా చాటిన తెలుగు విద్యార్థులు



ఉమా హారతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్- 2022 తుది ఫలితాల్లో అమ్మాయిలు మెరిశారు. తొలి నాలుగు ర్యాంక్‌లను అమ్మాయిలే సాధించారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన ఇషితా కిశోర్ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకుతో అగ్రస్థానంలో నిలిచింది. గరిమ లోహియా (బీహార్), ఉమా హారతి నూకల(తెలంగాణ), స్మృతి మిశ్రా (యూపీ) వరుసగా రెండు, మూడు, నాలుగు ర్యాంకులతో ...9లో



నయా భూస్వాముల్ని తరిమి కొట్టాలి

దోపిడీ అంతమవ్వాలి

నయా ఉదారవాద సంస్కరణలు, గుత్తాధిపత్యం ఫలితంగా సుందరయ్య కాలం నుంచి గ్రామీణ పరిస్థితులు, వ్యవసాయ సంబంధాలు పెద్ద మార్పునకు గురయ్యాయి. ప్రస్తుతం పెద్ద రైతులకు, భూ యజమానులకు భూమిపై వచ్చే ఆదాయం ఒక్కటే కాదు. అనేక ఇతర ఆదాయ వనరులు ఉన్నాయి. చిన్న రైతులు, రైతు కూలీల్లో మార్పు వచ్చింది. వ్యవసాయ కూలీల్లో అధిక శాతం వలస కార్మికులుగా మారారు. నగరాల నిర్మాణ రంగంలో వారు విస్తృతంగా ఉపాధి పొందుతున్నారు. కానీ వారు గ్రామీణ బంధాలను పూర్తిగా వదులుకోలేదు. మారిన ఈ పరిస్థితులకు అనుగుణంగా గ్రామాల్లో ధనిక వర్గానికి వ్యతిరేకంగా కొత్త ఉద్యమాలు తీసుకురావాల్సిన అవసరం ఉన్నది.

-సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్

గ్రామాల్లో దోపిడీదారులకు వ్యతిరేకంగా ఆందోళనలు జరగాలి

- దేశ వ్యవసాయ రంగంపై సుందరయ్యకు లోతైన అవగాహన :పుచ్చలపల్లి సుందరయ్య స్మారక ఉపన్యాసంలో ప్రకాశ్ కరత్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గ్రామాల్లో దోపిడీదారులకు వ్యతిరేకంగా ఆందోళనలు జరగాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ పిలుపు ఇచ్చారు. మంగళవారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ (హెచ్‌కేఎస్) భవన్‌లో పి.సుందరయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొదటి వార్షిక పి సుందరయ్య స్మారక ఉపన్యాస కార్యక్రమం ట్రస్ట్ డైరెక్టర్ బోర్డు సభ్యులు, ఏఐకేఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే అధ్యక్షతన జరిగింది. వ్యవసాయ సమస్యలకు పుచ్చలపల్లి సుందరయ్య రచనలు, దాని సమకాలీన ఔచిత్యంపై సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లోని బడా భూ యజమానులతో పాటు ధనిక దోపిడీదారులకు వ్యతిరేకంగా చిన్న రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత కార్మికులతో కూడిన సంఘాన్ని ఏర్పాటు చేసి ఉపాధి, వేతనాలు, జీవనోపాధి, లింగ వివక్ష, కుల వివక్ష తదితర గ్రామీణ రంగం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. 1964లో పార్టీ కార్యక్రమంలో వ్యవసాయ భాగం రూపొందించబడిందని, 1967లో కేంద్ర కమిటీ రైతుల ఫ్రంట్ విధులను ఆమోదించిందని ...2లో

రైతు ఉద్యమానికి పి.సుందరయ్య దిగ్గజ దిక్సూచి

ప్రస్తుత రైతు ఉద్యమానికి పి.సుందరయ్య దిగ్గజ దిక్సూచి. ఫ్యూడలిజం, భూస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో మహోన్నత నాయకుడు.

పశ్చిమ బెంగాల్లో తెభాగ, కేరళలో పున్నప్రావాయిలర్, నార్త్ మలబార్ ఉద్యమం, మహారాష్ట్రలో వర్లీ ఆదీవాసీ పోరాటం, త్రిపుర గణ ముక్తి పరిషత్ పోరాటం, అస్సాంలో సుర్మా వ్యాలీ ఉద్యమం జరిగాయి.. ఈ పోరాటాలకు క్లైమాక్స్ గా తెలంగాణ సాయుధ పోరాటం నిలిచింది. స్వాతంత్ర్య భారతదేశంలో రైతులు ఎదుర్కొంటున్న అనేక అంశాలపై ఆయన రచనలే గొప్ప వారసత్వం. అందరూ వాటిని అధ్యయనం చేయాలి.

నయా ఉదారవాద విధానాల అమలు జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన రచనలు చదవాల్సిన అవసరమున్నది.

- ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే

పోడు భూములకు పట్టాల పంపిణీ

జూన్ 24 నుంచి 30 వరకు...



- దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అర్హులకు ఇండ్ల స్థలాలు
- జులైలో గృహలక్ష్మి పథకం ప్రారంభం
- జులై 14న నిమ్స్ ఆస్పత్రి విస్తరణ పనులకు శంకుస్థాపన : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనులకు జూన్ 24 నుంచి 30 వరకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేయనున్నట్టు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. గ్రామాల్లో నివాసయోగ్య ప్రభుత్వ స్థలాలను గుర్తించి అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. జులైలో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ నేపథ్యంలో రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్ ఖరారు, పోడు భూముల పట్టాల పంపిణీ, తదితర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. పలు కీలకమైన నిర్ణయాలు ప్రకటించారు. నూతనంగా పోడు పట్టాలు పొందిన గిరిజనుల వివరాలు సేకరించి ఆర్థిక శాఖకు అందజేయాలనీ, వారికీ రైతుబంధు వర్తింపచేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఆర్‌ఓఎఫ్‌ఆర్ ద్వారా రైతుబంధు ...9లో

2న గన్ పార్కు వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు

- దశాబ్ది ఉత్సవాల షెడ్యూల్ విడుదల

వివరాలు 9లో

సమ్మెచేసిన ఆర్టిజన్లు మళ్లీ విధుల్లోకి

- 196మందికి ఊరట
- విద్యుత్‌శాఖ మంత్రితో ఎంఐఎం ఎమ్మెల్యే భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇటీవల విద్యుత్ సంస్థల్లో సమ్మె చేసి, విధుల నుంచి తొలగించబడిన 196 మందిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోనేం దుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు మంగళశారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, టీఎస్‌ట్రాన్స్‌కో,జెన్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డితో ఆర్టిజన్ల తరఫున ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ అబ్దుల్ బలాల, ఆయా సంఘాల ప్రతినిధులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొని, విధులకు గైర్హాజరై, తొలగించబడిన 196 మంది ఆర్టిజన్లను తిరిగి తీసుకుంటూ అక్కడికక్కడే ఉత్తర్వులు జారీ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం చేయొద్దని హెచ్చరించారు. మానవీయ దక్పథంతో వారికి తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్టు మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు.

రైట్..రైట్

అర్థరాత్రి కారు దిగి ట్రక్కులో ప్రయాణించిన రాహుల్

- డ్రైవర్ల మన్‌కీబాత్ విన్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత



చండీగఢ్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తర్వాత జనంలోకి వెళ్లటానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. కర్నాటక ఎన్నికలపుడు స్థానిక రెస్టారెంట్లకు వెళ్లి..అక్కడ టిఫిన్ తిన్నారు. అంతకుముందు ఢిల్లీ యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తాజాగా సోమవారం అర్ధరాత్రి అతను కారు దిగి ...2లో

వీఓఏలపై నిర్బంధం తగదు

37 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టదా

- గొంతెమ్మ కోర్కెలు కోరట్లేదు.. అన్నీ న్యాయమైనవే : సీఐటీయూ జాతీయ నాయకులు ఎం.సాయిబాబు
- ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మెపై రాష్ట్ర సర్కారు నిర్బంధం తగదని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. వారి తొమ్మిది డిమాండ్లలో ఒక్కటి ...2లో



గ్రామ పంచాయతీలకు రూ.1190 కోట్లు విడుదల

- హర్షం వ్యక్తం చేసిన సర్పంచుల సంఘం

వివరాలు 9లో..

రేపు ఎంసెట్ ఫలితాలు

- 11 గంటలకు విడుదల చేయనున్న మంత్రి సబిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంసెట్ రాతపరీక్షల ఫలితాలు గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జేఎన్టీయూ హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈనెల 10,11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, 12 నుంచి 14వ తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఎంసెట్‌కు 3,20,683 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, వారిలో 3,01,789 (94.11 శాతం) మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. 18,894 మంది గైర్హాజరయ్యారు. తెలంగాణ నుంచి 2,48,479 మంది దరఖాస్తు చేయగా, 2,35,918 (94.94 శాతం) మంది పరీక్ష రాశారు. 12,561 మంది హాజరు కాలేదు. ఏపీ నుంచి 72,204 మంది దరఖాస్తు చేస్తే, 65,871 (91.23 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. 6,333 మంది గైర్హాజరయ్యారు.

తరుగు పేరుతో దగా

అడ్డగోలుగా కోత పెడుతున్నారని అన్నదాతల ఆగ్రహం

- తూకం వేసినా లారీలు పంపరా.. • వెంటనే ధాన్యం తరలించాలని డిమాండ్



నవతెలంగాణ - బోయినిపల్లి/ చందుర్తి / జుక్కల్

తేమ, తాలు పేరుతో ఇష్టారీతిన కోత పెడుతున్నారని, తూకం వేసిన ధాన్యాన్ని కూడా మిల్లులకు తరలించడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లో అన్నదాతలు ఆందోళనలు చేశారు. ఇసుకను తరలించేందుకు ఉన్న లారీలు ధాన్యాన్ని తీసుకెళ్లడానికి ఎందుకు ఉండవని ప్రశ్నించారు.

సిరిసిల్ల జిల్లాలోని బోయినిపల్లి మండలం బురుగుపల్లి గ్రామంలో తరుగు పేరుతో తూకంలోఅడ్డగోలుగా కోతపెడుతున్నారని ధర్నా రైతులు చేపట్టారు. వారికి మద్దతుగా సీపీఐ(ఎం) మండల కన్వీనర్ గురుజాల శ్రీధర్ మాట్లాడుతూ.. తాలు, తేమ వంటి కారణాలు చూపి బస్తాకు నాలుగైదు కిలోలు కోతపెట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు నగేష్, చంద్రయ్యా, కిష్టయ్యా, రామ లింగయ్యా, మల్లేశం, సత్తాయ్యా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తూకం వేసిన వరి ధాన్యాన్ని తరలించడం లేదని చందుర్తి మండలం మూడపల్లి గ్రామ రైతులు వేములవాడ-కోరుట్ల రహదారిపై బైటాయించారు. రహదారిపై ధాన్యం బస్తాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఘటనా స్థలానికి వచ్చి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో రైతులకు సర్పంచ్ అంజిబాబు, కిసాన్ సెల్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మద్దతు తెలిపారు.

ధాన్యం తరలించేందుకు లారీలు ఉండవా..?

ఇసుక తరలించేందుకు లారీలుంటున్నాయని, కానీ ధాన్యం తరలించేందుకు ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు లేవనే కారణంతో కొనుగోలు కేంద్రాలు మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో 161వ జాతీయ రహదారిపై పెద్దఎత్తున రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. లారీలు లేవనే సాకుతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసేశారని తెలిపారు. ఇసుక తరలించేందుకు లారీలు నడుస్తున్నాయని, ధాన్యం తరలించేందుకు మాత్రం లారీలు లేవంటున్నారని వాపోయారు. ఆ లారీలన్ని రాజకీయ నాయకులవే కావడంతో రెవెన్యూ, పోలీస్ శాఖ వారు పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డుపై వాహనాల టైర్లు వేసి మంటపెట్టి నిరసన చేపట్టారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

బిజినెస్

ఎఫ్‌డీఐల్లో 16శాతం పతనం



న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో భారత స్థూల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 16.3 శాతం పతనమై 71 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని ఆర్‌బీఐ గణంకాలు వెల్లడించాయి. ఇంతక్రితం ఏడాదిలో 84.8 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో 38.6 బిలియన్ డాలర్లుగా ఉన్న నికర ఎన్‌పీఏలు.. 2022-23లో 28 బిలియన్లకు పడిపోయాయని ఆర్‌బీఐ తన తాజా మాసం బులిటెన్‌లో వెల్లడించింది.

తయారీ రంగం, కంప్యూటర్ సర్వీసెస్, కమ్యూనికేషన్ సర్వీసెస్‌లో అధికంగా ఎఫ్‌డీఐలు పడిపోయా యి. అదేవిధంగా అమెరికా, స్విట్జర్లాండ్, మారిషస్ నుంచే వచ్చే పెట్టుబడు ల్లోనూ తగ్గుదల చోటుచేసుకుంది. గతేడాది సెమీకండక్టర్ పరిశ్రమలో అత్యధికంగా 26.2 బిలియన్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చొరవకు అనుగుణంగానే పెట్టుబడులు వస్తున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. గడిచిన ఏప్రిల్‌లో విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)లు ఈక్విటీ సెగ్మెంట్‌లో 1.9 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టారు.

కావేరి సీడ్స్‌కు రూ.1,000 కోట్ల రెవెన్యూ



హైదరాబాద్ : ప్రముఖ విత్తనాల కంపెనీ కావేరీ సీడ్స్ గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో 9.35 శాతం వృద్ధితో రూ.1,000.56 కోట్ల రెవెన్యూను సాధించినట్టు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది రూ.915 కోట్ల ఆదాయం నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.208 కోట్లుగా ఉన్న లాభాలు.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 27.83 శాతం వృద్ధితో రూ.267.94 కోట్లుగా ప్రకటించింది. పత్తి రెవెన్యూలో 2.87 శాతం పెరుగుదలను నమోదు చేసినట్టు తెలిపింది. మంగళవారం బీఎస్ఈలో కావేరి సీడ్ షేర్ 2.14 శాతం పెరిగి రూ.524.55 వద్ద ముగిసింది.

మెటాకు ఈయూ రూ.10వేల కోట్ల జరిమానా

శాన్‌ఫ్రాన్సిస్కో : ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఎజెన్సీ భారీ షాక్ ఇచ్చింది. ఈయూ వినియోగదారులకు చెందిన ఫేస్‌బుక్ డేటాను అమెరికాలోని సర్వర్లకు అక్రమంగా బదిలీ చేసిందనే ఆరోపణలపై యురోపియన్ డేటా ప్రొటెక్షన్ బోర్డు (డీపీసీ) భారీ జరిమానా విధించింది. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యూలేషన్‌ను మెటా ఉల్లంఘించినందున 1.2 బిలియన్ యూరోలు (దాదాపు రూ.10వేల కోట్లు) జరిమానా చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. వినియోగదారుల ప్రాథమిక హక్కులను మెటా హరించివేసిందని తెలిపింది. ఈ అంశంలో ఇంతక్రితం యూరోపియన్ యూనియన్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఆదేశాలను కూడా మెటా పట్టించుకోలేదని డీపీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్టోబర్ కల్లా యూరప్ వినియోగదారుల డేటాను అమెరికాకు బదిలి చేయడాన్ని నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది.

తాండూరులో మేఘా గ్యాస్ సేవలు ప్రారంభం



హైదరాబాద్: వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో మేఘా గ్యాస్ సేవలు ప్రారంభించినట్టు తెలిపింది. తాండూరు మోమిన్పేట రోడ్‌లోని హది ఫిల్లింగ్ స్టేషన్‌లో మేఘా గ్యాస్ సీఎన్‌జీ సేవలను అబ్దుల్ హది ప్రారంభించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్‌కు చెందిన ఈ ఫిల్లింగ్ స్టేషన్లో ఇక నుంచి మోటార్ వాహనాలకు అవసరమైన మేఘా గ్యాస్‌ను విక్రయిస్తారని ఆ సంస్థ తెలిపింది. ఇది ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 16వది, వికారాబాద్ జిల్లాలో రెండోది.

రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో మేఘా ఇంటింటికి వంట గ్యాస్‌ను పైప్‌ల ద్వారా సరఫరా చేస్తోంది. జిల్లాలోని 94 ప్రదేశాల్లో సీఎన్‌జీ, పీఎన్‌జీ గ్యాస్ సేవలను మేఘా గ్యాస్ అందిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మరో 33 సీఎన్‌జీ ఔట్లెట్లను ప్రారంభించనున్నట్టు జిల్లా ఇంచార్జి కోరా సాయి తరుణ్ చెప్పారు. గ్యాస్ వినియోగం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామనీ, అందుకే వాహనదారులు సీఎన్‌జీకి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

గచ్చిబౌలిలో ఆశా న్యూరోమోడ్యులేషన్ క్లినిక్ ఏర్పాటు

హైదరాబాద్ : మానసిక రోగులకు అత్యుత్తమ చికిత్సలు అందించడం ద్వారా, వారిలోని మానసిక, భావోద్వేగ, వ్యసన సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపే ఆశా హాస్పిటల్ తన అనుబంధ విభాగంలో ఉన్న ఆశా న్యూరోమోడ్యులేషన్ క్లినిక్‌ను గచ్చిబౌలిలో ప్రారంభించింది. దీంతో ఆ పరిసర ప్రాంత ప్రజల అవసరాలకు తగిన చికిత్స అందజేయడం జరుగుతుందని ఆ సంస్థ డైరెక్టర్ ఎంఎస్ రెడ్డి పేర్కొన్నారు. మానసిక, భావోద్వేగ, ధూమపాన, ఇతర వ్యసనాల వారు ఏర్పడిన సమస్యల పట్ల వారికి అనుమానాస్పదంగా ఉండటం కాకుండా, వారి సమస్యలకు సరైన చికిత్స అందించడం ద్వారా వారికి సహాయం చేయగలమన్నారు.

సామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' పోటీ

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ ఇండియా టెక్ ఆవిష్కరణల కోసం సాల్వ్ ఫర్ టుమారో పోటీని ప్రకటించినట్టు తెలిపింది. ఇప్పటికే దీనికి 50వేల పైగా రిజిస్ట్రేషన్లు వచ్చాయని పేర్కొంది. తమ ఆలోచనలను కార్యరూపంలో ఉంచడానికి పోటీలో నిలిచే ప్రముఖ మూడు బృందాలకు రూ.1.5 కోట్లు గెలుపొందే అవకాశం ఉందని తెలిపింది. మే 31 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు వెల్లడించింది.

రెవెన్యూ శాఖలో పదోన్నతులు కల్పించండి

- ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు ట్రెసా విజ్ఞప్తి
- వీఆర్‌ఏల రెగ్యులరైజేషన్‌పై కృతజ్ఞతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెవెన్యూ శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్లు, ఇతర కేడర్ల పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టాలని ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ట్రెసా ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలకు పే స్కేల్ ఇవ్వడానికి ప్రభుత్వ నిర్ణయంపట్ల కతజ్ఞతలు తెలిపారు. ట్రెసా నాయకులు రిప్రెసెంట్ చేసిన అంశాలపై మిట్టల్ సానుకూలంగా స్పందించి సీఎం దష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా అన్ని కేడర్ల ప్రమోషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

నవ, యువ తోరణాలుగా రాష్ట్ర క్రీడా ప్రాంగణాలు

సీఎం కప్‌తో జిల్లాల్లో జోష్

- ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో
- విజేతలకు పతకాలు అందజేసిన ఆంజనేయగౌడ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం కప్‌తో జిల్లాల్లో జోష్ పెరిగింది. ఉత్సాహ భరిత వాతావరణంలో ఆటల పోటీలు జరుగుతున్నాయి. క్రీడా ప్రాంగణాలు కిక్కిరిపోయాయి. విజేతలకు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు మెడల్స్ అందజేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో సీఎం కప్ పోటీల్లోని విజేత లకు శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ పతకాలను అందజేశారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ పోటీల సందర్భంగా క్రీడా పోటీల తీరుని ఆయన పర్యవేక్షించారు. క్రీడా పోటీల్లో తల పడుతున్న జట్లను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఖోఖో, బాస్కెట్ బాల్, రైఫిల్ షూట్‌లలో ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. జిల్లా డీవైఎస్‌ఓ పరంధామ రెడ్డి బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కష్ణ చైతన్యతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడీల్లో 617 మండల కేంద్రాలలో నాలుగున్నర లక్షల మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఖమ్మం జిల్లా లోని మండలాల్లోనే పదహేను వందల మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడా కారులను తయారు చేయడమే లక్ష్యంగా క్రీడలను ప్రోత్సహిస్తు న్నామని తెలిపారు. రాష్ట్రంలో 17వేల క్రీడా ప్రాంగా ణాలను నిర్మించామని, వాటిని కేర్ టెకర్లుగా సంరక్షించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయిలో నిజామాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్, ఈషాసింగ్, కొత్తగూడెంకి చెందిన క్రికె టర్ త్రిష, చెస్‌లో గ్రాండ్ మాస్టర్‌గా నిలిచిన ఆదిత్య లాంటి వారు అద్భుతమైన విజయాలు సాధిస్తున్నా రని వివరించారు. క్రీడాకారులకు ప్రొఫెషనల్ కోర్సు ల్లో 0.5శాతం, ప్రభుత్వ ఉద్యోగాలలో రెండు శాతం ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పీఈటీల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామకష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధు లు,క్రీడాకారులు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

నల్గొండ జిల్లా కేంద్రంలో

నల్గొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో జరుగుతున్న జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల సందర్భంగా స్థానిక శాసన సభ్యులు కంచెర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆంజనేయగౌడ్ క్రీడా పోటీలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. అనంతరం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ సైదిరెడ్డి, గ్రంథా లయం చైర్మెన్ రెగట్టే మల్లికార్జున్‌రెడ్డితో కలసి విలేకర్ల సమావేశంలో ఆంజనేయగౌడ్ మాట్లాడారు. సీఎం కప్‌కి అద్భుతమైన స్పందన వస్తున్నదని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా క్రీడాకారులకు జూబ్లీహిల్స్ లాంటి ప్రాంతాలలో ఖరీదైనా 600 గజాల ఇండ్ల స్థలాలు, అత్యున్నత నగదు పురస్కారాలు ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్నట్టు తెలిపారు.

వీఓఏలపై నిర్బంధం తగదు

(మొదటిపేజీ తరువాయి)

కూడా గొంతెమ్మ కోర్కె లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లాల్లో వీఓఏలపై నిర్బంధాలు, అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగానే హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సాయిబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వమే మొండిగా వ్యవహరించి వీఓఏలు సమ్మెలోకి వెళ్లేలా చేసిందన్నారు. 19 ఏండ్లుగా సెర్ప్‌లో పనిచేస్తున్న వారి పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం తగదన్నారు. 37 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర సర్కారుకు పట్టదా? వారి కుటుంబాలు ఎలా బతకాలి? అని ప్రశ్నించారు. రూ.3,900 వేతనంతో ఎలా బతకాలో చూపెట్టాలని నిలదీశారు. యూనియన్ల అనుబంధాలకతీతంగా వీఓఏలు ఐక్యంగా సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమ్మెకు గ్రామ సమాఖ్యలు కూడా మద్దతిస్తున్నాయన్నారు. వీఓఏల విషయంలో రాష్ట్ర సర్కారు మొండి వైఖరిని విడనాడాలని సూచించారు. గతంలో వీరి సమ్మెకు ప్రస్తుత మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలనీ, ఆన్‌లైన్ పనులు రద్దు చేయాలనీ, సెర్ప్ సంస్థ నుండి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. మంత్రి ఎర్రబెల్లి జోక్యం చేసుకుని సమ్మె చేస్తున్న వీఓఏలతో చర్చలు జరపాలని కోరారు. ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ. రమ, భూపాల్, కె. ఈశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, ఎం. వెంకటేష్, ఐకేపీ వీఓఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, నగేష్, కోశాధికారి సుమలత, యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు రాములు, వెంకటయ్య, సరస్వతి, సీఐటీయూ నాయకులు జె. కుమారస్వామి, ఎ. సునీత, ఎస్ఎస్ఆర్ఏ ప్రసాద్, అజయ్‌బాబు, రాములు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి డీవైఎఫ్ఐ కేంద్ర కమిటీ సమావేశాలు

- హైదరాబాద్‌లోని ఎస్వీకేలో 28 వరకు నిర్వహణ
- పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) కేంద్ర కమిటీ సమావేశాలు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు మూడురోజులపాటు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే)లో జరగనున్నాయి. ఈ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంబంధిత వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26న విద్య, ఉపాధి, పర్యావరణం అంశాలపై సెమినార్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సెమినార్‌కు డీవైఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి హిమాగ్నరాజ్ భట్టాచార్య, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హాజరవుతారని వివరించారు. ఈనెల 27,28 తేదీల్లో డీవైఎఫ్ఐ కేంద్ర కమిటీ సమావేశాలు జరుగుతాయని అన్నారు. ఈ సమా వేశాలకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి యువజన సంఘం నాయకులు హాజరవుతారని చెప్పారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఉన్న ఉద్యోగాలనే తొలగిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు యువతను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించకుండా దేశ యువతలో మతోన్మాద విషబీజాలు నాటుతూ విద్వేషాలను రెచ్చగొడుతున్నదని అన్నారు. అందరికీ విద్య, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జావేద్, నాయకులు శివ, రఘు, శ్రీమాన్, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన్న అన్నదాతలు

తరుగు పేరుతో అడ్డగోలు కోత పెడుతున్నారని ఆగ్రహం

- తూకం వేసినా లారీలు పంపరా..
- వెంటనే ధాన్యం తరలించాలని డిమాండ్


బోయినిపల్లిలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు


చందుర్తిలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-బోయినిపల్లి/ చందుర్తి / జుక్కల్

తేమ, తాలు పేరుతో ఇష్టారీతిన కోత పెడుతున్నారని, తూకం వేసిన ధాన్యాన్ని కూడా మిల్లులకు తరలించడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లో అన్నదాతలు ఆందోళనలు చేశారు. ఇసుకను తరలించేందుకు ఉన్న లారీలు ధాన్యాన్ని తీసుకెళ్లడానికి ఎందుకు ఉండవని ప్రశ్నించారు.

సిరిసిల్ల జిల్లాలోని బోయిని పల్లి మండలం బురుగుపల్లి గ్రామంలో తరుగు పేరుతో తూకం లో అడ్డగోలుగా కోతపెడుతున్నారని ధర్నా రైతులు చేపట్టారు. వారికి మద్దతుగా సీపీఐ (ఎం) మండల కన్వీనర్ గురుజాల శ్రీధర్ మాట్లా డుతూ.. తాలు, తేమ వంటి కారణాలు చూపి బస్తా కు నాలుగైదు కిలోలు కోతపెట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు నగేష్, చంద్రయ్యా, కిష్టయ్యా, రామ లింగయ్యా, మల్లేశం, సత్తాయ్యా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తూకం వేసిన వరి ధాన్యాన్ని తరలించడం లేదని చందుర్తి మండలం మూడపల్లి గ్రామ రైతులు వేములవాడ-కోరుట్ల రహదారిపై బైటాయించారు. రహదారిపై ధాన్యం బస్తాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఘటనా స్థలానికి వచ్చి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో రైతులకు సర్పంచ్ అంజిబాబు, కిసాన్ సెల్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మద్దతు తెలిపారు.

ధాన్యం తరలించేందుకు లారీలు ఉండవా..?

ఇసుక తరలించేందుకు లారీలుంటున్నాయని, కానీ ధాన్యం తరలించేందుకు ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు లేవనే కారణంతో కొనుగోలు కేంద్రాలు మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో 161వ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. లారీలు లేవనే సాకుతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసేశారని తెలిపారు. ఇసుక తరలించేందుకు లారీలు నడుస్తున్నా యని, ధాన్యం తరలించేందుకు మాత్రం లారీలు లేవంటున్నారని వాపోయారు. ఆ లారీలన్ని రాజకీయ నాయకులవే కావడంతో రెవెన్యూ, పోలీస్ శాఖ వారు పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డుపై వాహనాల టైర్లు వేసి మంటపెట్టి నిరసన చేపట్టారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

ఎస్‌సీఈయూ రాష్ట్ర మహాసభ విజయవంతం

- 43 మందితో నూతన కమిటీ ఎన్నిక : యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



నవతెలంగాణ-గోదావరిఖని

గోదావరిఖని కేంద్రంగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభ రెండ్రోజులపాటు విజయవంతంగా జరిగిందని రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి తెలిపారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 43 మందితో ఎస్‌సీఈయూ రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసినట్టు రాజారెడ్డి తెలిపారు. 18 మందిని రాష్ట్ర ఆఫీస్ బెరర్స్‌గా, 25 మందిని రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చెప్పారు. మరోసారి గౌరవ అధ్యక్షులుగా ఈ. రాజారావు, రాష్ట్ర అధ్యక్షునిగా తుమ్మల రాజా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మంద నరసింహారావు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎస్.నాగరాజు గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి.మధు, రాష్ట్ర కోశాధికారిగా వై వెంకటేశ్వర్లు ఎన్నికైనట్టు వివరించారు. రామ గుండం రీజియన్‌లోని ఆర్జీ 1 నుంచి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా మెండె శ్రీనివాస్, కార్యదర్శులుగా మేదరి సారయ్య, ఆసరి మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా సీహెచ్ వేణుగోపాల్ రెడ్డి, ఎస్కే గౌస్, దాసరి సురేష్, ఆరెపల్లి రాజమౌళి, అన్నం శ్రీనివాస్, పి.శ్రీనివాస రావు, మల్యాల శ్యామలను, ఆర్జీ 3 నుంచి ముగ్గురు రాష్ట్ర ఆఫీస్ బేరర్స్‌గా, నలుగురు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. ఈ మహాసభలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై నివేదిక ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు. వీటిపై భవిష్యత్ లో యూనియన్ పోరాటం ఉంటుందని తెలిపారు. సమావేశంలో నాయకులు మేదరి సారయ్య, మెండే శ్రీనివాస్, ఆసరి మహేష్, ఎస్కే గౌస్, ఆరెపల్లి రాజమౌళి, దాసరి సురేష్, మామిడాల శ్రీహరి, ఐ.రమేష్, జి.శంకర్, ఇప్పలపల్లి సతీష్ కుమార్, జే మల్లేష్, ఆతుకూరి రాజయ్య తదితరులున్నారు.

అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ 25న విచారించాలి

- గత విచారణలను వెకేషన్ బెంచ్ పరిగణలోకి తీసుకోవాలి : తెలంగాణ హైకోర్టుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌పై ఈ నెల 25న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరపాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అంతవరకూ తనను అరెస్టు చేయకుండా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అవినాష్ రెడ్డి చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తాను దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారించేలా తెలంగాణ హైకోర్టును ఆదేశించాలని కోరుతూ వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌కు హత్య కేసు దర్యాప్తును ట్రయల్ కోర్టు పర్యవేక్షించవచ్చా.. లేదా? అన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని వివేకా కుమార్తె సునీతా రెడ్డి దాఖలు చేసిన అప్లికేషన్‌ను జత చేసింది. ఈ రెండింటినీ కలిపి మంగళవారం జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ పిఎస్ నరసింహతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ ధర్మాసనం విచారించింది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 24న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన తరువాత కూడా తెలంగాణ హైకోర్టు నిర్ణయం తీసుకోకపోవడం పట్ల సుప్రీం కోర్టు ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

నయా భూస్వాముల్ని తరిమికొట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని రెండు తీరప్రాంత గ్రామాల రైతుల స్థితిగతులను అధ్యయనం చేసే కరపత్రాన్ని సిద్ధం చేశారని అన్నారు. వ్యవసాయ సంబంధాలపై ఆయనకు లోతైన అవగాహన ఉందని అన్నారు. వ్యవసాయ రంగంలో చాలా ముఖ్యమైన నీటిపారుదల ప్రాజెక్టులపై ఆయన అనేక నివేదికలు అందించారని తెలిపారు. ప్రతి ప్రాంత భౌగోళిక లక్షణాలను అర్థం చేసుకోవడానికి సుందరయ్య అనేక మ్యాప్‌లను కూడా సేకరించారని అన్నారు. రైతు ఉద్యమం, వ్యవసాయ పరిస్థితులు అర్థం చేసుకోవడం, ప్రభుత్వ విధానాలు వంటి పరిశోధనలకు సహకరించే విధంగా 2014లో ఈ ట్రస్ట్ ను ప్రారంభించామని ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పి.సుందరయ్య మెమోరియల్ ట్రస్ట్ డైరెక్టర్ బోర్డు సభ్యులు హన్నన్ మొల్లా, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైట్..రైట్

(మొదటిపేజీ తరువాయి)

ట్రక్కులో ప్రయాణించారు. రాహుల్ కారు ఆపి..తన లారీలోకి ఎక్కటంతో..ఆ వాహనచోదకుడు ఆశ్చర్యపోయాడు. లారీలో కొద్దిదూరం ప్రయాణించాక..ఓ డాబా వద్ద లారీని ఆపి.. అక్కడ ఉన్న ట్రక్కు డ్రైవర్ల సమస్యల్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రాహుల్ ప్రయాణానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

సోదరి ఇంటికి వెళ్తూ...

సిమ్లాలోని తన సోదరి ప్రియాంక ఇంటికి రాహుల్ వెళుతుండగా.. ఢిల్లీ- చండీగఢ్ జాతీయ రహదారిపై ట్రక్కులో ఎక్కి ప్రయాణించారు. హర్యానాలోని ముర్తాల్ నుంచి అంబాలా వరకు ట్రక్కులో ప్రయాణించిన రాహుల్... డ్రైవర్ల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 'దేశవ్యాప్తంగా 90 లక్షల మంది లారీ డ్రైవర్లు ఉన్నారు. వారి మన్‌కీ బాత్‌ను రాహుల్ గాంధీ విన్నారు' అని కాంగ్రెస్ పార్టీ ట్వీట్ చేసింది. ఇక నెట్టింట్లో వైరల్ అవుతున్న ఈ వీడియోను చూసిన నెటిజన్లు కామెంట్స్ చేశారు.

'మీరు అతనిని పార్లమెంటు నుంచి అనర్హులుగా ప్రకటించవచ్చు. కానీ ప్రజల హృదయాల నుంచి రాహుల్ ను ఎన్నటికీ అనర్హులుగా చేయలేరు' అని ట్విట్టర్ యూజర్ రాసుకొచ్చారు.

గంజాయి రూటు మారింది

మిర్చిబజ్జీలు, సమోసాల్లో కలిపి విక్రయాలు

- పట్టణాలు సహా గ్రామాల్లోనూ గుప్పుమంటున్న మత్తుపదార్థాలు
- అంబులెన్సులు, ద్విచక్రవాహనాల్లో తరలింపు
- పట్టుబడుతున్న కేసులన్నీ రూరల్ ప్రాంతాల్లోనివే..
- ఏపీ, మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకొస్తున్న ముఠా
- 'డ్రగ్ ఫ్రీ' లక్ష్యంతో పోలీస్ శాఖ దృష్టిసారింపు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

గంజాయి రూటు మారింది. పంథా మార్చుకున్న కేటుగాళ్లు.. ఊహించని రీతుల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. ఇది పట్టణాల నుంచి గ్రామాలకూ పాకింది. తినే పదార్థాల్లో కలిపి మరీ గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో రెండ్రోజుల కిందట మిర్చిబజ్జీలు, సమోసాల్లో కలిపి విక్రయిస్తుండగా పోలీసులు బట్టబయలు చేశారు. ఇన్నాళ్లు సిగరేట్ పీకల్లోనూ, కూల్ డ్రింక్స్‌లోనూ కలిపి అలవాటు చేసేవారు. ఇప్పుడు తినుబండారాల్లో కలిపి మరీ అలవాటు చేస్తున్నారు. ఇక ఇటీవల పట్టుబడుతున్న కేసులన్నీ గ్రామీణ ప్రాంతాల్లోనే కావడం గమనార్హం. ఏపీ, మహారాష్ట్ర నుంచి అడ్డదారుల్లో తీసుకొస్తున్న కేటుగాళ్లు.. అంబులెన్స్‌ల్లోనూ తరలిస్తున్నారు. విద్యార్థులు, కార్మికులే టార్గెట్‌గా విక్రయిస్తున్న ముఠా సభ్యులు వారినీ ఈ దందాలోకి లాగుతున్నారు. ఈజీమనీ కోసం యువతే పెద్దఎత్తున గంజాయి స్మగ్లింగ్‌లో చేరి జీవితాలు నాశనం చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.

పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని రకాలుగా నిఘా పెట్టినా.. గంజాయి స్మగ్లర్లు సరికొత్త దారులను వెతుక్కుంటున్నారు. కొన్నాళ్లుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఉన్నత చదువులు చదువుకుని ఎదగాల్సిన సమయంలో యువత మత్తులో జోగుతోంది. జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని ఈ దందాలో చేరుతున్న తీరును పోలీసులు గమనించారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో ఓ అంబులెన్స్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా.. గంజాయి బయటపడింది. కేసులు నమోదు చేసిన పోలీసులు నిందితుల నుంచి గంజాయి లింకును ఛేదించే పనిలో ఉన్నారు. అయితే నిందితులకు విక్రయించిన వారి వివరాలుగానీ, సమాచారంగానీ సరిగా లేకపోవడం, ఇతర రాష్ట్రాల్లో వారి దందా సాగడం వంటి పరిస్థితుల్లో పోలీసులు మరింత శ్రమించాల్సి వస్తోంది. ఏదేమైనా కరీంనగర్ కమిషరేట్ వ్యాప్తంగా పరిశీలిస్తే 2020లో 27 కేసులు నమోదు చేసిన పోలీసులు 71మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 381.830కిలోగ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 2021లో 24 కేసులు నమోదు చేసి 384.430 కిలోగ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని 61మందిని అదుపులోకి తీసుకున్నారు. గతేడాది 2022లో 22 కేసులు నమోదు చేసి 59మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 33.919కిలోగ్రాముల గంజాయిని, 0.600మిల్లీ లీటర్ల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

'డ్రగ్ ఫ్రీ' లక్ష్యంతో..

'డ్రగ్ ఫ్రీ' కరీంనగర్ లక్ష్యంతో పోలీస్ శాఖ దృష్టిసారించింది. గంజాయి రవాణా, ఇతర మత్తు పదార్థాలు, పానీయాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం అక్రమ రవాణా నియంత్రణ కోసం తనిఖీలు, దాడులను కొనసాగిస్తోంది. యువతను సన్మార్గంలో పయనింపజేయాలనే ఉద్దేశంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించి పట్టుబడిన వారికి వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తోంది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించినా పీడీయాక్ట్‌లు నమోదు చేస్తోంది. ఈ ఏడాది కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా 20మందిపై పీడీయాక్ట్‌లు నమోదు చేసింది.

మత్తుకు బానిసలు కావొద్దు

యువత మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు. ఎక్కువశాతం మంది యువత వాటిని మొదట సరదాగా తీసుకుని తర్వాత బానిసలుగా మారుతున్నారు. ఆ మత్తులో ఉన్మాదులుగా మారి హింసాయుత ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాల్సిన వయసులో ఎందుకూ పనిరాకుండా పోవడమే కాకుండా సమాజ వినాశకులుగా మారుతున్నారు. మత్తు పదార్థాలు విక్రయించినా, రవాణా చేసినా పీడీయాక్ట్‌లు నమోదు చేస్తాం.

ఎస్ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ(శాంతిభద్రతలు)

వేడి వేడి బజ్జీల్లో గంజాయి గుమ్ము

వేడి వేడి బజ్జీలంటే ఎవరు ఇష్టపడరు చెప్పండి. సాయంత్రం పూట స్నాక్స్ తీసుకునే సమయంలో వేడి బజ్జీలను తింటుంటే ఆ మజానే వేరు. రుచికరమైన బజ్జీలను సాయంత్రం వేళల్లో తినేందుకు చాలామంది స్నాక్స్ సెంటర్ల ముందు క్యూ కడతారు. అదే సమయంలో బజ్జీలలో మత్తు పదార్థమైన గంజాయిని కలిపి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యవహారం రెండ్రోజుల కిందట రాజన్నసిరిసిల్ల జిల్లాలో వెలుగుచూసింది. జీవనోపాధి నిమిత్తం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన ఒక వ్యక్తి కోనరావుపేట మండలంలో ఒక హోటల్ నడుపుతున్నాడు. ఈ హోటల్‌లో బజ్జీలలో గంజాయి కలుపుతూ ప్రజలకు విక్రయిస్తున్నాడు. కొంతమంది స్థానికులు దీనిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హోటల్‌లో తనిఖీ చేయగా.. నిందితుడి గుట్టు బయటపడింది. గంజాయి ఆకులను ఎండబెట్టిన తర్వాత మిర్చీలు, బజ్జీలలో కలుపుతున్నట్టు పోలీసులు తేల్చారు. హోటల్ యజమానితోపాటు అతడికి సహకరిస్తున్న మరొక వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు.

పీఆర్ ఇంజినీరింగ్ శాఖలో భారీగా పునర్వ్యవస్థీకరణ

- కొత్తగా 87 పోస్టుల మంజూరు
- మెరుగుపడనున్న పనితీరు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖను భారీగా పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈమేరకు గత ఆరు నెలలుగా జరుగుతున్న కసరత్తుకు మంగళవారం జారీ చేసిన జీవోతో కొలిక్కి వచ్చినట్టయింది. దాదాపు 87 పోస్టులను కొత్తగా మంజూరు చేస్తూ సర్కారు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయా మంగళవారం జీవో 18 విడుదల చేశారు. అలాగే ఆయా హోదాల్లో ఉన్న ఇంజినీర్లకు అధికారాల బదలాయింపు సైతం చేశారు. దీనికోసం మరో జీవో నెంబరు 19 జారీ అయింది. దీంతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ మరింత చురుగ్గా పనిచేసేందుకు అవకాశం కలుగుతున్నది. రాష్ట్ర విద్యుత్, ఆర్ అండ్ బీ, సాగునీటి పారుదల శాఖ తరహాలోనే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖను బలోపేతల చేయాలని సీఎం కేసీఆర్ భావించారు. ఈమేరకు ప్రతిపాదనలను పంపాలని గత ఏడాది నవంబరులో ఇంజినీర్ ఇన్ చీఫ్ ఏజీ సంజీవరావను ఆదేశించారు. దీంతో ఈఎన్సీ తన శాఖలో పని, ప్రస్తుతం ఉన్న పోస్టులు, అదనపు కావాల్సిన పోస్టులతో సమగ్రంగా నివేదిక పంపారు. దీన్ని పరిశీలించిన సీఎం మరోసారి పరిశీంచి ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఈ బాధ్యతను ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పంచాయతీరాజ్ శాఖ ఎర్రబెల్లి దయాకర్‌రావుకు అప్పగించారు. ఆయా దశలు, స్థాయిల్లో సంప్రదింపుల అనంతరం పంపిన ప్రతిపాదలను తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదముద్రవేశారు. ఆ మేరకు మంగళవారం జీవోలు విడుదల అయ్యాయి. పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన అనంతరం అన్నిస్థాయిల్లో కొత్తగా మరో 87 పోస్టులు ఆయా స్థాయిల్లో పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆ శాఖ పనితీరు మరింత మెరుగుపడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన ప్రకారం కొత్తగా నాలుగు చీఫ్ ఇంజినీర్, 12 సర్కిల్ ఇంజినీర్, 11 డివిజనల్ ఇంజినీర్, 60 సబ్ డివిజినల్ ఇంజినీర్ పోస్టులను మంజూరు చేసింది. వివిధ స్థాయిల్లో ఇంజినీర్లకు పనులు మంజూరు చేసే అధికారం కల్పించింది. డీఈఈకి ఏడాదికి రూ. 5 లక్షలు, ఈఈకి ఏడాదికి రూ. 25 లక్షలు, ఎస్ఈకి రూ.కోటి, సీఈకి రూ.2.5 కోట్లు, ఈఎన్సీకి రూ.54 కోట్ల వరకు పరిపాలనా అనుమతులు ఇచ్చే అధికారం కల్పిస్తూ ఆదేశాలిచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పీఆర్ ఇంజినీరింగ్ శాఖలో సంబరాలు నిర్వహించారు. అన్ని జిల్లాల్లో ఇవి జరిగాయి.

సీఎంకు కృతజ్ఞతలు : ఏజీ సంజీవరావు, ఈఎన్సీ

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు భారీగా పోస్టులు మంజూరు చేసినందుకుగాను ఈఎన్సీ ఏజీ సంజీవరావు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ మరింత మెరుగ్గా నిర్వహించి సీఎం గారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న పీఆర్ ఇంజినీరింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఇంజినీర్లు, ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈఎన్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోస్టులు మంజూరయ్యాయని చెప్పారు. నేను ఈఎన్సీగా ఉన్నప్పుడు శాఖను పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరణకు చేయడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇందుకు సహకరించిన మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు, ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ , ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఏ.శాంతికుమారి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు, సుల్తానీయా, సీఎంవో కార్యదర్శి స్మీతా సభర్వాల్ తదితరులకు దన్యవాదాలు తెలియజేశారు. కార్యాలయంలో ఇంజినీర్లు, ఉద్యోగులు టపాసులు పేల్చారు. అనంతరం స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో సీఈ జి సీతారాములు, ఎస్ఈలు అశోక్, ఎం. సురేశ్, ఈఈ డి రమేశ్‌కుమార్, బిశ్రీహరి, ఏటీఎంఎ ముజీబ్, డిప్యూటీ ఈఈ అబ్బు శ్రీనివాస్, టీఎస్‌పీఆర్‌ఈఏ ఉపాధ్యక్షులు జి.నరేంద్రప్రసాద్, పి చంద్రమౌళి, ఎం. భూమన్న, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం లింక్ 3 పనులు సంపూర్ణం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన లింక్ 3 పనులు సంపూర్ణమయ్యాయి. దీంతో రాజరాజేశ్వర జలాశయం నుంచి ఎగువ మానేరుకు గోదావరి జలాలు ఎదురెక్కే సమయం ఆసన్నమైంది. రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల సలహాదారు పి. పెంటారెడ్డి నేతత్వంలో సోమవారం అర్ధరాత్రి నుంచి చేస్తున్న వెట్ రన్ ప్రయత్నాలు మంగళవారం విజయవం తమయ్యాయి. అనంతరం మల్కపేట రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు పరవళ్లు తొక్కాయి. అక్కడి నుంచి సింగసముద్రం, ఆపై ఎగువ మానేరుకు జలాలు తరలనున్నాయి. లింక్ 3 ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తంగా లక్ష ఎకరాలకు సాగునీరందనుండగా, దాదాపు 150 చెరువులను నింపనున్నారు. ఈ మేరకు సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

వీఓఏల సమ్మె పరిష్కారం కోసం చొరవ చూపండి

సీఎం ప్రధాన సలహాదారులు సోమేశ్‌కుమార్‌కు సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐకేపీ వీఓఏల సమ్మె పరిష్కారం కోసం చొరవ చూపి సీఎం కేసీఆర్‌తో స్పష్టమైన ప్రకటన చేయించాలని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారులు బి.సోమేశ్‌కుమార్‌ను సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ కోరారు. సీఎం ప్రధాన సలహాదారులుగా నియమితులైన ఆయన్ను వారు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏలు చేస్తున్న సమ్మె గురించి వివరించారు. వారి డిమాండ్లను ప్రస్తావించారు. వారికి రూ.3,900 వేతనం మాత్రమే అందుతున్న దన్నారు. దాంతో వారి కుటుంబాలు గడవటం కష్టమైతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చాలాసార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పటికీ పనికి తగిన గుర్తింపు గానీ, వేతనం గానీ ఇవ్వడం లేదని వాపోయారు. రోజురోజుకీ వారిపై పని భారం పెంచుతూ పని భద్రత కల్పించకుండా విస్మరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని హామీనిచ్చారు. సెర్ప్ సీఈఓ సందీప్ కుమార్ సుల్తానియాతో మాట్లాడుతాననీ, చర్చలకు యూనియన్ ప్రతినిధి బృందాన్ని పిలవాలని కోరతానని చెప్పారు.

రైతులను మోసం చేస్తే పీడీ యాక్ట్

నకిలీ విత్తనాల నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు : సీపీ డీఎస్ చౌహాన్



నవతెలంగాణ-హయత్‌నగర్

రైతే దేశానికి వెన్నెముక.. రైతు లేనిదే దేశం లేదని.. వారిని మోసం చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్ హెచ్చరించారు. నకిలీ విత్తనాల సరఫరా, క్రయ విక్రయాలపై తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ శాఖ అధికారులతో మంగళవారం రాచకొండ సీపీ ఎల్బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలను, ఎరువులు, నాసిరకం పురుగుల మందులను అంటగట్టి రైతులను మోసం చేస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాల కట్టడిలో వ్యవసాయ అధికారులకు కమిషనరేట్ తరపున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. నకిలీ విత్తనాల అమ్మకం, సరఫరా వంటివి చేసినందుకు కమిషనరేట్ పరిధిలో ఐదేండ్లలో 14 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశామని తెలిపారు. రైతులు విత్తనాల ప్యాకెట్ల మీద అధీకృత సమాచారం, లోగో వంటి వాటిని బాగా పరిశీలించాకే కొనాలని సూచించారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయశాఖ అధికారులు ధ్రువీకరించిన ప్రముఖ కంపెనీల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని, వ్యాపారస్తుల నుంచి తీసుకున్న బిల్లులు కూడా జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను నియమించామని, వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నకిలీ విత్తన, ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ఎవరైనా తక్కువ ధరకు పత్తి విత్తనాలు కానీ మరేమైనా విత్తనాలు ఇస్తామని మాయమాటలు చెబితే వారి వివరాలను ప్రజలు పోలీసులకు చెప్పాలని కోరారు. నకిలీ విత్తనాల గురించి ఎటువంటి ముందస్తు సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100కి కాల్ చేసి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ, యాదాద్రి, మల్కాజిగిరి- మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల అగ్రికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు



15 రోజులుగా నీళ్లు లేవ్..

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

నవతెలంగాణ-వెంకటాపురం

మూడు నెలలుగా తాగు నీటికోసం అవస్థ.. 15 రోజులుగా తాగునీరు వచ్చినా రెండు బిందెలే.. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో విసిగి వేసారిన ములుగు జిల్లా వెంకటాపురం ఉప్పెడు గొల్లగూడెం మహిళలు మంగళవారం భద్రాచలం-వెంకటాపురం ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైటాయించారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ సంఘటన ప్రాంతానికి వెళ్లారు. ఆందోళన విరమించాలని గ్రామస్తులతో చర్చించారు. 15 రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న ఒక్క బోరు మరమ్మతులకు గురైందని వివరించారు. బోరు పనిచేయక, పంచాయతీ నల్ల రాక తాగునీటికి ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని సర్పంచ్, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు.


సంబంధిత అధికారులు హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. అధికారులు ఫోనులో గ్రామస్తులతో మాట్లాడి స్పష్టమయిన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సంపాదకీయం

పునరాలోచించాలి

నీరు ప్రాణాధారమన్నాడో కవి... అన్నింటికి నీరుకావాల్సిందే... నీలువ నీడకై కరువు, నీలువ నీటితో చెరువు... నీరు లేక ఊరు ఎలా బతుకుతుంది... మనుషులకే కాదు పశుపక్షాదులకు తాగునీరు... పంట పొలాలకు సాగునీరు... నేనుంటే ఇంట్లో వండిన కుండ ఉన్నట్టే" ఇది చెరువు స్వగతం. ఆరో తరగతి పుస్తకంలో విద్యార్థులకు సర్కారు చెబుతున్న పాఠం. చెరువు అవసరం, దాని ప్రాధాన్యతను ఈ పాఠం చెప్పకనేచెబుతున్నది. కానీ ఇప్పుడు జరుగుతున్నది వేరు. మూడు దశాబ్దాల క్రితం గండిపేట(ఉస్మాన్‌సాగర్), హిమాయత్‌సాగర్ జలాశయాల పరిరక్షణ కోసం తెచ్చిన జీఓ 111ను రాష్ట్ర ప్రభుత్వం తాజా క్యాబినెట్ సమావేశంలో రద్దు చేసింది. ఈనేపథ్యంలో రియల్టర్లు, స్థానిక ప్రజలు సంతోషపడుతుండగా, పర్యావరణవేత్తలు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఈ జీఓను ఎత్తేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలోనే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రకటించాయి. జంట జలాశయాలతో హైదరాబాద్ మహానగరానికి తాగునీటి వసతి కల్పించడం కోసం నైజాం కాలంలోనే ఒక ప్రత్యేక 'ఫర్మానా' ఉండేది. ఆ తర్వాత వచ్చిన పౌర ప్రభుత్వాలు తెచ్చిన అనేక జీఓల్లో కీలకమైంది 111. ఆ రెండు జలాశయాల చుట్టూ 10కిలోమీటర్ల పరిధిలో నిర్మాణాలు చేయడం, జలాలు కలుషితం కాకుండా చూడటం. జీవవైవిధ్యంతోపాటు పర్యావరణాన్ని కాపాడటం కీలక కర్తవ్యాలు. ఈ జీఓ పరిధి ఆవల భూముల ధరలకు రెక్కలొచ్చి కోట్లకు పడగలెత్తాయి. కానీ లోపల సొంతిండ్లు కూడా నిర్మించుకోలేని దుస్థితిలోకి స్థానికులు వెళ్లిపోవడంతో సహజంగానే ఆందోళనకు కారణమయ్యాయి. విశాల దృక్పథంతో పరిశీలించినప్పుడు దాదాపు కోటి జనాభాకు ఆశ్రయమిస్తున్న హైదరాబాద్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, అదే సందర్భంలో స్థానిక ప్రజల అవసరాలు తీర్చటం సర్కారుకు కత్తిమీద సామే అయింది.

> జీఓ ఎత్తివేతతో దాదాపు ఏడు మండలాల పరిధిలోని 84గ్రామాల్లో రియాల్టీకి ఊపు పెరుగుతుంది. కానీ పర్యావరణం దెబ్బతింటుంది. అందుబాటులోకి వచ్చే 1.5లక్షల ఎకరాల భూమి నిర్మాణరంగం కొత్త పుంతలు తొక్కుతుందనడంలో సందేహం లేదు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాల అవసరం ప్రస్తుతం హైదరాబాద్‌కు లేదనీ, కృష్ణా, గోదావరులతో మరో వందేండ్ల వరకు మహానగరానికి తాగునీటి కొరత రాదని సాక్షాత్తు ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలోనే చెప్పారు. అయితే నిజానికి ఆ ఏడు మండలాల్లో ఇప్పుడున్న పరిస్థితులు విభిన్నం. స్థానిక రైతులు తమ భూములు అమ్మేసుకుని వాటిలోనే కూలీలుగా మారిపోయారు.



జీఓ ఎత్తివేతతో దాదాపు ఏడు మండలాల పరిధిలోని 84గ్రామాల్లో రియాల్టీకి ఊపు పెరుగుతుంది. కానీ పర్యావరణం దెబ్బతింటుంది. అందుబాటులోకి వచ్చే 1.5లక్షల ఎకరాల భూమి నిర్మాణరంగం కొత్త పుంతలు తొక్కుతుందనడంలో సందేహం లేదు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాల అవసరం ప్రస్తుతం హైదరాబాద్‌కు లేదనీ, కృష్ణా, గోదావరులతో మరో వందేండ్ల వరకు మహానగరానికి తాగునీటి కొరత రాదని సాక్షాత్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలోనే చెప్పారు. అయితే నిజానికి ఆ ఏడు మండలాల్లో ఇప్పుడున్న పరిస్థితులు విభిన్నం. స్థానిక రైతులు తమ భూములు అమ్మేసుకుని వాటిలోనే కూలీలుగా మారిపోయారు. స్థానిక అంచనాల ప్రకారం ప్రజల దగ్గర ఉన్న భూమి కేవలం 25శాతమే. మిగతా 75శాతం పెట్టుబడిదారులు, రియల్టర్ల కబంధ హస్తాల్లోకి ఎప్పుడో వెళ్లిపోయిందన్నది కాదలేని నగ్నసత్యం. నిర్మాణాల మూలంగా వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు వచ్చి పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందనే సంగతిని ఆ రంగంలోని నిపుణులు నెత్తినోరూ మొత్తుకుంటున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదు. గంగానది పక్కన కాన్పూర్ నగర నిర్మాణమే నేటి చక్కటి ఉదాహరణ. రాష్ట్ర రాజధానిలోని సరూర్‌నగర్, కాప్రా, ప్రగతినగర్ చెరువులూ అంతే. మూసీ, హుస్సేన్ సాగర్ ప్రక్షాళన పేర వందల కోట్ల ప్రజాధనం అక్రమార్కులకు ఫలహారమే తప్ప ఫాయిదా లేదు. రియల్టర్ల మాయాజాలంలో ప్రభుత్వాలు చిక్కుకుని, దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తున్నాయి.

అసలు ఈ జీఓ వెనుక ప్రజల ప్రయోజనం కన్నా ఇతరేతరమే అధికం. బినామీల పేరుతో వేల ఎకరాలు సొంతం చేసుకున్న పెద్దలు, ఎకో ఫ్రెండ్లీ సిటీ పేరుతో లక్షల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డాయని ప్రతిపక్షాలు గుర్రుమంటున్నాయి. నీటివనరుల వృద్ధితోనే జీవవైవిధ్యం పరిఢవిల్లుతుంది. అంతేగాక సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాల పెంపుతోనే నీటివనరులు వృద్ధి చెందాయని అంటున్నారు. జీఓ 111 ఎత్తివేతతో తన విధానాన్ని తానే రద్దు చేసుకుంటున్నది. తాను కూర్చున్న చెట్టు కొమ్మనే నరుక్కుంటున్నది. జీఓ ఎత్తివేత చర్య మహానగరంపై అణుబాంబు లాంటిదేనంటూ పర్యావరణ వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ కోణమే తప్ప ప్రజాకోణం లేదంటున్నాయి ప్రతిపక్షాలు. అఖిలపక్ష సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుని ఉండి ఉంటే, దీర్ఘకాలిక ప్రజల ప్రయోజనాలు పరిరక్షించబడేవనే వాదన బలంగా వినిపిస్తున్నది.

రెండు సభలు - ఒకటి అభివృద్ధికి, రెండవది ఉద్రిక్తతలకు!

ఏ పదజాలం వెనుక ఏమి దాగుందో తెలుసుకోలేనంత కాలం జనం మోసపోతూనే ఉంటారు అన్న లెనిన్ మాటలు పరమ సత్యాలు. అలాగే ఏ సమావేశం ఎందుకు జరిగిందో అని కూడా మనం అర్థం చేసుకోవాల్సి ఉంది. ఒకేసారి ఆసియాలో రెండు ముఖ్య సమావేశాలు జరిగాయి. ఒకటి ప్రపంచంలో ఉద్రిక్తతలను రెచ్చగొడుతూ శాంతి, అభివృద్ధికి ముప్పు తెస్తున్న అమెరికా నేతృత్వంలోని జీ7 సమావేశం 19-21 తేదీలలో జపాన్‌లోని హిరోషిమాలో జరిగింది. రెండవది చైనాలోని షియాన్ నగరంలో మే 18-19 తేదీలలో మధ్య ఆసియా దేశాల సదస్సు. మొదటిది రాజకీయాల చుట్టూ నడిస్తే రెండవది అభివృద్ధి కేంద్రంగా జరిగింది. చైనాతో విడగొట్టుకోకుండానే నష్టాలను పరిమితం చేసుకోవాలని ఈనెల జపాన్‌లోని హిరోషిమా నగరంలో జరిగిన జీ7 దేశాల శిఖరాగ్ర సమావేశం పిలుపు నిచ్చింది. తన పాటకు అనుగుణంగా నృత్యం చేయించాలని ఈ బృందంతో సహా ప్రపంచదేశాలన్నింటి మీద అమెరికా ఒత్తిడి తెస్తున్నప్పటికీ దానికి కొన్ని దేశాలు సిద్ధంగా లేవన్నది ఈ ప్రకటనలో అంతర్లీనంగా ఉన్న సందేశం. అయితే పదజాలం దానికి చెప్పే భాష్యాలు ఎలా ఉన్నప్పటికీ సమావేశం జరిగిన తీరు, ఆమోదించిన ప్రకటన చూస్తే చైనా చుట్టూ తిప్పి దాన్ని ఎలా దెబ్బతీయాలన్న దాని మీదే కేంద్రీకరించారన్న విశ్లేషణలు వెలువడ్డాయి.



ఎం. కోటేశ్వరరావు

అమెరికా కోరుతున్నట్లుగా చైనాతో విడగొట్టుకొనేందుకు జపాన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి కొన్ని దేశాలు సిద్ధంగా లేవు. ఈ కారణంగానే ఆర్థిక అంశాల్లో బస్తీమే సవాల్ అంటూ చైనా మీద తొడగొట్టకుండా అటు అమెరికాను, ఇటు ఇతర దేశాలను సంతుష్టీకరించే విధంగా ఈ పిలుపు ఉంది. ఆర్థికంగా చైనా ఇతర దేశాలను బలాత్కారం చేస్తోందన్న ఆరోపణలను ఇటీవలి కాలంలో అనేక దేశాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. హిరోషిమా సమావేశాలు కూడా దాని చుట్టూ తిరిగాయి గానీ బహిరంగంగా వేలెత్తి చూపేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చైనా నుంచి చేసుకొనే దిగుమతులను తగ్గించుకొని ప్రత్యామ్నాయం చూసుకోవాలని చెప్పారు. చైనా నుంచి విడగొట్టుకోవటం ఇప్పట్లో జరిగేది కాదని తెలుసు గనుకనే ప్రతి దేశం తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకొనేందుకు చూస్తుంది తప్ప చైనా ఆర్థిక ప్రగతి, అభివృద్ధిని అడ్డుకోవటం తమ ఉద్దేశ్యం కాదని వివరణ ఇచ్చుకొనేందుకు చూశాయి. దశాబ్దాల తరబడి పక్షవాత రోగి మాదిరిగా ఉన్న జపాన్‌కు చైనాతో వాణిజ్య సంబంధాలు ఎంతో అవసరం. గత సంవత్సరం జపాన్ చైనాకు 189బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు, 145బి.డాలర్ల దిగుమతులు చేసుకుంది. నష్టాలను తగ్గించుకోవటం అంటే అవసరమైన వస్తువుల కోసం ఒక దేశం మీద ఆధారపడకుండా చూసుకోవాలన్నది అమెరికా వైఖరి అని జో బైడెన్ చెప్పాడు. చైనాలో పెట్టుబడులతో ముప్పు కూడా ఉంటుందని తెలిసినప్పటికీ తాము పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ చెప్పాడు.

చైనాతో సంబంధాలను విడగొట్టుకోవాలని జీ7 కోరుకోవటం లేదు, ఎందుకంటే అది ఎంతో కష్టం, ఇబ్బందులను కూడా తెస్తుంది, సాధ్యం కూడా కాదు అని కునీహికో మియాకే అనే విశ్లేషకుడు చెప్పాడు. అందుకే సమావేశ ప్రకటనలో విడగొట్టుకోవటం అనే పదం బదులు ముప్పు తగ్గించుకోవటం అని చెప్పారని అన్నాడు. జీ7 సమావేశం చైనా వ్యతిరేక (వర్క్‌షాప్) కసరత్తు అని చైనా పత్రిక గ్లోబల్ టైమ్స్ వర్ణించింది. 2021 నుంచి జీ7 సమావేశాల ప్రకటనలు క్రమంగా ట్రాఫిక్ సిగ్నల్ మాదిరి మారుతూ చైనాను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, ఆ బృందం పూర్తి పేరు ఏడు పారిశ్రామిక శక్తి దేశాల బృందం అనీ, ఆర్థికంగా చేసేదేమీ లేక ఇప్పుడది ఒక చిన్న వర్క్‌షాప్‌గా పని చేస్తూ చైనా వ్యతిరేక నకిలీ ఉత్పత్తుల సామూహిక ఉత్పత్తి మీద కేంద్రీకరిస్తోందని గ్లోబల్‌టైమ్స్ ఎద్దేవా చేసింది. తాజా ప్రకటనలో తైవాన్, తూర్పు చైనా సముద్రం, దక్షిణ చైనా సముద్రం, హాంకాంగ్, షింజియాంగ్, చైనా అణుశక్తి అంటూ ఇరవైసార్లు చైనా పేరును పలవరించినట్లు పేర్కొన్నది. దీనికి తోడు చైనా ఆర్థిక బలత్కారాన్ని కూడా చేర్చినట్లు పేర్కొన్నది. శిబిరాల మధ్య ఘర్షణలను కోరుతూ ఈ బృందం ప్రపంచ శాంతి, అభివృద్ధికి అతి పెద్ద ముప్పులలో ఒకటిగా మారినట్లు స్పష్టం చేసింది.

ఆర్థిక అంశాలకు సంబంధించి సమావేశ ప్రకటనలో మాటల గారడీ చేసినా రాజకీయాలకు వస్తే చైనా మీద దూకుడుగానే ఉన్నారు. దక్షిణ చైనా సముద్రంలో అంతర్జాతీయ ఆర్థిక నియమావళిని తిరిగి రాసేందుకు పూనుకుందని ఆరోపించాయి. సిడ్నీలో జరగాల్సిన చతుష్టయ(క్వాడ్) సమావేశాలు రద్దు కావటంతో పరువు దక్కించుకొనేందుకు హిరోషిమాకు వచ్చిన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారతదేశ నేతలు ఇష్టాగోష్టిగా మాట్లాడుకున్నారు. ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీని ఆహ్వానించి జీ7 సభ్యదేశాలన్నీ అతని వెనుక నిలిచాయి. సాయాన్ని పెంచనున్నట్లు ప్రకటించాయి. ఈ పరిణామాలను చూసినప్పుడు ఈ సమావేశం చైనా, రష్యాల మీద కేంద్రీకరించినట్లు చెప్పకనే చెప్పింది. ఈ ప్రకటనలు చేస్తుండగానే దీర్ఘకాలంగా పోరు సాగుతున్న బఖుమత్ పట్టణాన్ని రష్యా తన అదుపులోకి తెచ్చుకొని ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్న దేశాల పప్పులు ఉడకవనే సందేశాన్ని పంపింది. గత సమావేశాలు లేదా ఇతర శిఖరాగ్ర సమావేశాలకు భిన్నంగా హిరోషిమా సభ ఒక రోజు ముందుగానే సమావేశ ప్రకటనను విడుదల చేసింది. మీడియాలో జెలెన్‌స్కీకి ప్రాధాన్యత ఇచ్చి ఈప్రకటనను పక్కన పడవేస్తారన్న కారణంగా ముందుగానే విడుదల చేసినట్లు కొందరు చెప్పారు. నిజానికి గుడ్డి కన్ను మూసినా ఒకటే తెరిచినా ఒకటే అన్నట్లుగా సమావేశం చేసే ప్రకటనలో పరోక్షంగా లేదా ప్రత్యక్షంగా చైనా మీద కేంద్రీకరించటం తప్ప కొత్తగా చెప్పేదేమీ ఉండదని ముందుగా ఊహించిందే. దానికోసం ప్రకటన దాకా ఆగాల్సిన అవసరం కూడా లేదు. చైనా మీద ఒత్తిడి స్వరాన్ని పెంచినట్లు ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడటం, సహకరించుకోవటం లక్ష్యంగా ఏర్పడిన జీ7 ఇటీవలి కాలంలో దాని కంటే ప్రపంచ రాజకీయాల మీదనే ఎక్కువగా కేంద్రీకరిస్తున్నది. ఐదు దశాబ్దాల క్రితం పురుడు పోసుకున్న ఈ కూటమిలోని దేశాలు నాడు ప్రపంచ జీడీపీలో 70శాతం కలిగి ఉన్నాయి. ఇప్పుడు దాని విలువ నలభైశాతానికి అటూ ఇటూగా ఉంది.

అసలు జీ7 ఎలా ఉనికిలోకి వచ్చిందీ క్లుప్తంగా చూద్దాం... అమెరికా, జపాన్, కెనడా, నెదర్లాండ్స్‌తో తలెత్తిన వివాదంలో ఆ దేశాలకు చమురు సరఫరాలపై నిషేధం విధిస్తున్నట్లు ఒపెక్ దేశాలు చేసిన ప్రకటన 1973లో చమురు సంక్షోభానికి దారి తీసింది. దాని నుంచి బయటపడేందుకు ధనికదేశాల ఆలోచన నుంచి పుట్టిందే జీ7. చమురు, విత్త సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ధనిక దేశాలు ఉమ్మడిగా చేసిన ఆలోచనకు ఒక రూపమే 1975లో ఏర్పడిన ఈ దేశాల బృందం. అమెరికా చొరవతో పశ్చిమ జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ సమావేశానికి అమెరికా అధ్యక్షభవనంలోని గ్రంధాలయం వేదిక అయింది. దాంతో నాలుగు దేశాలను గ్రంధాలయ బృందం అని పిలిచారు. తరువాత జపాన్‌ను కూడా ఆహ్వానించాలని నిర్ణయించారు. అలా అది జీ5 అయింది. తరువాత ఇటలీ, కెనడాలను చేర్చుకున్న తరువాత జీ7 అయింది. 1998లో రష్యా చేరి జీ8గా మారింది. 2014లో ఉక్రెయిన్ ఏలుబడిలో ఉన్న క్రిమియా ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవటంతో ఆ బృందం నుంచి రష్యాను తొలగించిన తరువాత తిరిగి జీ7గా మారింది. 1981 నుంచి ఐరోపా సమాఖ్య (ఇయు)ను శాశ్వత ఆహ్వానిత సంస్థగా మార్చారు. శిఖరాగ్ర సమావేశాలప్పుడు ఎవరు దేశాల అధిపతిగా ఉంటే వారు ప్రతినిధిగా హాజరవుతారు. ప్రతి సంవత్సరం ఒక సభ్యదేశ ఆతిథ్యంలో శిఖరాగ్ర సమావేశాలు జరుగుతాయి. సహజంగా ఆ దేశాధినేతలే ఏడాది పాటు అధ్యక్ష స్థానంలో ఉంటారు. తమ దేశంలో జరిగే సమావేశాలకు ఇతర దేశాలను ఆహ్వానించే స్వేచ్ఛ ఆ దేశానికి ఉంటుంది. ఈ బృందానికి ఒక కేంద్ర స్థానం లేదా శాశ్వత సిబ్బందిగానీ ఉండరు. శిఖరాగ్ర సమావేశాల్లో ఐరాసతో సహా వివిధ ప్రపంచ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. ఇప్పటి వరకు గత తొమ్మిది సంవత్సరాల్లో నరేంద్రమోడీ నాలుగు సమావేశాల్లో పాల్గొన్నారు. అంతకు ముందు మన్మోహన్ సింగ్ పదేండ్ల కాలంలో ఐదు సార్లు అతిథిగా వెళ్లారు. ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక రంగంలో మన దేశానికి ఉన్న ప్రాధాన్యత రీత్యా మన దేశానికి ప్రతిదేశం ఆహ్వానం పలుకుతోంది. మన దేశం ఆహ్వానం అందుకోవటం నరేంద్రమోడీ ఘనత అన్నట్లు కొందరు చిత్రిస్తున్నారు. ఆహ్వానాలు అందుకున్న తొమ్మిది దేశాలలో మనది కూడా ఒకటి తప్ప ప్రత్యేకత ఏమీ ఉండదు. ఇలా పాల్గొన్నదేశాల అధినేతలు విడివిడిగా ఇతర దేశాల నేతలను కలుసుకోవటం, వేదిక మీద ధర్మోపన్యాసాలు చేయటం తప్ప బృంద నిర్ణయాలతో ఎలాంటి ప్రమేయం ఉండదు. ఈ ఏడాది అతిథులుగా ఆస్ట్రేలియా, బ్రెజిల్, కామెరూన్, కూక్ ఐలాండ్స్, భారత్, ఇండోనేషియా, దక్షిణ కొరియా, ఉక్రెయిన్, వియత్నాం అధినేతలను ఆహ్వానించారు.

> చమురు, విత్త సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ధనిక దేశాలు ఉమ్మడిగా చేసిన ఆలోచనకు ఒక రూపమే 1975లో ఏర్పడిన ఈ దేశాల బృందం. అమెరికా చొరవతో పశ్చిమ జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ సమావేశానికి అమెరికా అధ్యక్షభవనంలోని గ్రంధాలయం వేదిక అయింది. దాంతో నాలుగు దేశాలను గ్రంధాలయ బృందం అని పిలిచారు. తరువాత జపాన్‌ను కూడా ఆహ్వానించాలని నిర్ణయించారు. అలా అది జీ5 అయింది. తరువాత ఇటలీ, కెనడాలను చేర్చుకున్న తరువాత జీ7 అయింది.1998లో రష్యా చేరి జీ8గా మారింది. 2014లో ఉక్రెయిన్ ఏలుబడిలో ఉన్న క్రిమియా ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవటంతో ఆ బృందం నుంచి రష్యాను తొలగించిన తరువాత తిరిగి జీ7గా మారింది.



ఒక దశలో ట్రంప్ ఏలుబడిలో తిరిగి రష్యాతో పాటు ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, భారత్‌లను చేర్చుకోవాలని జీ11గా విస్తరించాలన్న ప్రతిపాదనలు ముందుకు వచ్చాయి. తరువాత అది ముందుకు పోలేదు. దాని వలన చేరే దేశాలకు జరిగే మేలేమీ కనిపించకపోవటం ఒక కారణం అని చెప్పవచ్చు. అన్నింటికీ మించి అమెరికా అజెండాను ముందుకు తీసుకువెళ్లే ఒక వాహనంగా అది మారింది. ధనిక దేశాల బృందం తన పూర్వపు ఆర్థిక శక్తిని తిరిగి తెచ్చుకొనేందుకు చూపుతున్న శ్రద్ధ కంటే ఇటీవలి కాలంలో చైనా వ్యతిరేక స్వరాన్ని పెంచుతున్నారంటే దాని అర్థం ఈ బృందం అమెరికా విదేశాంగ విధాన ప్రయోజనాలకు తోడ్పడటం తప్ప వేరు కాదు. చైనా ఆర్థిక బలాత్కారం అనే ఆరోపణ ఇటీవలి కాలంలో ఎక్కువగా ప్రచారంలో పెట్టారు. తన వస్తువులను కొనుగోలు చేయాలంటూ ఏ దేశాన్ని అయినా ఒత్తిడి చేసిన దాఖలాలు లేవు. ప్రపంచబాంకు, ఐఎంఎఫ్ రుణాల ద్వారా అలాంటి పనిచేసిన, ఇప్పటికీ చేస్తున్నది వాటి మీద పెత్తనం చేస్తున్న ధనిక దేశాలన్నది బహిరంగ రహస్యం. తమకు లొంగని లేదా రాజకీయంగా వ్యతిరేకించే దేశాల మీద ఆర్థిక, వాణిజ్య అంశాలను ఆయుధాలుగా మారుస్తున్నది పశ్చిమ దేశాలు. లడఖ్ సరిహద్దు వివాదం తరువాత మన దేశంలోని సంఘపరివార్, ఇతర చైనా వ్యతిరేక శక్తులు చైనా వస్తువులను బహిష్కరించి ఆ దేశాన్ని ఆర్థికంగా ఇబ్బంది పెట్టి మన కాళ్ల దగ్గరకు తెచ్చుకోవాలని చేసిన హడావుడి గురించి తెలిసిందే. ఊహలు, వాంఛలను బట్టి ప్రపంచం నడవదు. నరేంద్రమోడీ సర్కార్ గత రికార్డులను బద్దలు కొట్టి చైనా నుంచి దిగుమతులను భారీగా పెంచింది. మరోవైపు చైనా నుంచి విడగొట్టుకోవాలన్న దేశాలతో యుగళగీతం ఆలపిస్తున్నారు.

షియాన్ నగరంలో చైనా, ఆరు మధ్య ఆసియా దేశాల సదస్సు రాజకీయాలతో నిమిత్తం లేకుండా అభివృద్ధి అజెండాతో జరిగింది. పలు ఒప్పందాలను చేసుకున్నారు. అమెరికా, ఐరోపా, మన దేశంతో చైనా జరుపుతున్న వాణిజ్యలావాదేవీల మాదిరే ఈ దేశాలతో కూడా జరుపుతున్నది. పరస్పర అంగీకారంతో పెట్టుబడులు పెడుతున్నది. కొందరు విశ్లేషకులు ఈ సమావేశాన్ని తన పలుకుబడిని పెంచుకొనేందుకు చైనా చేసిన కసరత్తుగా ఆరోపిస్తున్నారు. కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న చోట అమెరికా అభివృద్ధి పేరుతో పాగా వేసేందుకు, రక్షణ పేరుతో తన విష కౌగిలిలో బంధించేందుకు చూస్తున్నది తెలిసిందే. అలాంటిది చైనా తన పొరుగున ఉన్నదేశాల ఆర్థిక వృద్ధికి తోడ్పడితే దాన్ని విస్తరణ కాంక్షగా వర్ణించటం అర్థం లేదు. మన దేశం పొరుగున ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్‌లకు చేస్తున్న సాయాన్ని విస్తరణ కాంక్షలో భాగంగా చేస్తున్నామా?

సెల్: 8331013288



నోట్లరద్దు పెద్దలకే మేలు...

చెలామణిలో ఉన్న రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మే 23 నుంచి సెప్టెంబర్ 30లోపు తమ వద్ద రెండు వేల నోట్లున్నవారు బ్యాంకుల్లో, ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాల్లో మార్చుకొనే అవకాశం కల్పించింది. అందుకు కొన్ని పరిమితులు విధించింది. క్లీన్ నోట్ పాలసీ కింద 2వేల నోటు రద్దు చేశామంటూ ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. అసలు క్లీన్ పాలసీ అంటే ప్రజలకు మంచి నాణ్యమైన నోట్లు అందుబాటులోకి తేవడం కదా. మరి ఉన్న నోట్లను రద్దు చేస్తూ ఆకస్మిక ప్రకటనలేందుకు? కాలం అన్ని రకాల గాయాలను మాన్పుతుందంటారు. కానీ మన ప్రధానమంత్రి చేసిన గాయం మాత్రం రాచపుండై కాలం గడిచేకొద్దీ రెచ్చుతోంది. దానిపై మళ్లీ కారం చల్లె పనిని ఆర్బీఐకి అప్పగించింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2016లో చేసిన నోట్ల రద్దు ప్రకటన భారత ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. చెలామణిలో ఉన్న రూ.500, 1000 నోట్లు రద్దు చేస్తున్నట్టు హడా విడిగా మోడీ ప్రకటించారు. అనంతరం రూ.2000 నోట్లను తెచ్చింది. ఇప్పుడు దానిని కూడా నేటి నుంచి ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. దేశీయంగా ప్రస్తుతం చలామణీలో ఉన్న రూ.3.62లక్షల కోట్ల విలువైన రెండు వేల రూపాయల నోట్లలో ఎనభైశాతం అతికొద్ది మంది చేతుల్లోనే ఉన్నట్టు అంచనా. అందులో సింహభాగం అక్రమ లావాదేవీలకే ఉపయోగపడుతున్నాయన్న నిటి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షులు అరవింద్ పనగడియా వ్యాఖ్యలు బడాబాబుల బాగోతాలకు అద్దం పడుతున్నాయి.

ప్రధాని చెప్పినట్టు డిజిటల్ లావాదేవీలు గనుక పెరిగితే వాస్తవంలో కాగితపు కరెన్సీ చెలామణి తగ్గిపోవాలి. కానీ జరిగింది ఏమిటి? 2016లో పెద్ద నోట్ల రద్దు జరిగిన రోజుకు నాలుగు రోజుల ముందర చెలామణిలో ఉన్న కాగితపు కరెన్సీ మొత్తం విలువ 17.74లక్షల కోట్ల రూపాయలు. కాగా, 2022 డిసెంబర్ 23 నాటికి రిజర్వ్ బ్యాంకు గణాంకాల ప్రకారమే ఈ మొత్తం 32.42 లక్షల కోట్ల రూపాయలు. అంటే, కాగితపు కరెన్సీ స్థానంలో డిజిటల్ కరెన్సీని ప్రవేశపెట్టే లక్ష్యం, పూర్తిగా వికటించి వాస్తవం. ఈ కాలంలో కాగితం కరెన్సీ చెలామణి రెట్టింపైంది. మరోపక్క యూపీఐ చెల్లింపులూ, క్రెడిట్, డెబిట్ కార్డుల చెల్లింపులూ, ఆన్‌లైన్ రూపంలో జరిగే లావాదేవీలు కూడా భారీగానే పెరిగాయి. 2వేల నోట్లు నేడు సాధారణ చెలామణిలో కనబడటం లేదు. మరి ఆ నోట్లన్నీ ఏమైనట్టు? ఈ మరింత పెద్దనోటు నేడు బడాబాబులు, అవినీతి రాజకీయనేతలూ, రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవసరాల కోసం నల్లడబ్బుగా అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయింది. అంటే, పెరిగిపోయిన కాగితం కరెన్సీ చెలామణిలోని సింహభాగం నేడు 'పెద్ద మనుషుల' లావాదేవీల రూపంలో లెక్కలకు చిక్కకుండా తిరుగాడుతున్నది. కాగా, సామాన్య జనం చెల్లింపులూ, లావాదేవీలూ మాత్రం బహు పారదర్శకంగా నేడు డిజిటల్ ఎకానమీలో ప్రభుత్వ జీఎస్టీ ఆదాయపు రికార్డు స్థాయి పెరుగుదలగా నమోదవుతున్నది. యూపీ ఎన్నికల వేళ హడావిడిగా పెద్దనోట్లను రద్దుచేసిన బీజేపీ సర్కార్.. కర్నాటకలో కన్ను లొట్టపోయిన తరువాత, మరో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముంగిట ఉండగా రూ.2000 నోటును వెనుకకు తీసుకుంటుంది. కేవలం సంపన్నుల ప్రయోజనం కోసమే ఈ నోట్లను ఇంతకాలం చలామణిలో ఉంచారన్నది వాస్తవం. పెద్ద నోట్ల రద్దు సమయంలో భారీ ఎత్తున వస్తుందన్న గుత్తధనమంతా తెల్ల సొమ్ము అయిపోయి ఆర్థిక వ్యవస్థలో కలిసిపోలేదా? ఇప్పటికీ అటువంటి దొడ్డిదార్లు తెరుచుకొని ఉంటాయనడంలో సందేహం అక్కర్లేదు. 2వేల నోట్లను బ్లాక్‌లో విక్రయిస్తు న్నారని, దొంగ సొమ్ము దాచుకోడానికి, ఉగ్రవాదులకు సాయం చేయడానికి వాటిని ఉపయోగిస్తున్నారని, వాటిని రద్దుచేయాలని బీజేపీ ఎంపి సుశీల్ మోడీ గత డిసెంబర్‌లోనే రాజ్యసభలో డిమాండ్ చేశారు. కానీ, ఆ ఉద్దేశమే లేదని కేంద్రం పార్లమెంటుకు చెప్పింది. ఆరు నెలలు గడిచేలోపు ఉన్నట్టుండి రద్దు చేయడంలోని ఆంతర్యమేంటి?

2016లో రద్దు చేసిన నోట్లలో 99.3శాతం రిజర్వు బ్యాంకుకు చేరాయి. అంటే ప్రత్యక్షంగా నల్లధనం అని తేలిందేమీ లేదు. ఇప్పుడూ నల్లధనం తగ్గే అవకాశాలు ఏమీ ఉండవు. రెండువేల నోట్ల ఉపసంహరణ వల్ల నల్లధనం ఉన్నవారు లబ్ధి పొందకుండా కట్టుదిట్టం చేస్తామంటున్నారు. 2016లో విధించిన నిబంధనల ప్రకారం ఎక్కువ నోట్లు మార్చుకోవడానికి వీల్లేదన్నారు. ఈసారి కూడా ఒక్క విడతలో మార్చుకోగలిగిన మొత్తం ఇరవై వేలే. అలా ఎన్ని విడతలకైనా ఒక్కరేజే మార్చుకోగలగడం సంపన్నులకే ప్రయోజనం. ఇది నల్లడబ్బు తెల్లగా మార్చు కోవడానికి ఉపకరిస్తుంది. అంతిమంగా నోట్లరద్దు ప్రధాని చెప్పిన ఏ ఒక్క లక్ష్యాన్నీ సాధించకపోగా భారత ఆర్థిక వ్యవస్థనే అధోగతిపాలు చేసిందని ఈ వాస్తవాలన్నీ రుజువు చేస్తున్నాయి. ఈ ప్రమాదాన్ని ముందే పసికట్టిన ఎందరో ఆర్థిక నిపుణులు హెచ్చరించినా లెక్కచేయని మోడీ అంతరంగమేమిటో ఈ ఆరున్న రేండ్లుగా అనుభవాలు అవగతం చేస్తున్నాయి. ఇప్పటికైనా తప్పుదిద్దు కోవాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకపోగా ఇంకా మోసానికి తెర తీసింది. కొందరిని కొంతకాలమే మోసం చేయగలరేమో గానీ, అందరినీ అన్ని వేళలా మోసం చేయలేరనే సత్యాన్ని ఏలికలు ఇప్పటికైనా గుర్తిస్తే మంచిది.

- మోహన్‌కృష్ణ అనంతోజు

'చెల్లని బతుకు'

ప్రజాస్వామ్యంలో సామాన్యుడి
బతుకు చెల్లని నోటయింది
మండే ఎండలో చెమట చిందుతూ
వారాంతాన ఇచ్చి పెద్ద నోటు చెల్లదని
ఏలే వాళ్ళు ఇచ్చిన తాకీదు చూసి

"ఈ వారానికి నేనెట్టా బతికేదీ
నా వాళ్ళ కడుపులనెలా ఓదార్చేది
పని వదిలి నోటెలా మార్చేది
"రద్దన్న పెద్దన్నకేం తెలుసు" చీమ బాధ

చెవుల్లో సీసాలు పోసుకున్న తరువాత
ప్రజాస్వామ్యానికేసిన ముసుగు తెరల్లో చేరాక
కళ్ళు మూసుకున్న పిల్లులై కూచున్నాక
ప్రజల ఘోషేమిటో పాలక మాటేమిటో
వారి ఆదేశాల కత్తులపై నడకేమిటో తెలిసేదెలా?

ఓటు నాడు నోటు మాట తప్ప
నోరెత్తనివ్వని జనాన్ని నిలిపి నపుడు
రాజ్యాంగంలో రాసుకున్న
ప్రజాస్వామ్యం శవమైంది
ఇప్పుడు జనం ఘోషకూ పాలక భాషకూ
బంధం తెగి ప్రజలది చెల్లని బతుకైంది
తెగిన బంధం కుట్టేదారం పట్టనంత వరకూ
కొత్తగా హత్యకు గురయ్యే నోట్లేమి ఉంటాయి?

- ఉన్నం వెంకటేశ్వర్లు
8790068814

ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ లక్షణాలు... ఒక పరిశీలన

(నిన్నటి సంచిక తరువాయి)

6. జాతీయ భద్రత: మన జాతి మీద ఇతర జాతులు యుద్ధం చేయబోతున్నాయి అనే ఒక బూచిగా చూపటం. వాళ్లు యుద్ధం చేయబోతున్నారు కాబట్టి మనం భద్రంగా ఉండాలి అని అంటే ముందు మన అంతర్గతంగా ఉన్న శత్రువులను ముఖ్యంగా ముస్లింలను, క్రిస్టియన్లను, దళితులను, కమ్యూనిస్టులను తుదముట్టించాలి. వీళ్లకు వ్యతిరేకంగా జాతిని ఐక్యం చేయాలి అనే భావనలను ప్రచారంలో, ఆచరణలోనూ పెట్టే ప్రయత్నం చేయటం. జాతీయ భద్రతకు ఎలాంటి ముప్పు లేకపోయినప్పటికీ ఏదో ప్రమాదం సంభవించబోతుందని ప్రజల్లో భయాందోళనలు కలిగించే ప్రచారాలు చేసి ఎన్నికలలో లబ్ధి పొందటం. పుల్వామా దాడి ఘటన దీనికి రుజువు. పాకిస్థాన్ టెర్రరిస్ట్ చేతుల్లో 40మందికి పైగా మన జవాన్లు వీరమరణం పొందారు. వాళ్లు రోడ్డుమార్గం గుండా కాకుండా విమాన మార్గం ద్వారా వచ్చి ఉన్నట్లయితే వాళ్ల ప్రాణాలు పోయేవి కాదు. అలాంటిది అవసరమని విమానాలు పంపాలని, ఆనాటి కాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ప్రధానికి, హెూంమంత్రికి, రక్షణమంత్రికి, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కి చెప్పినప్పటికీ ఎలాంటి సౌకర్యం ఇవ్వకపోగా 40మంది జవాన్ల మరణాలలో జరిగిన ప్రభుత్వ తప్పిదాన్ని ఎవరి వద్ద చెప్పవద్దని సత్యపాల్ మాలిక్‌కు హుకుం జారీ చేసినట్లుగా ఆయనే ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. ఆ దాడి అనంతరం సర్జికల్ స్ట్రైక్. ఆ సర్జికల్ స్ట్రైక్‌ని అడ్డం పెట్టుకొని దేశంలో జరిగిన ఎన్నికల్లో లబ్ధి పొందారు. ఇలాంటివన్నీ ఫాసిస్టు లక్షణాలే, మనదేశంలో ఇదంతా గమనిస్తూనే ఉన్నాం.

7. మతం, రాజకీయాలు, పరిపాలన కలగలిసిపోవడం: మన దేశం ఒక సెక్యులర్ రాజ్యం. ఫెడరల్ వ్యవస్థ. అంటే సమాఖ్య దేశం. బహుళ సంస్కృతులు ఉన్న దేశం. సెక్యులర్ స్ట్రక్చర్. సెక్యులరిజం అంటే రాజ్యానికి మతం ఉండకూడదు. మత ప్రసక్తిలేని లౌకిక రాజ్యం. అంటే పరిపాలకులు మత ప్రచారాలలోనూ, మత క్రతువులలోనూ పాల్గొనరాదు. దేశంలోని ప్రజలు వారు ఏ మతాన్ని అయినా అవలంబించవచ్చు. ఏ మతంలోకి అయినా మారవచ్చు. అసలు మతమే అవసరం లేదు అనుకునే వారు మతరహితులుగా ఉండే అవకాశం కూడా రాజ్యాంగం కల్పించింది. అలాంటి గుండెకాయ లాంటి రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మోడీ ప్రభుత్వం మత క్రతువులలో పాల్గొనటమే కాదు, మత ప్రచారాలను ప్రోత్సహించడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడంలో కూడా ముందే ఉన్నది. మతం వ్యక్తిగతం. పరిపాలనలో మతాన్ని కలపకూడదు. కానీ కుంభమేళాలు, చండీ యాగాలు, సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భూమి పూజలు లాంటి వాటిలో పాల్గొంటూ, సమాజంలో భక్తి పేరుతో, దేవుడి పేరుతో ప్రజల మధ్య విభజనను పెంచుతున్నది. మన మనదేశంలో స్వతహాగా ఉన్న రాజ్యాంగంలో పొందుపరిచిన సెక్యులరిజం పదాన్ని తీసివేయాల్సిందే అని ఆర్ఎస్ఎస్ బహిరంగంగానే ప్రకటిస్తున్నది. దాన్ని తొలగించటానికి అనేక ప్రయత్నాలు చేస్తూనే ఉన్నది. సెక్యులరిజాన్ని తీసేసి ఈ దేశాన్ని ఒక మత రాజ్యాంగంగా మార్చాలని కుట్రలు పన్నుతున్నది ఆర్ఎస్ఎస్. ఇది ఫాసిస్టు లక్షణమే.

8. కార్పొరేట్ అధిపత్యాన్ని సమర్థించడం: కార్పొరేట్ శక్తులు బలపడేలా చూడటం. ఈ శక్తులే ప్రభుత్వం మీద పెత్తనం చెలాయించడం. వాళ్ల చెప్పు చేతల్లోనూ, వాళ్ల కనుసన్నల్లోనే ప్రభుత్వాన్ని నడపటం. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని పెంచి పోషించటం. ప్రపంచంలో 603వ స్థానంలో ఉన్న అదాని, మోడీ అధికారంలోకి వచ్చిన 2014 తర్వాత నుండి మొన్న మొన్నటి వరకు ప్రపంచంలో మూడో స్థానానికి ఎలా ఎదిగాడు? మోడీ, మోడీ ప్రభుత్వం అదాని లాంటి కార్పొరేట్ శక్తుల ఎదుగుదలకు నియమ నిబంధనలను కూడా ఉల్లంఘించి ఆదానికి సాయపడటం వలనే అది సాధ్యమైంది. అదాని మోడీ మైత్రి గురించి పార్లమెంట్లో ప్రస్తావిస్తే ప్రభుత్వం మౌనమే సమాధానం. అంతేకాదు వేరే కుంటి సాకులు చూపుతూ ఎదురు దాడి చేస్తూ, ప్రభుత్వమే పార్లమెంటు జరగకుండా స్తంభింప జేయటం మనం చూశాం. పార్లమెంటు సభ్యులు ఆ విషయాన్ని ప్రస్తావిస్తే, వారు ప్రస్తావించిన విషయాలను రికార్డుల నుంచి తొలగించడం, మైకులను కట్ చేయడం మోడీ ప్రభుత్వ దమననీతికి, ప్రజాస్వామ్యం మీద కనీస గౌరవం లేకపోవటానికి నిదర్శనం. కార్పొరేట్లకు కొమ్ము కాయటమంటే దేశంలోని కార్మిక, కర్షక సమస్త శ్రామిక వర్గాన్ని అణిచి ఉంచటం.



> బహుళత్వ సంస్కృతిని తొక్కిపట్టి ఏకాత్మకంగా మార్చడం దాని లక్ష్యం. మన సమాజంలో బహుళత్వంతో నిండిన భారత చరిత్రను తుడిచివేసి హిందూ మతోన్మాద, వర్ణాశ్రమ ధర్మ చరిత్రనే భారత చరిత్రగా ప్రకటించడం దాని ముఖ్య ఉద్దేశం.

9. అవినీతి: మనదేశంలో మధ్యప్రదేశ్‌లోని వ్యాపం కుంభకోణం కానీ, కర్నాటకలోని అయితే ఇటీవల ఓడిన బీజేపీ ప్రభుత్వం నలభై శాతం కమిషన్ సర్కార్‌గా ముద్రపడింది. కమిషన్ లేకుండా ఏ పనికి క్లియరెన్స్ ఉండదు. వారి అనుకూల కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ సైతం 40శాతం కమిషన్‌కి బలయ్యాడు. నేను అలా ఇవ్వలేనని అలా ఇస్తే గిట్టుబాటు కాదని నన్ను అలా మానసికంగా హింస పెట్టవద్దని చెబుతూ ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నాటక కాంట్రాక్టర్ల సంఘం ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి ఈ ఘటనను గురించి అది నిజమేనని ధృవపరుస్తూ న్యాయం చేయమని ఉత్తరాలు కూడా రాసుకున్నారు. రాఫెల్ కుంభకోణం, ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు వారికి కారు చౌకకు అమ్మటం, ప్రయివేటు పెట్టుబడిదారుల బకాయిలను వన్ టైం సెటిల్‌మెంట్ పేరుతో వారికి లబ్ధి చేకూర్చటం, గత ఎనిమిది సంవత్సరాలలో పెట్టుబడిదారుల రుణాలు రూ.12.50 లక్షల కోట్లు మాఫీ చేయడం, అసెట్ మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ ఆస్తులన్నింటినీ కారు చౌకకు పెట్టుబడిదారులకు అద్దెకివ్వటం ఇవన్నీ ఫాసిస్ట్ లక్షణాల నుంచి పుట్టినవే.

అందువల్ల ఈ రోజున భారత సమాజం ఎదుర్కొంటున్న ఫాసిజం మరింత లోతైనది. మరింత ప్రమాద భరితమైనది. భారతదేశంలో ఉన్న ఆధిపత్య మతం, పెత్తందారి కులాలు, నిచ్చెన మెట్ల కులవ్యవస్థ, ఆ కుల అసమానతల సమర్థన, బ్రాహ్మణీయ భావజాల అధిపత్యం, జాతుల అణిచివేత, భాషాధిపత్యం లాంటి పరిస్థితులు యూరప్‌లో ఒకనాడు ఉద్భవించిన అంతర్జాతీయ ఫాసిజానికి, ఇవి జాతీయంగా ఉన్న అదనపు లక్షణాలు తోడ్పడ్డాయి. ఈ లక్షణాలు భారతదేశంలో ఫాసిజం పెరగటానికి అనువైన భూమికను ఏర్పాటు చేశాయి. గత తొమ్మిది సంవత్సరాలుగా మనదేశంలో ముఖ్యంగా సాంస్కృతిక రంగంలో ఈ ఫాసిజం విలయతాండవం చేస్తున్నది. ఫాసిజం భారతదేశంలో పొందిన నిర్దిష్ట రూపం హిందూ బ్రాహ్మణీయ ఫాసిజం. అది బహుళత్వ సంస్కృతిని తొక్కిపట్టి ఏకాత్మకంగా మార్చడం దాని లక్ష్యం. మన సమాజంలో బహుళత్వంతో నిండిన భారత చరిత్రను తుడిచివేసి హిందూ మతోన్మాద, వర్ణాశ్రమ ధర్మ చరిత్రనే భారత చరిత్రగా ప్రకటించడం దాని ముఖ్య ఉద్దేశం. ఈ లక్ష్యాల కోసం ఎంతటి హింసకైనా, ఎంతటి చరిత్ర వక్రీకరణకైనా తెగించటం దాని కార్యక్రమం. ఇలాంటి భావజాలన్నీ ప్రతి ఘటించడం అత్యవసరం. కూలదోయటం అంతకన్నా అవసరం.

- పి.బి.చారి, సెల్:9704934614

www.praja.khammam@gmail.com
అనుదినం...జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5 ఖమ్మం
బుధవారం 24, మే 2023

ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారిగా గుడిమళ్ల సందీప్ కుమార్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం డివిజన్ ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారిగా నియమితులయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మంగళవారం అక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, నిర్మల్ జిల్లా కలెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి రిపోర్ట్ చేశారు. ప్రాజెక్ట్ ఉద్యాన అధికారితో పాటు ప్రాజెక్ట్ వ్యవసాయ అధికారి బాధ్యతలను సందీప్‌కి అప్పగించారు. ఏజెన్సీ ప్రాంతంలో వివిధ రకాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగు పరచటానికి సందీప్ కృషి చేయనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇల్లందు, అచ్యుతాపురం ఉద్యాన నర్సరీ, ఖమ్మం ఉద్యాన అధికారి బాధ్యతలతో పాటు జిల్లా టెక్నికల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10 సంవత్సరాలుగా రైతులకు సేవలు అందించారు. సందీప్ స్థానంలో సత్తుపల్లి ఉద్యాన అధికారి మీనాక్షి నియమితులయ్యారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు వెంకటేశ్వరరావు మృతి

నవతెలంగాణ - ఎర్రుపాలెం



తెల్లపాలెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఆవుల వెంకటేశ్వరరావు(65) గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలియగానే హుటా హుటిన సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు తెల్లపాలెం గ్రామానికి విచ్చేసి మృతదేహాన్ని సందర్శించారు. ఆవుల వెంకటేశ్వరరావు మృతదేహంపై పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్యతో పాటు మండల కమిటీ సభ్యులతో కలిసి పార్టీ జెండాను కప్పి ఘనంగా నివా ళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేలప్రోలు రాధాకృష్ణ, గామాసు జోగయ్య, నాగులవంచ వెంకట్రామయ్య, సగ్గుర్తి సంజీవరావు, నాగులమీరా, శ్యామలరావు, దూదిగం బసవయ్య, షేక్ మాబు, ఆవుల శ్రీనివాసరావు, కుర్ర వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ కూలికి రోజుకు రూ.600 ఇవ్వాలి : వ్యకాస

నవతెలంగాణ-రఘునాథపాలెం

గ్రామీణ ఉపాధి హామీ పని కింద పని చేస్తున్న కూలీలకు రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గణేశ్వరం గ్రామంలో ఉపాధి హామీ పనులను సందర్శించారు. కూలీలు పడుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై నినాదాలు ఇస్తూ పని ప్రదేశంలోనే ఆందోళన నిర్వహించారు. రోజు కూలి 600 ఇవ్వాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, ప్రమాదం జరిగినప్పుడు ప్రథమ చికిత్స కోసం ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కన్నెగంటి తిరపయ్య, వెంకన్న, బద్రునాయక్, వల్లూరు శ్రీనివాసరావు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



పేదల ఆశా కిరణం ఎంపీ నామ

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో నల్లమల

నవతెలంగాణ-ఖమ్మంప్రాంతీయప్రతినిధి

పేద ప్రజల ఆశాకిరణం ఎంపీ నామ నాగేశ్వరరావు అని రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో 15 మందికి రూ.7.15 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నల్లమల మాట్లాడుతూ ఒక వైపు నిత్యం పేదలకు చెక్కుల రూపంలో భారీ ఎత్తున ఆర్థిక సాయం అందిస్తూనే మరో వైపు నామ ముత్తయ్య ట్రస్ట్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్న ఘనత ఒక్క ఎంపీ నామ నాగేశ్వరరావుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి కనకమేడల సత్యనారాయణ, జిల్లా టెలికాం సలహా మండలి సభ్యులు చిత్తారు సింహాద్రి యాదవ్, ఉప్పునూతల నాగేశ్వరరావు, నాయకులు మలీదు వెంకన్న, బత్తుల శ్రీనివాసరావు, తన్నీరు రవికుమార్, జానీబాబాపాల్గొన్నారు



తాళ్లూరి సాయి ఆశయాలను కొనసాగిస్తాం

- టీఎస్ఎస్ వ్యవస్థాపకులు తాళ్లూరి కౌషిక్

నవతెలంగాణ-సత్తుపల్లి

డీవైఎఫ్ఐ యువనేత తాళ్లూరి శివసాయి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని తాళ్లూరి శివసాయి ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాళ్లూరి వెంకటకౌషిక్ తెలిపారు. సీఐటీయూ నేత తాళ్లూరి రామారావు ప్రథమ కుమారుడు తాళ్లూరి సాయి 26వ జయంతి సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సాయి బ్రతికున్నంతకాలం తన పుట్టినరోజును అభాగ్యులకు సేవచేస్తూ జరుపుకునేవాడని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో టీఎస్ఎస్ సంస్థ తరపున సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ నేటి యువతలో కొంతశాతం చెడు అలవాట్లకు బానిసవుతున్నారని అలాంటి వారు సాయిని ఆదర్శంగా తీసుకుని సమాజసేవలకు పునరంకితం కావాలని కోరారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, మజ్జిగప్యాకెట్లు ఒగ్గు చిన్నపకీరారెడ్డి చేతులమీదుగా వంచిపెట్టారు. గర్భిణీల వార్డుకు సాయి కుటుంబసభ్యులు వాటర్‌కూలర్‌ను వైద్యులు చింతాకిరణ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో తాళ్లూరి లక్ష్మీ, మరికంటి రాము, పంతంగి హరికిరణ్, విజయ, కోమలి, భాను, రాయల గోపి, లక్కనబోయిన శివ, జక్కుల తరుణ్, కోలా రమేశ్, తాళ్లూరి గణేశ్, వీరభద్రి, గంటా సాయి, రాఘవేంద్రరావు, రాయల శివ, సాయితేజ, హరీంద్రకుమార్ పాల్గొన్నారు.

రూ.2వేల నోటు రద్దు ఎవరికోసం

సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

నవ తెలంగాణ - బోనకల్

కేంద్ర ప్రభుత్వం తాజాగా 2వేల రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిందని, ఈ రెండు వేల రూపాయల నోట్ల రద్దు ఎవరికోసమో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మధిర నియోజకవర్గ ఇన్చార్జి పాలడుగు భాస్కర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2016లో వెయ్యి నోట్ల రూపాయల రద్దు చేస్తున్నట్లు ప్రకటించినందని, ఆ సమయంలో అనేక వాగ్దానాలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారన్నారు. పెద్ద నోట్లు ఎక్కువ సంఖ్యలో తీవ్రవాదుల, ఉగ్రవాదుల చేతులలో ఉంటున్నాయని, దీనివలన వారి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయని ప్రధానమంత్రి ప్రకటించారు. నల్లధనాన్ని బయటకు వెలికి తీసేందుకే వెయ్యి రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారని, ఇప్పటి వరకు ఎంత నల్లధనం బయటకు తీశారో చెప్పాలన్నారు. మళ్లీ ఇప్పుడు రెండు వేల రూపాయల నోట్లు రద్దు నాటకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల నుంచి దారి మళ్లించేందుకే తాజాగా 2000 రూపాయల నోట్ల రద్దు అంశం తెరమీదకు తీసుకువచ్చిందని ఆయన విమర్శించారు.

రైతులకు పంట నష్ట పరిహారం అందించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం

నవతెలంగాణ - ఎర్రుపాలెం



కేంద్రంలోని మోడీ ప్రభుత్వం యువతను విస్మరిస్తుందని, సంవత్సరానికి కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని యువతకు ఎన్నికల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం రామ్‌శెట్టి పుల్లయ్య భవనం నందు నాగలవంచ వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగిన ఎర్రుపాలెం జోన్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని పొన్నం మాట్లాడుతూ సీపీఐ(ఎం) అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో నిరుద్యోగం గణనీయంగా తగ్గిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన పంట నష్ట పరిహారం డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు వారంలో పరిహారం అందిస్తామని చెప్పి నేటికీ రెండు నెలలుపై బడిన ఇంత వరకు పరిహారం అందలేదని విమర్శించారు. రైతులు పంట నష్ట పరిహారం కోసం ఎదురు చూస్తున్నారని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. పంటనష్ట పరిహారం డబ్బులు రైతులకు అందించలేని ప్రభుత్వం తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు జరుపుకోవటానికి డబ్బులు ఎలా వస్తాయో తెలపాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి దివ్వెల వీరయ్య, తేలప్రోలు రాధాకృష్ణ, గామాసు జోగయ్య, సగుర్తి సంజీవరావు, షేక్ నాగుల మీరా, దేవరకొండ రామకృష్ణ, తోట సాంబశివరావు, దూదిగం బసవయ్య, బుర్రి రవి, షేక్ మస్తాన్, కోటి సుబ్బారెడ్డి, నక్క పుల్లారావు, శ్యామలరావు, కొండపాటి గురవయ్య, కొండపాటి శివయ్య, మాదల మహేష్, పుచ్చకాయల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద, ఫాసిస్టు విధానాలపై పోరాటాల రూపకల్పన

డివైయఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్

నవతెలంగాణ-వైరాటౌన్



దేశంలో మోడీ, బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాటాల రూపకల్పనకు మే 27, 28 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న డివైయఫ్ఐ ఆలిండియా కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని డివైయఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం వైరా పట్టణంలోని బోడేపుడి వెంకటేశ్వరరావు భవనంలో డివైయఫ్ఐ వైరా నియోజకవర్గ సమావేశం వైరా పట్టణ కార్యదర్శి షేక్.నాగుల్ పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చింతల రమేష్ మాట్లాడుతూ బీజేపీ, మోడీ అవలం బిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనకు మే 27, 28 తేదీలలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డివైయఫ్ఐ ఆలిండియా కమిటీ సమావేశాల సందర్భంగా మే 26న రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశాలకు డివైయఫ్ఐ ఆలిండియా నాయకత్వం హాజరవుతున్నారని, యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైయఫ్ఐ యంగ్ ఉమెన్ జిల్లా కో కన్వీనర్ మరపాటి సుజాత, వైరా నియోజకవర్గం నాయకులు చిత్తరు మురళి, షేక్.యాకూబ్, మురళి, సురేష్, సాగర్, ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలలో ముమ్మరంగా మొక్కలను పెంచాలి : డిఆర్‌డిఓ పీడీ

నవతెలంగాణ - బోనకల్



గ్రామపంచాయతీలలో గల నర్సరీలలో అవసరమైన మొక్కలను విస్తృతంగా పెంచాలని డిఆర్‌డిఓ పిడి మెరుగు విద్యాచందన మండల అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని స్వచ్ఛ సర్వేక్షణ్ అభియాన్ ప్రచారంలో భాగంగా ముష్టికుంట్ల, చిరునోముల గ్రామ పంచాయతీలలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వ్యక్తిగత సోక్ పిట్‌లకు మార్క్ అవుట్ మండల అధికారులు ఇచ్చారు. అదే విధంగా చిరునోముల గ్రామ పంచాయతీలోని నర్సరీలు, బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఆమె పరిశీలించారు. బృహత్ పల్లె ప్రకృతి వనంలో వివిధ రకాల మొక్కలను పెద్ద సంఖ్యలో పెంచాలని ఆమె సూచించారు. గ్రామ పంచా యతీలో ఆ గ్రామానికి అవసరమయ్యే మొక్కలను మాత్రమే పూర్తిస్థాయిలో పెంచాలని, ఇతర గ్రామ పంచాయతీల నుంచి మరొక గ్రామానికి మొక్కలను తీసుకువచ్చే విధానాన్ని విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని గ్రామాలలో అవసరమైన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆమె అధికారులను కోరారు. కార్యక్రమానికి ఏపీడీ చుంచు శ్రీనివాస్, ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్, ఏపీఓ బసవోజు కృష్ణకుమారి, ఈసీ పిల్లుట్ల కిరణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు పరిస కృష్ణవేణి, షేక్ మున్ని, టీఏలు మాతంగి సురేష్, సర్పంచ్‌లు ములకారపు రవి, షేక్ బిజాన్ బి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ- ఖమ్మం



నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఖమ్మం టౌన్ ఏసీపీ పీవీ గణేష్ హెచ్చరించారు. రైతులకు విక్రయించే విత్తనాలు, ఎరువులు నాణ్యత ప్రమాణాలను పాటించేలా మంగళవారం నగరంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణ యజమానులు, డీలర్లతో ప్రత్యేక సమావేశం బడ్జెట్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అధీకృత విత్తన, ఎరువుల డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి నడుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన విత్తనాలను విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాల విక్రయాలు అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయశాఖ అధికారులతో విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులతో పాటు పీడీ యాక్ట్‌ను అమలు చేస్తామని తెలిపారు. రైతులకు మేలు కలిగించే రీతిలో నకిలీ విత్తనాలతో పాటు నకిలీ పురుగు మందుల విక్రయాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు వ్యవసాయ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. ఇప్పటికే గడువు తీరిన, నాసిరకం విత్తనాల అమ్మకాలపై అధికారులు దృష్టి పెట్టిన అధికారులు మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, ఎరువులు, పురుగుల మందుల స్టాక్ వివరాలతో పాటు ఆయా కంపెనీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, విత్తనాలు , ఎరువులు ఎక్కడ నుండి దిగుమతి చేస్తున్నారనేది తెలుసుకుంటున్నారని అన్నారు. రైతులు కూడా కొత్త వ్యక్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులను నమ్మి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయరాదని, వ్యవసాయశాఖ ధ్రువీకరించిన వ్యాపారుల వద్దనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు లభిస్తాయన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. రైతులు విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు ఎవరైన విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో సిఐలు సత్యనారాయణ, స్వామి, శ్రీహరి, ఫర్టిలైజర్ దుకాణాల అధ్యక్షుడు నాగేందర్, మనోహర్ పాల్గొన్నారు.

పెనుబల్లి: పెనుబల్లి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పురుగుమందుల దుకాణం దారులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెనుబల్లి ఎస్సై సూరజ్, వ్యవసాయ అధికారి ప్రసాద్ రాజు హాజరై విత్తనాల కొనుగోళ్లపై డీలర్లకు అవగాహన కల్పించారు.

వైరా : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై పిడి యాక్ట్‌తో పాటు కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాబురావు హెచ్చరించారు. మంగళవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయశాఖ, పోలీస్, విత్తన డీలర్ల సదస్సులో బాబురావు మాట్లాడారు. సదస్సులో వ్యవసాయశాఖ ఏడి బాబురావు, కెవికె కోఆర్డినేటర్ హేమంతరావు, సీఐ సురేష్ మాట్లాడారు. రాబోయే వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునిచ్చిన విత్తనాలు, ఎరువులు మాత్రమే సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్లోని వ్యవసాయ శాఖ అధికారులు, సీఐ సురేష్ , పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్లు, విత్తన డీలర్లు పాల్గొన్నారు

కల్లూరు : గ్రామాల్లో లేబుల్ లేకుండా విత్తనాలు అమ్మినా, గడువు ముగిసిన విత్తనాలు అమ్మినా వెంటనే తమకు సమాచారం ఇస్తే చర్య తీసుకుంటామని ఎస్సై రఘు అన్నారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో నకిలీ కల్తీ విత్తనాలు పట్ల డీలర్లకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ఏవో ఎం రూప అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విత్తనాలమ్మే డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

కామేపల్లి : నకిలీ విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని జేడీఏ విజయనిర్మల అన్నారు. కామేపల్లి మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కామేపల్లి మండలంలో రైతులు మోసపోవద్దని, దళారులను నమ్మి నకిలీ విత్తనాలు కొనవద్దని, నాణ్యమైన విత్తనాలను లైసెన్సు ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనాలని విస్తృతంగా ఆటోతో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రచార జాతను ఖమ్మం వ్యవసాయశాఖ జేడీఏ విజయనిర్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి నకిలీ విత్తనాలు కొనవద్దని లైసెన్స్ ఉన్న దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలను కొని అధిక దిగుబడిని సాధించి రైతే రారాజు కావాలని కోరారు. కార్యక్రమంలో సరిత కామేపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి బి తారాదేవి మండల పరిధిలోని సర్పంచులు, ఎఇఒలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

రూ. 22 లక్షల అంచనాలతో అభివద్ధి పనులు

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 41 వ డివిజన్‌లో కార్పొరేటర్ కర్నాటి క్రిష్ణ ఆద్వర్యంలో మంగళవారం నగర మేయర్ పునుకొల్లు నీరజతో నూతన మేజర్ బాక్స్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.22 లక్షల అంచనాలతో చెరువు బజార్ హనుమాన్ టెంపుల్ వద్ద నుండి లకారం స్టలేజ్ డ్రైన్ వరకు 250 మీటర్లు నిర్మాణం కానుంది. 39, 40, 41 డివిజన్ల మెయిన్ బాక్స్ డ్రైన్స్ వాటర్ ఈ డ్రైన్ నుండి లకారం వాగులోకి కలుస్తుందన్నారు. కార్పొరేషన్ పరిధిలో గల అన్ని డివిజన్లను దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఖమ్మం నగరాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సారధ్యంలో ఎంతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డిఈ స్వరూపరాణి, ఏఈ నవ్య జ్యోతి, వర్క్ ఇన్స్పెక్టర్ దాదే సతీష్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శిలు చిన్ని, నవీన్, నాయకులు సాయిక్రిష్ణ, కొండల్, అప్పారావు, శంకర్, కోటేశ్వర్‌రావు, నాగమణి, రెహానా, సుల్తానా, ధనాలకోట అనంతలక్ష్మి, చింతల పద్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'దిశా' సమావేశం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ పథకాల జిల్లా అభివద్ధి, సమన్వయ – పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశం ఈ నెల 25వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ఐడీవోసీ (సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం) సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సభ్యులు సకాలంలో హాజరుకావాల్సిందిగా కోరారు.

'యువ భారత్‌శక్తి' ఆర్థిక సహాయం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన వంగా విష్ణు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని పద్మజ హాస్పిటల్‌లో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యఖర్చులకు విష్ణు కుటుంబసభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న సత్తుపల్లి యువభారత్‌శక్తి ఫౌండేషన్ బాధ్యులు కామెరక్రాంతికుమార్ సామాజిక మాధ్యమాల ద్వారా విషయాన్ని చేరవేసి దాతల సహకారంతో రూ.87,500 సేకరించి మంగళవారం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో విష్ణు కుటుంబసభ్యులు ప్రసాద్‌కు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

'ప్రజాగర్జన'ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ జూన్ 4న కొత్తగూడెం పట్టణంలో నిర్వహించే ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అడిషనల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య కోరారు. మంగళవారం జేవీఆర్ ఓసీలో నాయకులు సముద్రాల సుధాకర్ భీమయ్య అధ్యక్షతన జరిగిన గేట్‌మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ ముఖ్యసలహాదారు దమ్మాలపాటి శేషయ్య సీపీఐ జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, యూనియన్ బ్రాంచి కార్యదర్శి జీవిఆర్ స్వామి, పిట్ సెక్రెటరీ దారా భీమయ్య పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ సమావేశాలను జయప్రదం చేయండి

- సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రోష్నీన్‌ఖాన్

నవతెలంగాణ-సత్తుపల్లి

ఈనెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో జరిగే భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) కేంద్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వరాన్ రోష్నీన్‌ఖాన్ కోరారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ సమావేశాలు విజయవంతం కోసం సంఘ బాధ్యులు, సానుభూతిపరులు, ప్రజలు విరివిగా విరాళాలు అందించి సహకరించాల్సిందిగా రోష్నీన్‌ఖాన్ ఈ సందర్భంగా కోరారు. విరాళాలు అందించదలచిన ఇందులో ఉన్న స్కానర్ ద్వారా విరాళాలు పంపించాల్సిందిగా ఆమె కోరారు.



సబ్సిడీపై విత్తనాలు పంపిణీ : ఎంఎల్ఏ

నవతెలంగాణ-పెనుబల్లి

పాత కార్యగూడెం సొసైటీలో సబ్సిడీపై విత్తనాలను ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎంతో ఉపయోగపడే విధంగా 60 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఇట్టి అవకాశం రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ వాసు, పాత కార్యగూడెం సొసైటీ చైర్మన్ చింతన సత్యనారాయణ, జడ్పిటిసి చెక్కిరాల మోహన్‌రావు, నరుకుల సత్యవతి, నాయకులు కనగల వెంకటరావు, లెక్కినేని వినీల్, చెక్కిలాల లక్ష్మణరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, కర్నాటక వీరభద్ర రెడ్డి, లగడపాటి శ్రీను, గోదా చెన్నారావు, ఆళ్ల అప్పారావు పాల్గొన్నారు.

బాల భారతి విద్యాలయం విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ- తల్లాడ



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం–2023 క్రీడా పోటీలలో టేబుల్ టెన్నిస్‌లో తల్లాడ బాల భారతి విద్యార్థి ప్రతిభ చూపి పథకాన్ని సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ తెలిపారు. విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వెండి పతకం సాధించిన విద్యార్థి టీ.అజయ్‌కు అభినందనలు తెలియజేసి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యతోపాటు ఏదో ఒక ఆటలో నిష్ణాతులు కావాలని ఆకాంక్షించారు.

సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకోవాలి : ఎంపీపీ

నవతెలంగాణ-తల్లాడ

సమాజంలో ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ఆర్‌టిఐపై అవగాహన సదస్సు, మెరిట్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తేల్లూరి కృష్ణయ్య, ముప్పా మురళి, ఆర్టిఐ జిల్లా కన్వీనర్ అనిల్ కుమార్, మండల కన్వీనర్ ఏపూరి సాయి, బోనకల్ మండల కన్వీనర్ మోహన్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం : ఎంపీపీ

నవతెలంగాణ-వేంసూరు

తెలంగాణ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని గ్రహించాలని ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు అన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ రావడంతో మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు అనంతరం కార్యాలయ సిబ్బందికి ప్రజాప్రతినిధులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడారు. కార్యక్రమంలో మమత, నవ్య, సతీష్, వెంకటకృష్ణ, ఎంపీడీవో రమేష్, ఈఓఆర్ డి.రంజిత్ కుమార్, సర్పంచ్ ఎండి ఫైజుద్దీన్, సొసైటీ అధ్యక్షుడు తక్కెళ్ళపాటి గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, ఎర్ర రమేష్, నున్న రాంబాబు ఉన్నారు.

వెల్లంపల్లి అశోక్‌కు తుమ్మల పరామర్శ

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని జుజ్జులరావుపేట గ్రామానికి చెందిన వెల్లంపల్లి అశోక్ తండ్రి వెల్లంపల్లి నారాయణరావు ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-కామేపల్లి

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పూసలతండాలో మంగళవారం చోటుచేసుకుంది. బాసిత నగర్ గ్రామపంచాయతీలో గల పూసల తండా గ్రామానికి చెందిన బాదావత్ శ్రీనివాస్ (35) ట్రాక్టర్‌తో దుక్కి దున్నటానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే కందాలకు భూ నిర్వాసితుల సన్మానం

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

సీతారామ ప్రాజెక్టు 16వ ప్యాకేజీలో కాల్వకు బదులుగా టన్నెల్ ఏర్పాటుకు కృషి చేసిన పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి భూ సేకరణ ముప్పు తప్పిన రైతులు బుధవారం సన్మానం చేయనున్నారు. తాళ్ళచెరువు సమీపంలోని ప్రాజెక్టు బాధ్యతలు నిర్వహించే కంపెనీ స్థలంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రైతులు తెలిపారు. మండలంలోని బీరోలు, పోచారం, తాళ్లచెరువు, మేడిదపల్లి, ఏలువారిగూడెం, పాతర్లపాడు తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి పైగా రైతులు ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేతో పాటు టన్నెల్ ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన డిఈఈ బాణాల రమేష్‌రెడ్డితో పాటు ఇతర ఇరిగేషన్ అధికారులను సైతం రైతులు సన్మానించనున్నారు.

కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-మధిర

పేదింటి ఆడబిడ్డకు బీఆర్ఎస్ ప్రభుత్వం భరోసాగా మారిందని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. మంగళవారం మధిర మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కంటి వెలుగు : ఎంపీపీ

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

మండల పరిధిలోని ఏలూవారిగూడెంలో మండల వైద్యశాఖ అధికారులు ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిర కేంద్రాన్ని ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కంటి వెలుగు వైద్య శిబిరం పేద ప్రజలకు ఒక వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరామ్ నాయక్, ఎంపీఓ రాజేశ్వరి, స్థానిక సర్పంచ్ దేవరం దేవేందర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు దూడ మృతి

నవతెలంగాణ - బోనకల్

మండలంలో సోమవారం రాత్రి భారీ గాలి వాన, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడడంతో గోవిందాపురం ఎల్ గ్రామంలో పిడుగుపాటుకు కోడే దూడ మృతి చెందింది. గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన మర్రి వెంకటేష్ అనే పేద రైతు కోడె దూడను సోమవారం సాయంత్రం పొలం దగ్గరకు నుంచి తోలక వచ్చి తన ఇంటి సమీపంలో గల చింత చెట్టుకు కట్టి వేశాడు. సోమవారం అర్ధ రాత్రి రెండు గంటల సమయంలో పడిన భారీ వర్షానికి పిడుగుపడి కోడె దూడ అక్కడికక్కడే మృతి చెందింది.

టీఎన్జీవో సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-ఖమ్మం

టీఎన్జీవో యూనియన్ జిల్లా అధ్యక్షులు షేక్.అఫ్జల్ హసన్, రాష్ట్ర కార్యదర్శి జిఎస్.ప్రసాద్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ.మజీద్‌ల పిలుపు మేరకు మంగళవారం ఖమ్మం ఐడిఓసి లోని సర్వే ల్యాండ్ డిపార్ట్మెంట్ లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. సర్వే ల్యాండ్ డిపార్ట్మెంట్ ఫోరమ్ అధ్యక్షులు లక్ష్మణ్, కార్యదర్శి పి.మురళి ఆధ్వర్యంలో ఉద్యోగులకు సభ్యత్వాలు అందజేశారు. ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులకు రూ.100లు చెల్లించి జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హసన్ తన సభ్యత్వం పొందారు. కార్యక్రమంలో టౌన్ ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, ట్రెజరర్ ఉపేందర్, డీఐ వెంకట్రావు, సర్వేయర్‌లు బాషమియా, ఉమామహేశ్వరరావు, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



వద్దిరాజు యువసేన అన్నదానం

నవతెలంగాణ- ఖమ్మం

రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని అన్నం ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, అభాగ్యులకు, విధి వంచితుల సమక్షంలో తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నాగుల్ మీరా, సీనియర్ జర్నలిస్ట్ ఆకుతోట ఆదినారాయణ, వద్దిరాజు రవన్న యువసేన సభ్యులు నానబాల హరీష్, రాపర్తి రాజా, గోలెపు గణేష్, బోయిన కార్తీక్, పత్తి శ్రీను, అరుణ్, మహేష్, సాయి, దోసపాటి కిరణ్, శ్రావణ్ కన్న, ఉమేష్, జక్కుల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల సొసైటీ పాలకవర్గం ఎన్నిక

నవ తెలంగాణ - ఎర్రుపాలెం

మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో గల యశోద కృష్ణ గొర్రెల సొసైటీ నూతన పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బనిగండ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు ఎన్నికల అధికారిగా ఖమ్మం రిజిస్టర్ అధికారి గంగారపు ఉష శ్రీ వ్యవహరించారు.అధ్యక్షులు గా బండారు శ్రీనివాస రా వు యాదవ్, ఉపాధ్యక్షులుగా బాజీ, శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శిగా బండారు నవీన్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శీలం అక్కి రెడ్డి,ఎర్రుపాలెం మండల యాదవ్ సంఘ నాయకులు బుర్ర వెంకటనారాయణ యాదవ్, యశోద కృష్ణ గొర్రెల సొసైటీ సభ్యులు, యాదవ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బ్లూమింగ్ మైండ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాంప్ ప్రారంభం

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని బల్లెపల్లి బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ పాఠశాల అండ్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ పది రోజులు టిఎస్ సెకండ్ బిఎన్ కంబైన్డ్ వార్షిక శిక్షణ క్యాంపు 2ను ఘనంగా ప్రారంభించారు. తొలుత భారత సాయుధ దళాల యువ విభాగానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కస్పాండెంట్ బి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని యువతకు క్రమశిక్షణ దేశభక్తి గల పౌరులుగా అభివృద్ధి చేయడంలో నిమగ్నమై ఉన్న ఆర్మీ నేవీ అండ్ ఎయిర్ ఫోర్స్‌తో పాటు కూడిన ట్రైన్ సర్వీసెస్ ఆర్గనైజింగ్ అధికారిని అభినందించారు. ఇటువంటి శిక్షణ శిబిరానికి బ్లూమింగ్ మైండ్ స్కూల్ 10 రోజులు ఆతిథ్యం ఇవ్వడం ఎంతో హర్ష నీయమని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతి ఎన్సిసి విద్యార్థి ఈ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం చెందిన విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్సిసి కో అధికారి నవీన్ యాదవ్, పాఠశాల చైర్మన్ డాక్టర్ భీంరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ జీ.ప్రసాద్, ఎస్ఎం జితేంద్ర వహీబ్ తదితరులు పాల్గొన్నారు.

బడే సాహెబ్ కుటుంబాన్ని పరామర్శించిన తుమ్మల

నవతెలంగాణ-చింతకాని

వందనం గ్రామానికి చెందిన బారాస సీనియర్ నాయకులు, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షేక్ బడే సాహెబ్ కుటుంబాన్ని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం వందనంలోని బడే సాహెబ్ నివాసంలో పరామర్శించారు. ఇటీవలే అనారోగ్యంతో బడే సాహెబ్ తల్లి హుస్సేన్ బి మరణించింది. తుమ్మల నాగేశ్వరరావు బడేసాహెబ్ కుటుంబానికి పరామర్శించి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాదు రమేష్ రెడ్డి, పసుపులేటి వెంకట్, జొన్నలగడ్డ రవి, వేజెల్ల సురేష్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య, ఎంపీపీ పూర్ణయ్య, జిల్లా రైతు సమితి సభ్యులు మంకెన రమేష్, సుడా డైరెక్టర్ చల్లా అచ్చయ్య, మండల రైతు సమితి కన్వీనర్ రత్నాకర్, వైస్ ఎంపీపీ హనుమంతరావు, మండల కార్యదర్శి వెంకటరామయ్య, నూతలపాటి వెంకటేశ్వరావు వందనం సర్పంచ్, ఉప సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ అమీన్ సాహెబ్, దూదేకుల సంఘం నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ పుల్లా సాహెబ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ మీరా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'సత్తుపల్లి' జర్నలిస్టులకు.. ఇండ్ల స్థలాలు కేటాయించండి

- సీఎం కేసీఆర్‌ను కోరిన ఎమ్మెల్యే సండ్ర

- సానుకూల స్పందన...సీఎస్‌కు ఆదేశం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాల్సిందిగా సీఎం కేసీఆర్‌కు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎంను సండ్ర కలుసుకున్నారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ వీఆర్ఏల రెగ్యులరైజేషన్, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ తదితర నిర్ణయాల పట్ల ధన్యవాదాలు తెలిపారు. సత్తుపల్లి పట్టణంలో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. సండ్ర వినతుల పట్ల సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించమని ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలివ్వాల్సిందిగా సీఎస్ శాంతకుమారిని ఆదేశించారు. సీఎం సానుకూల స్పందన పట్ల సండ్ర కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సై గారూ...ఇదేం తీరు..?

- సివిల్ మ్యాటర్స్‌లో తలదూర్చుతున్నట్లు ఆరోపణలు
- పలు కేసుల విచారణలో అలసత్వం..
- ప్రశ్నిస్తే బెదిరింపులు
- పోలీస్ బాస్‌కు బాధితుల ఫిర్యాదు



నవతెలంగాణ-చింతకాని

చింతకాని పోలీసు సబ్ ఇన్ స్పెక్టర్ పై పలు ఆరోపణలు వస్తున్నాయి. సివిల్ మ్యాటర్స్ లో తలదూర్చి, భూ వివాదాలలో సెటిల్మెంట్లకు పాల్పడుతున్నట్లు ఆయనపై అభియోగాలు ఉన్నాయి. మండలంలో వరుస దొంగతనాలు జరుగుతున్నా పట్టించుకోకుండా.. ఫిర్యాదు చేసిన బాధితులనే తిట్టటం, అసభ్యకరంగా దూషించటం, అవమానించటం లాంటి సంఘటన చోటు చేసుకుంటున్నాయి. ఈ మేరకు సోమవారం పలువురు బాదితులు జిల్లా పోలీస్ బాస్ విష్ణు ఎస్ వారియర్ కు పిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మండలంలో పలు భూవివాదాల్లో బాధితులను బెదిరించడం, ఎలాంటి విచారణ లేకుండా భూ సమస్యలపై కేసులు పెట్టడం లాంటి అనైతిక చర్యలకు ఎస్సై పాల్పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. నామవరం గ్రామానికి చెందిన రైతు పగడాల హరీష్ 15 క్వింటాళ్ల మిర్చి దొంగతనం జరిగిందని ఏడాది క్రితం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి.. కాళ్లు అరిగేలా ఆరు నెలల పాటు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగితే కానీ కేసు నమోదు చేశారు. కానీ ఆ కేసు పై నేటి వరకు విచారణ లో ఎలాంటి పురోగతి లేదు. న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ కు వెళ్లిన హరీష్‌పై ఎస్సై ఇష్టానుసారంగా మాట్లాడుతూ... నీపైనే కేసు పెడతానని బాధితుడిని బెదిరించడం చర్చనీయాంశం అయింది . చింతకానికి చెందిన దేశబోయిన వెంకటేశ్వర్లు లక్షన్నర విలువ చేసే నాటు కోళ్ల అపహరణకు గురైనట్లు ఫిర్యాదు చేసి.. నిందితుడి వివరాలు తెలియచేసినా... సెటిల్మెంట్ మీరే చేసుకోండి అని బాధితులకు సూచించినట్లు ఆరోపణలున్నాయి. వందనం, నాగులవంచ గ్రామాల్లో వరుస చైన్ స్నాచింగ్లు, దొంగతనాలు జరిగినా వాటిపై ఎలాంటి విచారణ చేపట్టలేదు. వందనం, తిమ్మినేనిపాలెం గ్రామాల్లో భూవివాదాలు, సివిల్ కేసుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎస్సై ఓ వర్గం వారికి కొమ్ముకాసి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నరసింహాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గేదెలు దొంగతనం జరిగిందని ఎన్నిసార్లు పిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బాదితుడు మండల పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వగా స్పందించిన జిల్లా కలెక్టర్ బాధితుడు వెంకటేశ్వర్లు కేసు విచారించాలని ఎండార్స్ చేసి ఏడాది గడిచినా నేటి వరకు ఆ కేసు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. తాజాగా మండలంలో శాంతిభద్రతలు పట్టించుకోకుండా కేవలం పోలీస్ స్టేషన్లో భూదందాలు, సెటిల్మెంట్లు, అక్రమార్కుల వద్ద డబ్బులు తీసుకుని బాధితులకు అన్యాయం చేయటం వంటి సంఘటనలపై పూర్తి విచారణ చేపట్టి ఎస్సైపై చర్యలు తీసుకోవాలని బాధితులు సోమవారం కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. .తాజాగా శనివారం మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన బత్తుల దుర్గారావు, సీతయ్య అనే వ్యక్తులను పాత కక్షలు నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బత్తుల ప్రసాద్ మరో నలుగురు వ్యక్తులు కలిసి విచక్షణ రహితంగా దాడి చేయగా దుర్గారావు సీతయ్యలకు తల పగిలి దెబ్బలు తగిలాయి ఈ విషయమై వారు గత రెండు రోజుల క్రితమే స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ పేరుతో ఎస్సై తాత్సారం చేస్తున్నట్లు బాధితులు పేర్కొన్నారు.ఇప్పటికైనా జిల్లా పోలీస్ బాస్ స్పందించి తక్షణమే ఎస్సైపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు కోరుతున్నారు.

బాధితులు వస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం
: ఎస్ఐ వెంకన్న

మండలంలో శాంతి భద్రతల కోసం ప్రజల రక్షణ కోసం పోలీసు వ్యవస్థ పని చేస్తుంది. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం.

లక్ష్యం మేరకు హరితహారం : కలెక్టర్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



తెలంగాణకు హరితహారంలో భాగంగా 2023-24 కార్య ప్రణాళిక లక్ష్యం మేరకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ సూచించారు. ఐడీవోసీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులతో కలిసి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో బృహత్ పల్లె ప్రకృతి వనాలు, హార్టికల్చర్, ట్యాంక్ బండ్ ప్లాంటేషన్, కెనాల్ బండ్, అవెన్యూ ప్లాంటేషన్, హరితవనాలు, కమ్యూనిటీ ప్లాంటేషన్, సంస్థాగత ప్లాంటేషన్, హోమ్ స్టెడ్ కింద 19,87,750 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మండలాల వారీగా గ్రీన్ యాక్షన్ ప్లాన్ రూపొందించి లొకేషన్లను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలోని 589 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించినట్లు, 3,13,068 యాక్టివ్ వేజ్ సీకర్లు ఉన్నట్లు, 69,548 వేజ్ సీకర్లు రిపోర్ట్ చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ కూలీల పెంపుకు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. పని ప్రదేశాల్లో ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని, నీడ, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పనులు ఎండ తీవ్రత పెరగకముందే ముగించేలా చూడాలని అన్నారు. జిల్లాలో 754 ఆవాసాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు లక్ష్యం కాగా, 480 చోట్ల స్థల గుర్తింపు చేసి, 468 పనులను గ్రౌండింగ్ చేపట్టి, 460 పూర్తి చేసినట్లు వివరించారు. మిగులు క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ-2023 లో గ్రామ, జిల్లాస్థాయి లో నిర్దేశిత లక్ష్యాల మేరకు మార్కులు పొందే విధ%శీ%గా చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛ సర్వేక్షన్ లో ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యం తేవాలని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జెడ్పి సిఇఓ అప్పారావు, డిఆర్డీవో విద్యాచందన, డివిజనల్ పంచాయతీ అధికారులు పుల్లారావు, ప్రభాకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-నేలకొండపల్లి



వికలాంగులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సిపిఎం మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చెరువుమాదారం గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వికలాంగులు వారితో తమ గోడు వెళ్ళబోసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీసేవ కేంద్రాల వద్ద వికలాంగులు సదరం సర్టిఫికెట్ కోసం, స్లాట్ బుక్ చేసుకోవడానికి ఉదయం 8 గంటల నుండి పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. వికలాంగులు సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుక్ చేసుకోవడానికి అవసరమైన సైట్ ఓపెన్ చేయకుండా నిర్లక్ష్యం వహించడంపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి వికలాంగుల మీద నిర్లక్ష్య పూరిత కక్ష సాధింపు సరికాదన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ బి వెంకటేశ్వర్లు మంగళవారం నుండి జూన్ 27వ వరకు వికలాంగులు సదరం క్యాంపు కొరకు స్లాట్ బుక్ చేసుకోవచ్చని ప్రకటనలో తెలియజేశారన్నారు. వికలాంగులు చెరువుమాదారం, నేలకొండపల్లి, కూసుమంచి తదితర మీసేవ కేంద్రాల వద్ద స్లాట్ బుకింగ్ కోసం గంటల తరబడి వేచి చూడడంతో, మీసేవ నిర్వాహకులు సైట్ ఓపెన్ కానందున మళ్లీ రావాలని చెప్పడంతో వెనుతిరిగారన్నారు. పగిడిపత్తి నాగేంద్ర, పెదపాక వీరబాబు, శ్యామలేటి చిన్న రాములు అనే వికలాంగులు ఇంటింటికి సిపిఎం పేరుతో వారి ఇండ్లకు వెళ్ళినపుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఈ విషయంలో మండల పరిషత్ అధికారులను సంప్రదించగా స్లాట్ బుకింగ్ చేసుకోమని చెప్పటం నిజమేనని మీసేవ కేంద్రాల్లో సైట్ ఎందుకు ఓపెన్ కాలేదో కారణం తెలీదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధికారులతో వికలాంగులకు సదరం సర్టిఫికెట్ల కోసం స్లాట్ బుకింగ్ అందరూ చేసుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎరదేశి నరసింహారావు, పాలకుర్తి బోడయ్య, నాగవల్లి తిరపయ్య, పాలకుర్తి స్వామి, ,పాలకుర్తి బ్రహ్మం, ఎస్కే మైమ్మద్, లక్ష్మయ్య, శీలం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదమల్ల అప్పారావు వర్ధంతి

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ పెదమల్ల అప్పారావు 23వ వర్ధంతి పార్టీ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ వర్ధంతి సభకు పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పారావు స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని కుటుంబరావు ఆవిష్కరించారు. స్థూపానికి రంజాన్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చింతనిప్పు సూరయ్య, యాసా వెంకయ్య, యాసా ప్రభాకర్‌రావు, వేముల సాంబశివరావు, ప్రముఖ న్యాయవాది అన్నారపు వెంకటేశ్వర్లు, యాసా జగ్గారావు, పాపిట్ల ఏసు, తొగర అశోక్, యాసాతిలక్ అప్పారావు సతీమణి పద్మిని తిలకం, కుమార్తె ఝాన్సీ, సిపిఐ సీనియర్ నాయకులు కొనపర్తి విష్ణుమూర్తి, ఎస్టియు జిల్లా నాయకులు లేడీపోయిన గోపాలరావు, సిపిఐ గ్రామ కార్యదర్శి యాసా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

నవతెలంగాణ- కల్లూరు

అదనపు వరకట్నం కోసం భర్త, అత్తామామతో పాటు మరికొందరు వేధింపులకు గురిచేస్తుంటే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీ.రఘు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చెన్నూరు గ్రామానికి చెందిన భావన అనే మహిళకు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు గ్రామానికి చెందిన మూడుమంతల పుల్లారావుతో ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. అప్పటి నుండి భర్త, అత్తామామలు అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తుండేవారు. భావన పుట్టింటికి రాగా ఈ క్రమంలో భర్త పుల్లారావుతోపాటు అతని స్నేహితులు పుట్టింటి దగ్గర ఘర్షణకు దిగారు. దీంతో మహిళ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



29 కుటుంబాలకు కందాళ ఆర్థికసాయం

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని పోచారం, కిష్టాపురం, కొక్కిరేణి, తురకగూడెం, కూసుమంచి, గుర్వాయిగూడెం, మల్లాయిగూడెం గ్రామాల్లో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన 29 కుటుంబాలను ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ మంగళవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున రూ.2,90,000 లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కంచర్ల పద్మ వీరారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు వేముల వీరయ్య, ఆసిఫ్ పాషా, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

గ్రామ పంచాయతీ కార్యదర్శులను క్రమ బద్ధీకరిస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తగిన న్యాయం చే స్తామని ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రకటించిన సందర్భం గా మండల కేంద్ర మైన ఎర్రుపాలెం మండల ప్రజా పరి షత్ కార్యాలయం నందు కెసిఆర్ చిత్ర పటానికి పాలా భిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు తలుపుల రాము, వరి కూటి సురే ష్ బాబు, మరీదు. కొండలరావు, ఎం శ్రీనివాస్ రెడ్డి, ప వన్, గోవర్రాజు శ్రీనివాసరావు, కన్నేదార శ్రీనివాసరావు, మహేష్, రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పంబి సాంబశివరావు, ఎంపీపీ దేవరకొండ శిరీష, ఎంపీటీసీలు సగ్గుర్తి కిషోర్ బాబు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ మృతి.. తలకొరివి పెట్టిన కూతురు

నవతెలంగాణ- నేలకొండపల్లి

మండలంలోని నాచేపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీ అనారోగ్యంతో మృతి చెందడంతో కూతురు తలకొరివి పెట్టిన ఘటన మంగళవారం జరిగింది. మందా నాగభూషణం, భార్య లలిత నిరుపేద కుటుంబం. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు సుధారాణి, భువనేశ్వరి ఉన్నారు. భర్త నాగభూషణం ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఖమ్మం ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మరణించారు. తండ్రి దహన సంస్కారాలలో తలకొరివి పెట్టేందుకు వారసులు లేకపోవడంతో ఆ బాధ్యతను పెద్ద కూతురు సుధారాణి భుజాన వేసుకుంది. తండ్రి అంత్యక్రియలలో కొడుకు లేని లోటును తీర్చేలా సిలువ పట్టుకొని ముందు నడిచింది. విషయం తెలుసుకున్న గ్రామ టిఆర్ఎస్ నాయకులు ముత్తినేని వీరయ్య, పచ్చ జగన్మోహన్రావు, గ్రామ సర్పంచ్ మందడి రాజేష్, ఉపసర్పంచ్ పల్లెపొంగు గోవిందరావు, ఎంపీటీసీ బాబురావు, ఎమ్మార్పీఎస్ నాయకులు బాలస్వామి, వీదయ్య కాంగ్రెస్ నాయకులు బోయిన వేణు, సూరేపల్లి రవి, శ్రీనాథ్ తదితరులు నాగభూషణం భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మూడు యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక

నవతెలంగాణ- కల్లూరు

బీసీ మైనారిటీ లోన్ల కోసం నిర్వహించిన లాటరీలో ముగ్గురు లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఎండిఓ బి.రవికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో బిసి మైనారిటీల లోన్లు కోసం లబ్ధిదారులు ఎంపిక కార్యక్రమం చేపట్టారు. మొత్తం 188 మంది లబ్ధిదారులు హాజరు కాగా వారి అర్హతను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల అభిప్రాయం మేరకు లాటరీ ద్వారా యూనిట్లు ఎంపిక చేయాలని నిర్ణయించారు. రెండు యూనిట్లు లక్ష రూపాయలు చొప్పున, ఒక యూనిట్ రెండు లక్షలు, నిర్ణయించారు. ఈ సమావేశంలో గ్రామీణ వికాస్ బ్యాంక్, యూని యన్ బ్యాంకు, డిసిసిబి బ్యాంక్, ఫీల్డ్ ఆఫీసర్లు హాజరు కాగా మూడు యూనిట్లు లోన్లు ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. లబ్ధిదారులు ఎంపిక ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వివిఎస్ శర్మ, ఎం పీ వో వీరస్వామి, పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ - కూసుమంచి

ముందస్తు వరి సాగు, రానున్న వానకాలంకి సంబంధించి తీసుకోవలసిన ముందస్తు చర్యలు గురించి రైతులకు మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, ఏఈఓ ప్రియాంక, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ అజీజ్ , రైతులు పాల్గొన్నారు.



ముగిసిన సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

పిల్లల విజ్ఞానం పెంపొందించే సమ్మర్ క్యాంప్ మంగళవారంతో ముగిసింది. జన విజ్ఞాన వేదిక, ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని నిర్మల్ హృదయ్ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 17న తేదీ నుండి ప్రారంభమైన పిల్లల విజ్ఞానం పెంపొందించే సమ్మర్ క్యాంప్ మంగళవారం వరకు ఆహ్లాదకరంగా ముగిసింది.ముగింపు రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రావతి పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు నేర్చుకున్న శాస్త్రీయ జ్ఞానం వారిని భావి భారత పౌరులుగా ఎదగడానికి, దేశ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంతి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి అలవాల నాగేశ్వరరావు, టీపీఎస్కే కన్వీనర్ ఝాన్సీ, సదానంద, శ్రీలత, రౌతు రవి, శేషగిరి, దేవేంద్ర, నాగేశ్వరరావు, ఒరిగమి మోహన్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. రాములమ్మ, జిల్లా అధ్యక్షులు టి.శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శి కె.రామారావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-చింతకాని

పాతర్ల పాడు గ్రామంలో బుధవారం సాయంత్రం 6 గంటల నుండి ఎన్టీఆర్ శత జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చింతకాని మండల టిడిపి అధ్యక్షులు నున్న తాజుద్దీన్ కోరారు. మంగళవారం చింతకాని మండల టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ జయంతోత్సవాలు కార్యక్రమంలో జిల్లా టిడిపి కన్వీనర్ కూరపాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర నాయకులు కనగాల సాంబశివరావు, జీవన్ కుమార్, కొండబాల కర్ణాకర్, జిల్లా మండల గ్రామ నాయకులు ప్రసంగిస్తారన్నారు. సీనియర్ కళాకారులకు ఎన్టీఆర్ కళా పుష్కరం మరియు ఎన్టీఆర్ చలనచిత్రాలపై సంగీత విభావరి తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని అన్నింటిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నన్నక గోపాలరావు, మల్లెల సత్యనారాయణ, మండల తెలుగు రైతు అధ్యక్షులు రామారావు, మండల టిడిపి ఉపాధ్యక్షులు తెలుకుంట శ్రీనివాసరావు, నన్నక రామారావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకు ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఇద్దరు ఎస్సైలలో బదిలీపై వరంగల్ కమీషనరేట్ కు వెళ్తున్న ఎస్సై జి.అరుణ్‌ను మరో ఎస్సై ఈ.రతీష్ మంగళవారం స్టేషన్ లో శాలువాతో సత్కరించి, ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్సై రతీష్ మాట్లాడుతూ.. సంవత్సరం పాటు ఒకే స్టేషన్‌లో అరుణ్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగ రీత్యా బదిలీ అవ్వడం ఒంకిత బాధగా వున్నా విధి నిర్వహణలో భాగంగా తప్పదని చెప్పారు. అనంతరం ఎస్సై అరుణ్ మాట్లాడుతూ.. అనతికాలంలోనే స్టేషన్ లో ఎస్సై రతీష్, సిబ్బందితో మంచి స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయని, విధి నిర్వహణా పరంగా కొత్త విషయాలు చాలా తెలుసుకున్నానని అన్నారు. అలాగే మండల ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయడానికి 100 శాతం కృషి చేశానని తెలిపారు. అనంతర ఆయనను సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ వెంకట్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, ఎం.శ్రీనువాస్, వై.శ్రీనివాస్, ఉపేందర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం 29న స్పాట్ కౌన్సెలింగ్

ఐటీడీఏ పీవో

నవతెలంగాణ-భద్రాచలం

2023 - 24 విద్యాసంవత్సరానికి గాను ఈఎంఆర్ఎస్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి గాను మిగిలిన సీట్ల అడ్మిషన్ స్పాట్ కౌన్సెలింగ్ అమ్మాయిలకు ఈనెల 29న ఉదయం 10 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ.ఎం.ఆర్ఎస్ చర్ల పాఠశాల(భద్రాచలం)లో జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో జాయిన్ అవ్వడానికి గిరిజన విద్యార్థులు మాత్రమే అర్హులని, 2022-23 విద్యాసంవత్సరం ఏప్రిల్ 2023లో పాస్ అయిన వారు మాత్రమే అర్హులని అన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరై స్పాట్ కౌన్సిలింగ్ సమయంలో సమర్పించాలని అన్నారు. ఈ ఎంఆర్ఎస్ గండుగులపల్లి కళాశాలలో ఎంపీసీ 14, బీపీసీ 9, సీఈసీ 11, మొత్తం 34 సీట్లు, ఈఎంఆర్ ఎస్ పాల్వంచ కళాశాలలో ఎంపీసీ 17, బిపిసి 11, సీఈసీ 27, మొత్తం 55 సీట్లు కలవని ఆయన తెలిపారు. వివరాలకు ఈఎంఆర్ఎస్ గండిగులపల్లి ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్ 9948933010, పాల్వంచ ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్ 8317556834, ఈఎంఆర్ఎస్ చెర్ల, భద్రాచలం ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్ 9701495907 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

26న జాబ్ మేళా : ఐటీడీఏ పీవో

నవతెలంగాణ- భద్రాచలం

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ భద్రాచలం ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో గల గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించే నిమిత్తం ఈనెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ లేబరేటరీస్ ఫార్మా కంపెనీలో టెక్నికల్ ట్రైనీలుగా పనిచేయుటకు 2022- 2023 సంవత్సరాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ/ బైపీసీ నందు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై 17 - 20 సంవత్సరాల మధ్య వయసు గల యువకులకు ఉద్యోగంతో పాటు బిఆర్ అంబేద్కర్ /తెలంగాణ యూనివర్సిటీలో ఉచితంగా డిగ్రీ చదివించబడునని చెప్పారు. పదవ తరగతి, ఆ పైన ఐటిఐ (ఫిట్టర్ /వెల్డర్ ,టర్నర్), బిఎస్‌సి /ఎంఎస్‌సి (కెమిస్ట్రీ జిఎన్ఎమ్/ బిఎస్సి నర్సింగ్) చదివి వయసు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల గలవారికి సన్ షైన్ హెల్త్ కేర్, ఈక్విటీ గ్రూప్ కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువత విద్యా అర్హత పత్రాలు ఆధార్ కార్డు, కుల దవీకరణ, జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈ నెల 26న ఉదయం 9 గంటలకు ఐటిడిఏ భద్రాచలం యూత్ ట్రైనింగ్ సెంటర్ నందు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన తెలుపుతూ పూర్తి సమాచారం కొరకు 8143840906,8106141505 ఫోన్ నెంబర్లను సంప్రదించగలరని ఆయన తెలిపారు.

సమాజం గర్వించదగ్గ సంఘ సేవకులు డాక్టర్. పాల్ రాజ్

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం పట్టణంలోని సెయింట్ పాల్స్ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు డా. పాల్ రాజ్ వర్ధంతి నిర్వహించారు. జి.ఎస్.ఇ.ఎల్.సి సంఘ ప్రెసిడెంట్ డాక్టర్ రాధా మంజరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెవరెండ్ జాషువా పీటర్ తదితరుల హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాలరాజ్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్వకూరి అబ్రహం, జిఎస్ఈఎల్సి పాస్టర్స్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ ఘాతం తో గేదె మృతి

నవతెలంగాణ-సుజాతనగర్

విద్యుత్ ఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు లోకి వెళ్తే మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన జంగిలి సర్వయ్య గేదె మంగళవారం ఉదయం మేతకు వెళ్ళింది. కాపు భద్రా చెరువు కింద పంట పొలాల్లో సోమవారం అర్ధరాత్రి వీచిన గాలి దుమ్ములకు కరెంటు తీగ తెగి కింద పడటంతో ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు 80 వేల రూపాయలు ఉంటుందని ప్రభుత్వం స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.



బ్యాంకు ఉద్యోగులతో భద్రాచలం ఏఎస్పీ సమావేశం

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం బ్యాంకు ఉద్యోగులతో సమావేశమయ్యారు. పట్టణంలో సుమారు 14 బ్యాంక్ బ్రాంచ్ అధికారులకు ఆర్‌బిఐ చేపట్టిన రూ.2000 నోట్ ఉపసంహరణపై ప్రజలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుకు వచ్చే కస్టమర్లకు విధిగా తాగడానికి మంచినీరు, ఎండ బారిన పడకుండా ఉండడానికి అవసరమైతే బ్యాంకుల ముందు టెంటు ఏర్పాటు చేయాలని కోరారు. రూ.2000 రూపాయల నోటు ను ఎక్స్చేంజి, డిపాజిట్లపై బ్యాంకులు అవలంబిస్తున్న విధివిధానాలు,ఆర్‌బిఐ మార్గదర్శకాలను ఫ్లెక్సీ రూపంలో ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా బ్యాంకుల ముందట అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, ఎస్ఐలు శ్రీకాంత్, మధు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె పరిష్కారం పై దృష్టి పెట్టండి

నవతెలంగాణ-కరకగూడెం

వీవోఎలు చేస్తున్న సమ్మెపట్ల రాష్ట్ర ప్రభుత్వ అణచివేత చర్యలను మానుకొని చర్చలకు పిలిచి సమ్మె పరిష్కారం చేయకపోతే రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు కొమరం కాంతారావు అన్నారు.మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించి మండల పరిషత్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివోఏలు వెంకన్న, రమాదేవి, పాపారావు, సునీత, లావణ్య, భవాని లక్ష్మీనారాయణ, పాయం మల్లయ్య, గోపాలరావు, తోలెం రాజు, చుక్కయ్య, రమాదేవి, సారక్క, పద్మ, నరసింహారావు, ముత్తయ్య, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు

భద్రాచలం ఏఎస్పీ పరితోస్ పంకజ్

నవతెలంగాణ - భద్రాచలం

నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసగిస్తే పీడియాక్ట్ నమోదు చేస్తామని భద్రాచలం ఏఎస్పి పరితోష్ పంకస్ హెచ్చరించారు. భద్రాచలం పట్టణంలో సుమారు 23 విత్తనాల షాపుల యజమానులు, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అనిల్ కుమార్ తదితరులతో ఏఎస్పీ మంగళవారం సమావేశమయ్యారు. నకిలీ విత్తనాలపై ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి వివరించారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఉన్న పోలీసు వారి దృష్టికి తీసుకురావలసిందిగా కోరారు. రైతులు కొనుగోలు చేసేటప్పుడు విధిగా రసీదు ఇచ్చి సంబంధిత రిజిస్టర్లో ఎంట్రీలు ఉండే విధంగా చూసుకోవాలని యజమానులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, ఎస్ఐలు శ్రీకాంత్, మధు ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గు పరిశ్రమ రక్షణకు పోరాడుదాం...



సింగరేణి ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకుందాం

సీఐటీయూ రాష్ట్ర మహాసభలో పలు తీర్మానాలు

నవతెలంగాణ-కొత్తగూడెం

బొగ్గు పరిశ్రమ రక్షణకు కలిసి పోరాడుదామని, సింగరేణి సంస్థను ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకుందామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటియూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజిరెడ్డి, మందా నర్సింహారావు అన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) 16వ రాష్ట్ర మహాసభలు మే 21, 22 తేదీల్లో గోదావరిఖని ఆర్‌జి-1లో జరిగాయి. ఈ మహాసభలో నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ పలు తీర్మాణాలు చేసిందని వారు మంగళవారం తెలిపారు. ఈ మహాసభలు చేసిన ముఖ్యమైన తీర్మానాలు.

బొగ్గు పరిశ్రమ రక్షణ, సింగరేణి ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకోవాలని, సింగరేణిలో బొగ్గు తీసే పనులు సింగరేణి కార్మికులతోనే చేయించాలని, సింగరేణికి రావలసిన రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలని, కార్మికుల సొంత ఇంటి పథకం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జేబీసీసీలో అగ్రిమెంట్ అయి అమలు కాని అంశాలు ప్రస్తావించారు. పెర్క్స్‌పై ఇన్కమ్ టాక్స్, ప్రమోషన్లకి ఇంక్యుమెంట్లు, స్టేటస్ స్కీములు అమలు తదితర అంశాలు చర్చించారని తెలిపారు. సింగరేణిలో అగ్రిమెంటే అమలు గాని అంశాలు వాటిని అమలు చేయాలన్నారు. ముఖ్యంగా ఉద్యోగం పొందిన రోజుల్లో ఉన్న పేర్ల మార్పిడి, డిపెండెంట్ల వయస్సు 40 సంవత్సరాలకు పెంపు, అండర్ గ్రౌండ్‌లో పనిచేసే సర్ఫేస్ కు వచ్చిన మైనింగ్, టెక్నికల్, ఈపి గ్రేడ్స్, కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని సూచించారు. హాస్పిటల్ సౌకర్యం మెరుగుపరచాలని, వైద్య పరికరాలు మెరుగుపరచాలని నైపుణ్యం గల డాక్టర్లను నియమించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఐ పవర్ కమిటీ వేతనాలు, రాష్ట్ర ప్రభుత్వ జీవో నెంబర్ 22 అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య సౌకర్యం కల్పించాలని, అగ్రిమెంట్ అయిన దానిని అమలు తోపాటు బోనస్ పెరుగుదల సౌకర్యాల మెరుగుపరచవులని అంశాలను తీర్మాణాలో పొందు పరిచారని తెలిపారు.

సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా టి.రాజిరెడ్డి

కార్యదర్శిగా మందా నర్సింహారావు

కొత్తగూడెం నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా

విజయగిరి శ్రీనివాస్

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభలు మే 21, 22 తేదీల్లో గోదావరిఖని ఆర్‌జి-1లో నిర్వహించారు. ఈ మహాసభలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ మూడు సంవత్సరాల పాటు అమలులో ఉంటుంది. గౌరవాధ్యక్షులు కామ్రేడ్ పి. రాజారావు, రాష్ట్ర అధ్యక్షులుగా టి.రాజారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంద నరసింహారావు లను ఎన్నుకున్నారు. ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ .నాగరాజు, గోపాల్, కోశాధికారిగా వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మెండే శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పి.మధు, విజయగిరి శ్రీనివాస్, డి. కొమురయ్య, వి.వెంకటరత్నం, కంపెటి రాజయ్యలను ఎన్నుకున్నారు. కార్యదర్శిలుగా ఎస్.వెంకట స్వామి, ఈ కుమార్, మేదర్ సారయ్య, ఆసరి మహేష్, కార్యదర్శి ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి శ్వేత, ఆర్జీ-2, శ్రీరాంపూర్ కో- ఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారని తెలిపారు.

రాష్ట్ర కమిటీ సభ్యులు



విజయగిరి శ్రీనివాస్ , రాష్ట్ర ఉపా

రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎలగొండ రఘు (కొత్తగూడెం), సూరం అయిలయ్య (కొత్తగూడెం), ఈ . శ్రీ రా వ ం క్మా ర్ తి (కొత్తగూడెం), బి.ప్రకాష్ (కొత్తగూడెం), నెల్లూరు నాగేశ్వరరావు (మణుగూరు), టీవీ.ఎంవి. ప్రసాద్ (మణుగూరు), ఎస్.విల్సన్ రాజు (మణుగూరు) ఎస్.ఈశ్వరరావు (మణుగూరు), ఎం. లక్ష్మణరావు (మణుగూరు), ఎండి.అబ్బాస్ (ఇల్లందు), తోకరి శ్రీనివాస్ (భూపాలపల్లి) కె.ఏసుబాబు (భూపాలపల్లి) కంచు రామ్ (భూపాలపల్లి) ఈ.ఉమా (భూపాలపల్లి) కె.వేణుగోపాల్ (ఆర్జీ- 3) ఎం.వెంకటేశ్వర్లు ఆర్జీ - 3, జి.గోపాల్ ఆర్‌జి-3, డి.కొమురయ్య (ఆర్ జి-3) టి. నరహరి రావు (ఆర్జీ- 3), డి.సురేష్ (ఆర్‌జి-1), సిహెచ్. వేణుగోపాల్ రెడ్డి (ఆర్ జీ-1), ఎస్‌కె.గౌస్ (ఆర్‌జీ-1), పి.శ్రీవాసరావు (ఆర్జీ-1), ఆరేపల్లి రాజమౌళి (ఆర్‌జీ -1), అన్నం శ్రీనివాస్ (ఆర్‌జీ-1), యస్.శ్యామల, (ఆర్‌జీ,-1), రామగిరి రామస్వామి (మందమర్రి), జె. వెంకటేష్ (మందమర్రి), ఎండి ఆరిఫ్ (మందమర్రి), శ్రీరాంపూర్ కో-ఆప్షన్-4, ఆర్జీ-2 కో- ఆప్షన్ రెండు ఎన్నుకున్నారు.

ఓటర్ జాబితా ఏర్పాటుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

కలెక్టర్ అనుదీప్

నవతెలంగాణ-పాల్వంచ



ఓటర్ జాబితాలో అర్హులకు ఓటు హక్కు కల్పించడం అనర్హులకు తొలగించడంలో రాజకీయ పార్టీలు జిల్లా యంత్రంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కలెక్టర్ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు నియోజకవర్గాల పరిధిలో 18,438 మంది ఫొటోస్ సిమిలర్స్ ఎంట్రీలు ఉన్నట్లు గుర్తించామని వారిలో 38 మరణించారని 92 మంది ఇతర ప్రాంతాలకు మారినట్లు విచారణలు తేలినట్లు చెప్పారు. 378 మందిని ఓటు హక్కు పొందడానికి అర్హులుగా గుర్తించి వారిని ఫారం 6 జారీ ద్వారా నూతన ఓటర్లుగా నమోదు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 1092 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఆరు కంటే ఎక్కువ ఓట్లు ఉన్న గుర్తించిన 18, 38 ఇండ్లలో 1,61522మంది ఓట్లు ఉన్నారని వారిలో 90,384 మందిని క్షేతస్థాయిలో ఉన్నట్లు గుర్తించామని 7025 మందిని ఓటర్లుగా నమోదు చేయుటకు ఫారం 6 జారీ చేసినట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రతి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేట్ నందు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జూన్ 1న కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవిఎం వివి ప్యాట్లు పనితీరును సమీక్షలో పరిశీలిస్తామని చెప్పారు. ఇద్దరు ఏజెంట్లు జాబితాను ఈనెల 27 వరకు అందజేయాలని చెప్పారు. తప్పులు లేని ఓటర్ జాబితా రూపకల్పనలో భాగంగా రాజకీయ పార్టీలు బూతు స్థాయి ఏజెంట్లను యాక్టివేట్ చేయాలని చెప్పారు. ఏప్రిల్ 1 జులై 1 అలాగే అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాల నుండి ప్రతి ఓటర్ ఓటు హక్కు పొందాలని ఆయన చెప్పారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఎన్‌విఎస్ పోర్టల్ ద్వారా ఓటు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్నికల సెల్ సిబ్బంది నవీన్, బిఎస్‌పి నుండి ఆనందరావు, బిజెపి నుండి లక్ష్మణ్ అగర్వాల్, టిఆర్ఎస్ నుండి షేక్ అన్వర్, సిపిఎం నుండి అన్నవరపు సత్యనారాయణ, కాంగ్రెస్ నుండి మధు తదితరులు పాల్గొన్నారు.



అటవీ ఫలాలు జీసీసీకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలి

ఐటీడీఏ పీవో

నవతెలంగాణ-భద్రాచలం

మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీ గిరిజనులు సేకరించే అటవీ ఫలాలు నేరుగా జిసిసికే విక్రయించేలా సంబంధిత జిసిసి అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రూ సంబంధిత అధికారులకు ఆదేశించారు. జీసీసీ ఆధ్వర్యంలో నడపబడుతున్న పెట్రోల్ బంక్ లు, గిరిజనులు అడవిలో సేకరించే అటవీ ఫలాల కొనుగోలుపై డివిజన్ల వారీగా డివిజన్ అధికారులతో ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకొని జీవనాధారం సాగించడానికి, సొసైటీలుగా ఏర్పాటు చేసి ఆరు పెట్రోల్ బంక్ లు నిర్వహిస్తున్నామని, కానీ గుండాలలో నడపబడుతున్న పెట్రోల్ పంపు వినియోగదారులకు సకాలంలో పెట్రోల్, డీజిల్ సరఫరా కావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, పెట్రోల్ బంక్ లు లాభాల బాటలో నడవాలంటే సొసైటీ సభ్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని 24 గంటలు పెట్రోల్ పంపులు పనిచేసేలా చూడాలని, డీజీలు, పెట్రోలు అమ్మకాల ద్వారా వచ్చిన లాభాలు ఆ పెట్రోల్ బంక్ పేరు మీదనే డిపాజిట్ చేయాలని అన్నారు. ములకలపల్లికి సంబంధించిన పెట్రోల్ బంక్ డెప్సిటి నిధులు ఎంతవరకు రికవరీ అయినాయో వాటి వివరాలు తనకు సమర్పించాలన్నారు. జిసిసి సొసైటీలు లాభాల బాటలో నడపాలంటే అందులో పనిచేస్తున్న సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిసిసి ద్వారా పెట్రోల్ బంక్, అటవీ ఫలాల సేకరణకు సంబంధించిన వివరాలతో పాటు రికవరీ చేసినవి, చెల్లింపులు చేసినవి ఒక సంవత్సరం ప్రతిపాదనల వివరాలు శుక్రవారం నాటికి తనకు సమర్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం జిసిసి విజయ్ కుమార్, డివిజన్ మేనేజర్లు దమ్మపేట నరసింహారావు, పాల్వంచ లక్ష్మోజి, భద్రాచలం, మణుగూరు దావీద్, ఇల్లందు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-కరకగూడెం

ప్రతీ మూడు నెలలకు ఒక్కసారి గ్రామీణా ప్రాంతల ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మొదలగు అంశాలపై నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదా సీదాగా సాగింది. మంగళవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రేగా కాళిక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీలో ప్రజలు ఎందుర్కొంటున్న విద్యుత్, ఉపాధి హామీ, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మొదలగు అంశాలపై సంబంధిత అధికారులు సర్పంచ్‌ల ఎదుట వారివెంట తెచ్చుకున్న సమాచారన్ని చదివి వినిపించారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ మన ఊరు-మన బడి నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్లు నిర్మాణ పనులకు వాటర్ క్యూరింగ్ కూడా చేయడం లేదని సర్పంచులు వాపోయారు. వెంటనే స్పందించి ఎంపీపీ రేగా కాళికా సంబంధిత శాఖ ఏఈ ని వివరణ కోరారు. ఏఈ నక్క మాట్లాడుతూ ఇంత వరకు తన దృష్టికి ఈ విషయం రాలేదని అన్నారు. పనుల్లో ఆలసత్వం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని అన్నారు. పలు అంశాలపై వ్యవసాయ, విద్యుత్, కార్మిక, వైద్య, పంచాయతీ రాజ్, మీషన్ భగీరథ, విద్య పలు శాఖ అధికారులు మండలంలో జరుగుతున్న పనుల వివరాలు తెలిపారు. స్పందించిన ఎంపీపీ సమావేశానికి రాని అధికారుల వివరణ తెలుసుకోవాలని ఎంపిడిఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహాశీల్దార్, ఎంపిటిసిలు, సర్పంచ్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభ వేదికగా పాలకులను నిలదీద్దాం

ప్రజాగర్జన సభ పాలకులకు కనువిప్పు కలగాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ-పాల్వంచ

ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, పోడు సాగుదారులకు పట్టాలు, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థల పరిరక్షణ ఎజెండాగా జూన్ 4న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో లక్ష మందితో ప్రజాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో విస్తృత ప్రచారం పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పాలనలో ప్రజలో అభద్రతాభావం నెలకొందని, ఈ పరిస్థితిలో ప్రజలందరూ ఏకమై ప్రజలకోసం కాకుండా కార్పొరేట్లకు కోసం పనిచేస్తున్న మోడీని గద్దె దించి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతిపరులు, అక్రమార్కులకు బిజెపి అండగా నిలుస్తోందని, ప్రజలకు చెందాల్సిన సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ప్రజల మభ్యపెట్టేందుకు పెద్ద నోటు రద్దు చేశారు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాష, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, అన్నరాపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల లబ్ధిదారులు ఆన్‌లైన్ చేసుకొండి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండలంలో అర్హులైన కురుమ యాదవులు అందరూ డీడీలు తీసి ఉన్నారని, వారందరూ ఈ నెల చివరి లోపు ఆన్ లైన్ చేసుకోవాలని డిప్యూటీ డైరక్టర్ సబిత తెలియజేశారు. మండల పరిధిలోని మర్రిగూడెం పంచాయతీలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో చాలా మంది కురుమ యాదవులు డిడిలు తీసి ఆన్ లైన్ చేయకుండా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈసీ హసీనా, ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాజలం, పుల్లారావు, కురుమ యాదవ సభ్యులు పాల్గొన్నారు.

జెపిఎస్‌ల క్రమబద్ధీకరణ పట్ల సిఎం కేసిఆర్‌కు కృతజ్ఞతలు

పంచాయతీ రాజ్ మినిస్ట్రీ రియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మల్లవరపు రాజేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

జెపిఎస్‌ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అంగీకరించడంపట్ల పంచాయతీ రాజ్ మినిస్ట్రీ రియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లవరపు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018లో నియమితులైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సర్వీస్ రెగ్యులర్ చేయుటకు, విది విధానాలు రూపొందించుటకు వారి సర్వీస్ క్రమబద్ధీకరించుటకు జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీ నియమించుట, రాష్ట్ర స్థాయి నుంచి ఒక సెక్రటరీ స్థాయి లేదు హెచ్ఓడి స్థాయి అధికారి పరిశీలన అధికారిగా వ్యవహరిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేయడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా పంపించిన ప్రతిపాదన రాష్ట్ర స్థాయి కమిటీ ఆమోదించి వారి యొక్క సర్వీసెస్ రెగ్యులర్ చేస్తారని సీఎం కేసీఆర్ ప్రకటించడం ప్రభుత్వానికి పంచాయతీ రాజ్ మినిస్ట్రీ రియల్ ఉద్యోగుల సంఘం తరవున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ యూనిట్ పంచాయతీరాజ్ మినిస్టర్ ఉద్యోగ సంఘం అధ్యక్షులు మల్లవరపు రాజేష్ తెలిపారు.

గూడెం విద్యార్థికి సివిల్స్‌లో ర్యాంక్

ర్యాంకర్ సాయికృష్ణకు పలువురు అభినందనలు

నవతెలంగాణ-కొత్తగూడెం

సివిల్స్ ఫలితాల్లో దేశ వ్యాప్తంగా యువత ఉత్తమ ర్యాంకులు సాధించారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు వారి విజయ కేతనం ఎగుర వేశారు. తిరుపతికి చెందిన పవన్ దత్తా 22వ ర్యాంకు సాధించి తెలుగు వారి సత్తా చాటారు. మరికొంత మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన గ్రంధే సాయి కృష్ణ 293 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా పలువురు సాయికృష్ణను, వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలో షిప్ (ఎస్‌జిఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్ మంగళవారం శ్రీనగర్ కాలనీలోని సాయికృష్ణ ఇంటికి వెళ్లిన శాలువాతో సన్మానించారు. వారి తల్లి దండ్రులకు, కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. సాయికృష్ణ తండ్రి స్థానిక లేపాక్షి లాడ్జిలో మేనేజర్‌గా విధులు నిర్వస్తున్నారు.తల్లి గృహిణి, తమ్ముడు సాఫ్ట్‌వేర్ ఇంజనీయర్‌గా ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు అమ్మాలి

వ్యవసాయ శాఖ అధికారి చటర్జీ, ఎస్సై జీవన్ రాజు

నవతెలంగాణ-కరకగూడెం

ఫెర్టిలైజర్ దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు అమ్మాలని వ్యవసాయ శాఖ అధికారి చటర్జీ, స్థానిక ఎస్సై జీవన్ రాజు అన్నారు. మంగళవారం మండల వ్యాప్తంగా పలు ఫెర్టిలైజర్, పురుగుమందుల దుకాణాలను తమ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనంతరం షాపులోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి చటర్జీ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా దుకాణాలు నిర్వహించిన, నకిలీ విత్తనాలు అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి రసీదులు పొందాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా రైతుల వద్దకు వచ్చి విత్తనాలు ఇస్తాం అని చెప్పినట్లయితే అట్టి విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని సరైన టాకింగ్ లేబుల్ లేకుండా లూస్ గా ఉంటే వాటిని కొనుగోలు చేయవద్దని సూచించారు. విత్తనాల దుకాణాల ముందు స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులను మోసం చేస్తే పీడీకేసులు సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్, అనిల్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-చంద్రుగొండ

ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం వెంకటాయ తండా గ్రామంలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ గుగులోత్ బాలాజీ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమ ఉద్దేశించి సర్పంచ్ బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటి సమస్యలు ఉన్న వారికి ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు రఘునంద సాయి బాబు, హెల్త్ సూపర్ వైజర్ ఇమామ్, ఆప్త మెట్రిక్ రేఖన, నీలిమ, సునీత సిస్టర్, రమ్య, ఆశాలు, సరోజిని, రమాదేవి, సోనా, నీలావతి, మంగమ్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

4న కొత్తగూడెంలో సీపీఐ ప్రజా గర్జన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాద్రి సమస్యపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ప్రజాగర్జన సభలో డిమాండ్ చేయనున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు దేశ సమైక్యతకు సమగ్రతకు భారత దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సిపిఐ ఆధ్వర్యంలో జూన్ 4న కొత్తగూడెం కేంద్రంలో జరిగే సిపిఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునిల్ కుమార్ కోరారు.

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం 24 మే 2023
8

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కార్యదర్శులు

నవతెలంగాణ-పినపాక

జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులను రెగ్యులర్ చేస్తానని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేయడంతో పినపాక ఎంపీడీవో కార్యాలయం వద్ద కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎంపీపీ గుమ్మడి గాంధీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పినపాక సర్పంచ్ గొగ్గేల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు జైపాల్ రెడ్డి, హుస్సేన్, అనిల్, అజహర్, అశోక్, సాయి, సాంబ, ఆదినారాయణ, కృష్ణమూర్తి, రాజు, జ్యోతి, అరుణశ్రీ, సావిత్రి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో సునీల్

నవతెలంగాణ-పినపాక

మండల వ్యాప్తంగా రైతులకు 65 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ రవి శేఖర్ వర్మ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ కార్యక్రమం చేపడుతామని సీఈఓ సునీల్ తెలియజేశారు. ఈ సందర్భంగా మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సీఈఓ సునీల్ మాట్లాడుతూ విత్తనాలు కావలసిన రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేసి ఆన్లైన్ పర్మిట్ పొంది ఆ పర్మిట్లు తీసుకుని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో అందించి విత్తనాలను పొందాలని సూచించారు. 65 శాతం సబ్సిడీ పోను 30 కేజీల జీలుగ బస్తా ధర 842 రూపాయలు, 70, 40 కేజీల పెద్ద జనుము బస్తా ధర 1224. 80 రూపాయలు చెల్లించవలసి ఉంటుందన్నారు. ఒక బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని తెలిపారు.



సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

మాజీ ఎమ్మెల్సీ బాలసాని

నవతెలంగాణ-చర్ల

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గం ఇన్చార్జి బాలసాని లక్ష్మీనారాయణ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సోయం రాజారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై బాలసాని మాట్లాడారు. జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సారి భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకునే విధంగా ప్రతి నాయకుడు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన అన్నారు. భద్రాచలం గడ్డ బిఆర్ఎస్ అడ్డ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలం ప్రధాన కార్యదర్శి నిక్కిపోయిన శ్రీనివాస్ సర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు, నాయకులు బోధవైన బుచ్చయ్య, దొడ్డి తాతారావు, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పార్టీ సీనియర్ నాయకులు మహిళా నాయకులు కార్యకర్తలు అభిమాన సంఘాలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జెకె 5 ఉపరితల గనిలో పర్యటించిన సింగరేణి డైరెక్టర్

నవతెలంగాణ-ఇల్లందు

జెకె 5 ఉపరితల గనిలో సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వర రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఓసీ పని స్థలాలను సందర్శించి అక్కడ జరుగుచున్న పనులను పరిశీలించారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జి.యం ఎం.షాలెం రాజును అడిగి తెలుసుకున్నారు. డైరెక్టర్(పిపి) జి.వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధికమించాలని, వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తి మరియు రవాణాకు ఎటువంటి ఆటంకములు కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని, అలాగే ఉపరితల గనుల్లో ఎండా తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జి.యం.ఎం.షాలెం రాజు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాసు, ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, మేనేజర్ పూర్ణచందర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చిన్నయ్య, సర్వే అధికారి నాగేశ్వరరావు, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి ఇతర అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

సీఐ రమాకాంత్

నవతెలంగాణ-సుజాతనగర్



నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని చుంచుపల్లి సీఐ రమాకాంత్ అన్నారు. మంగళవారం మండలంలో పెస్టిసైజర్స్ దుకాణాలలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని విత్తనాలు కొనగానే రసీదులు తీసుకోవాలని అన్నారు. దుకాణాలలో రికార్డులను పరిశీలించి స్టాక్ బోర్డ్స్ తప్పనిసరిగా పెట్టాలని అన్నారు. ఈ తనిఖీలలో మండల ఎస్సై పండుగ తిరుపతిరావు, మండల వ్యవసాయ అధికారి జి.నర్మద పాల్గొన్నారు.

భూనిర్వాసితులను పట్టించుకోకపోతే వాహనాలు తగలబెడతాం

- కోరేగడ్డ నిర్వాసితులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకూ ఊరుకోం

- భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య

నవతెలంగాణ-చర్ల



సీతమ్మ సాగర్ నిర్మాణంలో భూములను కోల్పోతున్న భూ నిర్వాసితులను పట్టించుకోకపోతే నిర్మాణ పనుల్లో ఉన్న వాహనాలను తగలబెడతామని భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం మండలం పరిధిలోగల కొత్తపల్లి గ్రామ గోదావరి పరిహోవాహక ప్రాంతంలో జరుగుతున్న సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు అడ్డగించి వీరయ్య మాట్లాడారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా కరకట్ట పనులు చెయ్యొద్దు, కోరేగడ్డ నిర్వాసితులకు ఎకరాకు 8 లక్షలు ఇవ్వాలి, తక్షణమే ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహించాలి, కోరేగడ్డ నిర్వశితులకు జీవనోపాధి కల్పించాలి, వరద బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రెండోవ సర్వేలో భూమికి భూమి లేదా ఎకరాకు 30 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాదని పనులు చేస్తే అన్ని వాహనాలను తగలబెడుతామని ఎమ్మెల్యే నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఇర్ప శాంత, ఎంపీపీ గీదా కోదండ రామయ్య ఎంపీటీసీ మడకం పద్మజ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నల్లరపు దుర్గప్రసాద్, కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి రామకృష్ణ, నాయకులు కార్యకర్తలు నిర్వాసిత రైతులు, కూలీలు, వరద బాధితులు పాల్గొన్నారు.

వివోఏల మానవహారం

నవ తెలంగాణ-పాల్వంచ

సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ సత్య డిమాండ్ చేశారు. మంగళవారం వీవోఏలు మానవ హారం నిర్వహించారు. వివోఏల అధ్యక్షురాలు అనూరాధ కార్యదర్శి రమేష్, కోశాధకారి రమాదేవి, ఉమ రోజా కుమారి, రమాదేవి, రాజ్య లక్ష్మి, మహేశ్వరి, జయ కృష్ణవేణి, రాజ్యలక్ష్మి కళావతి తదితరులు పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

నవతెలంగాణ-కొత్తగూడెం

చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీధి వ్యాపారం చేసుకొని పొట్ట పోసుకునే చిరు వ్యాపారులు ఎండ తీవ్రతను తట్టుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని గ్రహించిన చేతన ఫౌండేషన్ సభ్యులు మంగళవారం పట్టణంలోని ఎంజీ రోడ్, పోస్ట్ ఆఫీస్ ప్రాంతాలలో గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చేతన ఫౌండేషన్ సేవకుడు టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సతీష్ గుండపునేని మాట్లాడుతూ చేతన ఫౌండేషన్ సేవలు ఖండాంతరాలు దాటి ప్రతి పేదవాడికి వారి చేస్తున్న సేవలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పారిశ్రామిక ప్రాంతం కావడం వల్ల విపరీతమైన ఎండలను సైతం లెక్కచేయకుండా రోడ్డుపైనే పండ్లు, పూలు కుండలు, మట్టి పాత్రలు, కూరగాయలు, కొబ్బరి, చర్మకారులు, బోండాలు, సోడాలు అమ్ముకుంటున్న వీధి వ్యాపారులను ఎండ తీవ్రత నుండి ఎంతోకొంత కాపాడాలని గొప్ప ఉద్దేశంతో చేతన ఫౌండేషన్ ఈ చక్కటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీవీపీఎస్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ మేడి ప్రవీణ్ కుమార్, ఆటో యూనియన్ సూరిబాబు, హృతిక్ కుమార్, కనక లక్ష్మి, శ్రీనివాసు, మేడి ఐజయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి పని వద్ద కనీస సౌకర్యాలు లేవు

-కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలి

-వేసవి అలవెన్స్ ఇవ్వాలి

-వ్యవసాయ కార్మిక సంఘం

జిల్లా అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-చర్ల

మండుటెండలో జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా మట్టి పని చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు లేవని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, వ్యకాస జిల్లా అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు మండిపడ్డారు. మంగళవారం మండల పరిధిలో గల సుబ్బయ్య కుంటలో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి మట్టి పనులు జరుగుతున్న మతలబులను ఆయన వెలికి తీసి విమర్శించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో ఉన్న కూలీలతో సంభాషిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో ఉన్న కూలీలు మాట్లాడుతూ వేతనాలలో జాప్యం ఉందని, మౌలిక వసతులు నీడ, మెడికల్ కిట్లు, పనిముట్లకు సంబంధించిన రాయితీలు, మంచినీటి సౌకర్యం సక్రమంగా ఉండటం లేదని తెలిపారు. మాస్టర్ రోలు తీసుకుంటున్నారు కానీ రెండుసార్లు ఫోటోలు అప్లోడ్ చేయటం వంటి సమస్యలు ఉన్నాయని అన్నారు. వీటితోపాటు పని ప్రదేశంలో నీడ టెంట్లు, పని వస్తువులు లేని కారణంగా ఎండలకు తట్టుకోలేక స్పృహ కోల్పోతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సమ్మర్ బోనస్సు తమకు తెలియదని ఉపాధి కార్మికులు అన్నారు. పని ఇవ్వటంలో జాప్యం జరుగుతుందని, సక్రమంగా అడిగిన వారికి అందరికీ పనులు ఇవ్వటం లేదని ఉపాధి కూలీలు తెలిపారు. వేతనాలు సరిగా పడటం లేదని, ధరలు పెరిగాయని కొలతల వలన తమకు ఇబ్బంది జరుగుతుందని అన్నారు. పని జరిగిన రోజులలో పేస్లిప్పు ఇవ్వని కారణంగా ఏ పనికి ఎంత వేతనం చెల్లిస్తున్నారో అర్థం కావడం లేదని మట్టి పని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. సమస్యలు వస్తే ఎవరూ పట్టించుకోవడంలేదని వారు అన్నారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఉపాధి పని ప్రదేశాలలో ఉన్న సమస్యలు తెలుసుకోవడానికి వ్యవసాయ కార్మిక సంఘం పని ప్రదేశాల సందర్శన చేస్తుందని అందులో భాగంగా మీ వద్దకు వచ్చి తెలుసుకున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కూలీ పడేవిధంగా ఈ ఎండాకాలం వరకైనా కొలతలతో సంబంధం లేకుండా కనీసం 300 రూపాయలు వేతనం వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమ్మర్ బోనస్సు ఏప్రిల్, మే, జూన్ మాసాలలో ఇస్తారని దీనిని కూడా



కూలీలకు వివరించాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని అలాగే జిల్లాలో ఉన్న అన్ని మండలాలలో ఈ సమస్యలపై కూలీలను సమీకరించి మండల కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా అధికారులకు వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఉపాధి హామీకి చట్టబద్ధత కల్పించాలని, వ్యవసాయానికి అనుసంధానం చేయకూడదని కోరారు. ఫోటోలు అప్లోడ్ సిస్టం లో కూడా మార్పు తీసుకురావాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యల సాధన కోసం ఈ నెల 25న జరిగే హైదరాబాదులో ఉపాధి కూలీల రాష్ట్ర ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. పని ప్రదేశం సందర్శనలో శ్యామల వెంకట్, నరసింహమూర్తి, ముఠామేస్త్రిలు, కూలీలు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం పేదలకు ఒక వరం

- నేడే ప్రారంభించిన విప్ రేగా

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు చేతుల మీదుగా ప్రారంభించడానికి నేడు సిద్ధంగా ఉంది. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పేదలకు వరంగా పనిచేస్తుందని ఈ ప్రాంత ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. సుమారు 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయబడింది. పేద ప్రజల చెంతకు కార్పొరేట్ వైద్యం ప్రభుత్వ లక్ష్యంతో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలో నిలిచిపోతుంది. ఏదైనా జబ్బు చేసి ఆసుపత్రికి వెళ్తే చికిత్స కంటే వైద్య పరీక్షలకే డబ్బులు ఖర్చవుతున్న ఈ రోజుల్లో రక్తపరీక్ష వరకు అనేక టెస్టులు, వాటికి వేలకు వేలకు పోయాల్సి ఉంటుంది. సామాన్య ప్రజలపై ఈ భారం పడకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నది. అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలకు అవసరమైన పరికరాలను ప్రభుత్వం సిద్ధం చేస్తున్నది. గతంలో కిడ్నీ రోగం వస్తే ప్రాణాలు పోయే అంత పని అవ్వడమే కాకుండా వ్యయ ప్రయాసలు, తిండి తిప్పలు ఓర్చుకునే హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. కానీ స్వరాష్ట్రంలో అలాంటి పరిస్థితులకు చరమ గీతం పాడారు సీఎం కేసీఆర్. ఉస్మానియా, నిమ్స్, గాంధీ వంటి మూడు ఆసుపత్రులకు మాత్రమే పరిమితమైన డయాసిస్ సేవలను ఏకంగా 102కు పెంచి సేవలు విస్తృతం చేయడం ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరులో ప్రారంభించడం ఈ ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. దూర ప్రాంతాలకు వెళ్లకుండా పేద ప్రజల చెంతకే వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో బాధితులకు అందుబాటులో ఉండడం గొప్ప విశేషం.



అక్రమ అరెస్టులను నిరసిస్తూ గ్రామ దీపికల నిరసన

- సమ్మె పరిష్కారంపై దృష్టి పెట్టండి

అణచివేయాలని చూస్తే, రెట్టించిన

- ఉత్సాహంతో ఉద్యమం ఉదతం చేస్తాం

- ఎ.జె.రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గత 37 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వివోఏలు చేస్తున్న సమ్మె పట్ల ప్రభుత్వం అణచివేత చర్యలను మానుకొని చర్చలకు పిలిచి సమ్మె పరిష్కారం చేయకపోతే రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమంను ఉధృతం చేస్తామని సీఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. భద్రాచలం పట్టణంలో సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా పట్టణ కో కన్వీనర్ మర్ల పాటి రేణుక అధ్యక్షతన జరిగిన సభలో ఎ.జె.రమేష్ మాట్లాడుతూ సమ్మె పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని, సమ్మె డిమాండ్లను పరిష్కరించ కపోగా,అధికారులతో వేధింపులకు పాల్పడు తుందని, తొలగిస్తామని, కొత్త వాళ్ళని నియమిస్తామని రెచ్చగొట్టే చర్యలకు ప్రభుత్వం పాల్పడటం సిగ్గు చేటని అన్నారు. గ్రామ స్థాయిలో వివోఏలు చేసే పని పట్ల, ఆ పని ద్వారా జరిగే లబ్ది ప్రభుత్వానికి తెలిసినా తనకేమీ పట్టనట్లు ప్రభుత్వం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ కన్వీనర్ యం.బి.నర్సారెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు నకిరుకంటి నాగరాజు, లక్ష్మీకాంత్, అప్పారీ రాము, వేల్పూరి రాము బాలకృష్ణ, బాలాజీ, వాసు, నాయకులు అజయ్, మురళి వివోఏ జిల్లా కోశాధికారి చంద్ర పట్టణ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, పట్టణ వివోఏ కోశాధికారి సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం : ఈ నెల 22న వివోఏలు చేస్తున్న రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె లో భాగంగా అన్ని కలెక్టరేట్ల ముందు ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో సిఐటియు నాయకులు, వివోఏ లను అక్రమంగా అరెస్టు చేసి లాఠీచార్జి చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి డి.వీరన్న తెలిపారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లో వివోఏలు, అన్ని రంగాల కార్మికులతో మానవహారంచేట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, సిఐటియు లక్ష్మీదేవిపల్లి మండల నాయకులు యు.నాగేశ్వరరావు, ఐద్వా పట్టణ నాయకురాలు సందకూరి లక్ష్మి, విఓఏల నాయకురాళ్లు రేష్మ, మైమునిసా, మాధవి, స్వరూప, అరుణ, కృష్ణకుమారి, రాజమణి పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : వివోఎల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడాలని సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ అన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా వివోఏలు మానవహారం నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ **కార్యక్రమంలో వివోఏల సంఘం మండల నాయకులు నాగరాజు, శ్యాం రమేష్ రమాదేవి కమల పాపమ్మ పాల్గొన్నారు.**

టెన్త్, ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు కోచింగ్ క్యాంపులు

ఆర్సిఓ డేవిడ్ రాజ్

నవతెలంగాణ-భద్రాచలం

టెన్త్, ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల కోసం గిరిజన గురుకుల విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు నిచ్చేందుకు భద్రాచలం, కిన్నెరసానిలో కోచింగ్ క్యాంప్ తరగతులు ఏర్పాటు చేసినట్లు భద్రాచలం ఐటిడిఏ ఏపీవో (జనరల్), గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి హెచ్ డేవిడ్ రాజ్ తెలిపారు. భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న అడ్వాన్స్ సప్లమెంటరీ కోచింగ్ క్యాంప్ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ.... భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో గిరిజన గురుకులాల్లో చదివి టెన్త్, ఇంటర్ పరీక్షల్లో తప్పిన బాల, బాలికల ప్రయోజనార్థం ఏప్రిల్ 22 నుంచి, పరీక్షల వరకు బాలికలకు భద్రాచలం గిరిజన గురుకుల సంస్థలో, బాలురకు కిన్నెరసానిలో కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భద్రాచలం, వైరా, మణుగూరు, అన్నపురెడ్డి పల్లి, కొత్తగూడెం, సుదిమల్ల,అంకంపాలెం తదితర 7 గిరిజన గురుకులాల నుంచి మొత్తం 255 మంది ఇంటర్ బాలికలు భద్రాచలం గిరిజన గురుకుల కోచింగ్ క్యాంప్ లో తర్ఫీదు పొందుతున్నట్లు వెల్లడించారు. దమ్మపేట, కిన్నెరసాని, గుండాల, ఖమ్మం,సింగరేణి, తిరుమలాయపాలెం తదితర గిరిజన గురుకులాల నుంచి 200 మంది ఇంటర్ బాలురు కిన్నెరసానిలో నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంపుకు హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలలో 79 మంది బాలికలు, కిన్నెరసానిలో 30 మంది బాలురు



10వ తరగతి సప్లిమెంటరీ కోచింగ్ క్యాంపులో హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం దేవదాసు, కళాశాల, పాఠశాల స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి పట్ల ఖండన

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రవేశ పెట్టాలి

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

తుంగతుర్తిలో న్యాయవాది యుగేందర్పై ఎమ్మెల్యే అనుచరులు, బీఆర్ఎస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాట్లు బీఎస్పీ రాష్ట్ర పధాన కార్యదర్శి యెర్రా కామేష్ తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని ఆరోపించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ప్రోద్బలంతో బీఆర్ఎస్ గుండాలు న్యాయవాది యుగేందర్పై కర్రలు, రాళ్లతో దాడి చేసి కారును ధ్వంస్వం చేసి హత్యాయత్నం చేశారని, బాధితుడు చెబుతున్న పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేయకుండా, బాధితుడి స్టేట్మెంట్ రికార్డు చేయకుండా కేసు నమోదు చేయడం మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందన్నారు. నిందితులను అరెస్టు చేసి, కఠిన శిక్షలు పడేలా చూడాలనన్నారు. ఈ కార్యక్రమంలో కేతిని కుమారి, ఎర్రంశెట్టి రాజేశ్వరి, అల్లకొండ శరత్, సందేల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



11వ వేజ్ బోర్డ్ కార్మికుల విజయం

నవతెలంగాణ-మణుగూరు

11వ వేజ్ బోర్డ్ కార్మికుల ఘనవిజయం అని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. మంగళవారం మణుగూరు ఏరియాలోని కెసిహెచ్పిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ఫిట్ మీటింగ్లో మాట్లాడుతూ.. 11వ వేతన ఒప్పందం 19 శాతం ఫిట్ మెంట్ 25 శాతం అలవెన్స్ లపై పెంపు, 5 శాతం కోల్ ఫీల్డ్ అలవెన్స్ కలుపుకొని సింగరేణి కార్మికులకు ఈనెల 19,20 తేదీలలో కలకత్తాలో జరిగిన వేతన ఒప్పందంలో అగ్రిమెంట్ జరిగిందని అన్నారు. వేజ్ బోర్డు సమావేశాలలో సింగరేణి నుండి మొదటి నుండి ఏఐటియుసికి మాత్రమే పర్మనెంట్ మెంబర్ ఉన్నారని అన్నారు. మొదటి వేజ్ బోర్డు నుండి 11వ వేజ్ బోర్డు వరకు వేతన ఒప్పందంలో పెద్దన్న పాత్ర పోషిస్తూ క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని అన్నారు. వేతన పెరుగుదల మొదటి కేటగిరి కార్మికుడికి ఇనిషియల్గా 6,973.71 పైసల నుండి సీనియర్ కార్మికుడికి 18 నుంచి 20 వేల వరకు ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.వి.రామనసయ్య, ఆవుల నాగరాజు, ఎస్.కె సుభాని, పిట్ సెక్రటరీలు గుంపెన శ్రీనివాస్, కోడి రెక్కల శ్రీనివాస్ రావు, కామ కృష్ణమూర్తి, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, వై.హనుమంతు, బివి సత్యనారాయణ, షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ గని ఫిట్టర్ల ట్రాన్స్ ఫర్లను నిలుపుదల చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

కొండాపురం భూగర్భగని ఫిట్టర్ల బదిలీలను నిలుపుదల చేయాలని టిబిజికేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు ఊకంటి ప్రభాకర్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం గని కార్మికులు ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఫిట్టర్ లను బదిలీపై ఆర్జి 01, ఆర్జి 2 ఏరియాలకు పంపే విధంగా యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేపించాలని యాజమాన్యాన్ని కోరారు. ఏరియా నందు యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను సాధించడం ఏరియాను ప్రథమ స్థానంలో నిలపడంలో కూడా కొండాపురం భూగర్భ గని ఫిట్టర్ల పాత్ర మరువలేనిదని తెలిపారు. సింగరేణి యాజమాన్యంకు దరఖాస్తు రూపంలో విన్నవించడం జరిగిందని యాజమాన్యం కూడ మానవీయ కోణంలో ఆలోచన చేసి దరఖాస్తులు పెట్టుకున్న వారి ఇబ్బందులను పరిశీలించాలన్నారు. కొత్తగూడెం రీజియన్ కింద ఉన్న కొండాపురం భూగర్భ గనికి బదిలీకి అవకాశం కల్పించడం జరిగిందని అందుకు జీవితాంతం సింగరేణి సంస్థకు రుణపడి ఉంటామని, కుటుంబ సభ్యుల బాగోగులు చూసుకుంటూ సంతోషంగా విధులు నిర్వహిస్తున్న సమయంలోనే వేరే ఏరియాలకు బదిలీపై వెళ్లాల్సిందిగా యాజమాన్యం ఆదేశాలు ఇవ్వడం కుటుంబ సభ్యులు తీవ్రమైన భయాందోళనకు గురి చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవూఫ్, పిట్ సెక్రటరీ నాగలి సాయి వెంకట్, బ్రాంచి నాయకులు వీర భద్రయ్య, కాపా శివాజి, ఎస్వీఎస్ఎన్ వర్మ సిహెచ్ వెంకటేశ్వర రెడ్డి, బానోత్ కృష్ణ, అశోక్, కొండాపురం భూగర్భ గని ఫిట్ సెక్రటరీ నాగెల్లి మరియు ఫిట్టర్లు పాల్గొన్నారు.



సింగరేణి ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలి

జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సింగరేణి ఏరియాలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్టియుసి స్టేట్ జనరల్ సెక్రెటరీ సి త్యాగరాజన్ అన్నారు. మంగళవారం పీకే ఓసి 2 లో గేట్ మీటింగ్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈనెల 19, 20 తేదీలలో కలకత్తాలో జరిగిన సమావేశానికి బి.జనక్ ప్రసాద్ సెక్రెటరీ జనరల్, పర్మనెంట్ వేజ్ బోర్డు మెంబర్గా హాజరయ్యారన్నారు. రెండవ సమావేశంలోనే కార్మికులకు న్యాయం చేయటం జరిగిందన్నారు. ఇప్పటికైనా ఐఎన్టీయూసీని ఆదరించి రాబోయే సింగరేణి ఎన్నికలలో గెలిపించాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ వెలగ పల్లి జాన్, కొత్తగూడెం వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్, సెక్రటరీ బి.రాజలింగం, టి.పెదనాగయ్య, టి.శ్రీను, శ్రీను, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాలను ఎస్టీ జాబితాలో కలిపితే చూస్తూ ఊరుకోం

ఆదివాసీ సంఘాల జేసీ

నవ తెలంగాణ-పినపాక

బీసీ కులాలైన 11 జాతుల వారిని ఎస్టి జాబితాలో కలుపుటకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వం ఆమోదం కొరకు పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసి జేఏసీ నాయకులు మండిపడ్డారు. పినపాక మండలం ఈ.బయ్యారం క్రాస్ రోడ్ లో ఏర్పాటుచేసిన ఆదివాసీ సంఘం జేఏసీ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం వెంటనే విరమించుకోవాలన్నారు. ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా 12 గిరిజన ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయం వద్ద ర్యాలీగా వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఆ వినతి పత్రం ఇచ్చుటకు మణుగూరు సురక్ష బస్టాండ్ నుండి ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు అధికసంఖ్యలో ఆదివాసులతో వినతి పత్రం ఇస్తున్నామన్నారు. జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరస శ్రీనివాస్, వజ్జ నరసింహారావు, గొగ్గల అర్కే దొర, కొమరం రామ్మూర్తి, పడిగ నారాయణ, కొమరం సైదులు, పర్శిక నరసింహారావు , ఆదివాసీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేటలోని నందమూరి నగర్ కు చెందిన ఎస్కే అమీర్ (21) గత కొద్ది నెలలుగా మనోవ్యాధితో పడుతుండగా గుర్తించిన కుటుంబీకులు విజయవాడ ఆస్పత్రి కు తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసి టైర్ల దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి రాత్రి ఐనా తిరిగి రాలేదు. ఆలస్యంగా గుర్తించి ఆచూకీ కోసం కుటుంబీకులు గాలిస్తున్న క్రమంలోనే స్థానిక దొంతికుంట చెరువులో మంగళవారం ఉదయం మత దేహమై తేలాడు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ బొమ్మెర బాలకృష్ణ, ఎస్సై బీ.రాజేశ్ కుమార్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు మృతదేహాన్ని పరిశీలించి అమీర్గా గుర్తించారు. మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్లో మార్చురీకి తరలించారు. దీనిపై మృతుని తండ్రి ఇబ్రహీం చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అందానికి తులసి..



తులసి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సాధారణంగా ప్రతి ఇంట్లోనూ పెంచుతుంటారు. తులసి ఆకులు, కాండం ప్రతీది ఉపయుక్తమైనదే. ఆరోగ్యానికి తులసి మేలు చేస్తుందని అనేక పరిశోధనలు వెల్లడించాయి. అంతేకాదు, అందానికి కూడా తులసిని ఉపయోగించవచ్చు. అవేంటో తెలుసుకుందాం...

- రోజూ ఉదయాన్నే బ్రష్ చేయగానే కొన్ని తులసి ఆకుల్ని తినడం వల్ల రక్త శుద్ధి అవుతుంది.
- ముఖం తాజాగా ఉండడానికి ఏదైనా పాత్రలో కొన్ని మంచినీళ్ల తీసుకుని అందులో సగం నిమ్మకాయ రసాన్ని పిండి, అందులో ఓ పిడికెడు తులసి ఆకులు, పిడికెడు మెంతి ఆకులు వేసి కాసేపు మరిగించాలి. జుట్టుకు తగలకుండా ముఖానికి మాత్రమే ఆ ఆవిరి పట్టాలి. కొన్ని నిమిషాల తరువాత చన్నీళ్లతో ముఖం కడిగేసుకుంటే ముఖం తాజాగా మెరిసిపోతుంది.
- తులసి పొడికి కొన్ని నీటి చుక్కలు కలిపిగానీ, పచ్చి తులసి ఆకులను నూరి గానీ పేస్ట్‌లా చేసి ముఖానికి పట్టిస్తే అతి సూక్ష్మమైన మలినాలు సైతం తొలగిపోయి ముఖం సహజ లావణ్యాన్ని సంతరించుకుంటుంది.
- ఎండు తులసి ఆకు పొడిని పౌడర్‌లా రోజూ ముఖానికి పట్టిస్తే ముఖం కాంతివంతంగా మారుతుంది. ఈ పొడి ముఖం మీద ఉండే పలుచనివే కాదు గాఢమైన మచ్చల్ని కూడా తొలగిస్తుంది.
- ముఖం మీద నల్లటి మచ్చలు ఉన్నవారు నిమ్మరసం లేదా అల్లం రసం కలిపిన తులసి పేస్టును ముఖానికి పట్టించి అది ఎండిపోయే వరకు అలాగే ఉంచాలి.

ఇలా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం చేస్తే మచ్చలు తొలగిపోవడంతో పాటు ముఖం కాంతి వంతంగా, అందంగా మారుతుంది.

తొక్కతో చర్మ సంరక్షణ

ప్రస్తుత కాలంలో చర్మ సంరక్షణ కోసం మనం మార్కెట్లో దొరికే అనేక వాటిపై ఆధారపడుతున్నాము. సరిగ్గా గమనిస్తే మనం ఇంట్లో ఉపయోగించుకునే వస్తువులతోనే వాటిని తయారు చేస్తారు. అలాంటప్పుడు డబ్బులు ఖర్చుపెట్టి ఆ రసాయనాల ప్రభావం వల్ల ఇబ్బందులు పడే కన్నా సొంతంగా ఫేస్ ప్యాక్స్‌ని తయారు చేసుకోవచ్చు. అదెలాగో చూద్దాం...



సహజంగా ఏ పండ్లు తిన్నా వాటిపై తొక్కను తీసి పడేస్తాము. అయితే చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే చెత్త అనుకునే ఆపై తొక్కలో కూడా మన చర్మాన్ని కాపాడే గుణం ఉంది. వేసవి కాలంలో మార్కెట్లో నారింజా, నిమ్మ పుష్కలంగా దొరుకుతాయి. అందులో సందేహమే లేదు. ఈ పండ్ల తొక్కలలోని విటమిన్ సి చర్మ సంరక్షణలో ఎంతగానో సహాయపడుతుంది. అయితే నేరుగా ఉపయోగించడం కన్నా ఈ తొక్కలను పొడిగా చేసి పౌడరు రూపంలో ఉపయోగించుకోవడం సులభం.

బహుముఖ ప్రజ్ఞాశాలి సుభద్రాదేవి

గోవిందరాజు సుభద్రా దేవి... రచయిత, న్యాయవాది, సంఘ సేవకురాలు, సామాజిక కార్యకర్త. జన విజ్ఞాన వేదిక సభ్యురాలిగా పిల్లల్లో మూఢనమ్మకాలను తొలగించే కృషి చేస్తున్నారు. అన్నింటికంటే మించి నెల్లూరు బాలభవన్ డైరెక్టర్‌గా పిల్లల్లో దాగివున్న ప్రతిభను వెలికితీస్తున్నారు. ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద పిల్లలను చదువులో ప్రోత్సహిస్తున్న ఆమె పరిచయం నేటి మానవి పాఠకులకు ప్రత్యేకం...

సుభద్రాదేవి పుట్టింది కృష్ణాజిల్లా కూచిపూడి దగ్గర కాజా గ్రామం. తల్లి గోవిందరాజు సీతాదేవి, తండ్రి నరసింహారావు. ఈయన ఉమ్మడి రాష్ట్ర సెక్రటేరియట్‌లో పరిశ్రమల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. తుంగభద్ర డ్యామ్ నిర్మాణ సమయంలో నరసింహారావు కర్ణాటక రాష్ట్రానికి డిప్యూటేషన్ మీద వెళ్ళారు. దాంతో సుభద్ర బాల్యం చాలా వరకూ అక్కడే గడిచింది. తొమ్మిదో తరగతి వరకు అక్కడే చదువుకున్నారు. అక్కడ తమిళం, తెలుగు, కన్నడ భాషల వాళ్ళు ఉండేవాళ్ళు. అందుకే ఆమెకు అన్ని భాషలతో పరిచయం ఏర్పడింది. స్కూల్లో జరిగే ప్రతి పోటీలో పాల్గొనేవారు. వ్యాసరచన, వక్తృత్వం, నాటకంలో అయితే కచ్చితంగా పాల్గొనేవారు. అంతేకాదు తుంగభద్ర డ్యామ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటెన్ టోర్నమెంట్‌లో కూడా పాల్గొనేవారు. తన టీంకు కెప్టెన్‌గా ఉండి ఎన్నో బహుమతులు తీసుకొచ్చారు.

విద్యార్థులకు వర్క్‌షాపులు

పదో తరగతి విజయవాడలో, ఇంటర్ నుండి ఎం.ఏ వరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. చదువుతో పాటుగా సంగీతం, వీణా కూడా నేర్చుకున్నారు. పెండ్లి తర్వాత నెల్లూరు వెళ్ళారు. భర్త మోహన్‌రావు, లెక్చరర్‌గా చేస్తున్నారు. నెల్లూరులోనే బి.ఎల్ పూర్తి చేసి 1992లో న్యాయవాద వృత్తిని మొదలుపెట్టారు. అది చేస్తూనే తిరుపతిలో యోగాలో డిప్లొమా చేశారు. అలాగే నెల్లూరు రోటరీ క్లబ్‌లో అనేక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. విద్యార్థులకు వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించేవారు.



బాలభవన్ డైరెక్టర్‌గా...

1993లో నెల్లూరు బాలభవన్‌కు డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. అది ఒక ఎన్జీఓ. పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయడం, భాష, రాత, సైన్స్ ఆవిష్కరణలతో వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తించడం వంటి ఎన్నో కార్యక్రమాలు బాలభవన్ చేస్తుంది. దీని కోసం సుభద్ర నెల్లూరులోని ప్రభుత్వ, కార్పొరేట్ పాఠశాలలకు వెళ్ళి పిల్లల్లోని ప్రతిభను వెలికితీసేవారు. వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న కళలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ వేదికలపై పిల్లలతో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు.

సాహిత్య ప్రస్థానం

ఇంట్లో తన తల్లితో పాటు, పిన్ని యద్దనపూడి సులోచనరాణి, మేనమామ నెమలికంటి రామచంద్రరావు రచయితలు కావడంతో సుభద్ర చిన్నతనం నుండి సాహిత్య వాతావరణంలో పెరిగారు. ఎన్నో పుస్తకాలు ఉండేవి. తల్లి, పిన్నితో కలిసి ఎన్నో సాహిత్య కార్యక్రమాలుల్లో పాల్గొనేవారు. వారి ప్రోత్సాహంతోనే రాయడం మొదలుపెట్టారు. అడవి బాపిరాజు, శరత్, రవీంద్రరాధ్ ఠాగూర్ సాహిత్యం విరివిగా చదివేవారు. రాసిన కవితలను అప్పట్లో ఆకాశవాణి యువకేంద్రం నుంచి వచ్చే కార్యక్రమాల్లో చదివేవారు. అలా సుభద్ర సాహిత్య ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత ఆంధ్ర భూమి వార పత్రికలో ఆమె రాసిన అనేక వ్యాసాలు, కవితలు, కథలు ప్రచురితమయ్యాయి.

మనీ ప్లాంట్

పై చదువులు, వివాహంతో కొంత కాలం పాటు సుభద్ర సాహిత్య రచన ఆగిపోయింది. అడ్వకేట్‌గా నెల్లూరులో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. అడ్వకేట్లల్లో ఎక్కువ మంది సాహితీవేత్తలు ఉండేవారు. దాంతో తిరిగి ఆమె కలం నుంచి కవిత్వం జలువారింది. రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు వెళ్ళడం మొదలుపెట్టారు. కొంత కాలానికి కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వాటిల్లో ప్రధాన పాత్ర పోషించడం మొదలుపెట్టారు. మళ్లీ రేడియోలలో, పత్రికల్లో కవితలు రాయడం మొదలుపెట్టారు. వాటన్నింటినీ కలిపి 'మనీ ప్లాంట్' అనే కవితా సంకలనంగా తీసుకొచ్చారు.



కుటుంబ సహకారం ఉంటే...

కుటుంబంలో నాకు మంచి సహకారం లభించింది. కాబట్టే ఎలాంటి ఇబ్బందులు లేకుండా నా వృత్తి జీవితాన్ని, సాహిత్య జీవితాన్ని సమన్వయం చేసుకోగలుగుతున్నాను. ప్రతి మహిళకు కుటుంబం నుండి సహకారం అందితే తాను అనుకున్న దాంట్లో కచ్చితంగా రాణించగలుగుతుంది. లేదంటే ఏం చేయాలన్నా కష్టపడాల్సి వస్తుంది. చాలా మంది మహిళలు అలా కష్టపడే తాము అనుకున్నది సాధిస్తున్నారు. బాలభవన్ కార్యక్రమాల్లో బిజీగా ఉండడం వల్ల ఈ మధ్య నా రచనలు కాస్త తగ్గాయి. మున్ముందు మంచి కథలు రాయాలని ఉంది.

తల్లి జ్ఞాపకార్థం

తన తల్లి గోవిందరాజు సీతాదేవి జ్ఞాపకార్థం గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదికను సుభద్ర నెలకొల్పారు. ప్రతి ఏడాది ఉత్తమ నవల, కథల పుస్తకాలకు అవార్డులను అందిస్తున్నారు. దీనితో పాటు ఉగాది పురస్కారాలు కూడా ఇస్తున్నారు. నిరంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ బాల బాలికల అభ్యుదయానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాడమే జీవితాశయం జీవిస్తున్నారు సుభద్రాదేవి.

సేవా కార్యక్రమాల్లో...

బాలభవన్ సేవలకు గుర్తుగా ప్రతిభా పురస్కారాన్ని అప్పటి కలక్టర్ చేతులు మీదుగా అందుకున్నారు. అశ్లీల పోస్టర్ల నిర్మూలన సంఘం అధ్యక్షురాలిగా బహిరంగ ప్రదేశాల్లో అంటించిన సినిమా పోస్టర్లను తొలగించే కార్యక్రమంలో మూడేండ్లు పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక కమిటి సభ్యురాలిగా విద్యా సంస్థల్లో మూఢ విశ్వాసాలు తొలగించేందుకు ఎంతో కృషి చేశారు. కుటుంబ సభ్యుల సహకారంతో బీఎం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందిస్తున్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో తరగతి గదులు, టాయిలెట్లు కూడా నిర్మించారు.



- సలీమ

గ్రామ పంచాయతీలకు రూ.1190 కోట్లు విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



గ్రామ పంచాయతీలకు రూ.1190 కోట్ల నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమావేశమై వివిధ పనులకు సంబంధించి నిధుల విడుదలపై చర్చించారు. రూ.1190 కోట్లను విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని ఆదేశించారు. ఈ నిధుల విడుదలతో గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెరుగనున్నది. హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును సర్పంచుల సంఘం ప్రతినిధులు కలిసి సంతోషం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌తోపాటు, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, హరీశ్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతించారు. ఈ విషయంలో చొరవ తీసుకుని పనిచేసిన మంత్రి ఎర్రబెల్లికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు బూడిద రాంరెడ్డి, తదితరులున్నారు.

సివిల్స్‌లో అమ్మాయిలదే విజయం

(మొదటిపేజి తరువాయి)

మెరిశారు. మంగళవారం యూపీఎస్సీ 2022 సివిల్స్ ఫలితాలను విడుదల చేసింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా టాప్ ర్యాంకర్లుగా అమ్మాయిలే సత్తా చాటారు. 2022 ఏడాదికి గాను మొత్తం 933 మందిని యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఇందులో జనరల్ కోటాలో 345 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 99, ఓబీసీ నుంచి 263, ఎస్సీ నుంచి 154, ఎస్టీ నుంచి 72 మంది ఉన్నారు. పోస్టుల వారీగా చూస్తే ఐఎఎస్ సర్వీసులకు 180 మంది, ఐఎఫ్ఎస్ కు 38, ఐపీఎస్ కు 200 మంది చొప్పున ఎంపికయ్యారు. ఇక సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్ – ఎ కేటగిరీలో 473 మంది, గ్రూప్ బీ సర్వీసెస్ లో 131 మంది ఎంపికైనట్టు యూపీఎస్సీ ప్రకటించింది.

తెలుగు విద్యార్థుల సత్తా

ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. తెలంగాణలోని నారాయణపేట జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు కుమార్తె నూకల ఉమా హారతి మూడో ర్యాంకుతో మెరిశారు. అలాగే, తిరుపతికి చెందిన జీవీఎస్ పవన్ దత్తా 22వ ర్యాంకుతో మెరిశారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన తరుణ్ పట్నాయక్ కు 33వ ర్యాంకు వచ్చింది. వరంగల్ కు చెందిన శాఖమూరి శ్రీసాయి అర్షిత్ 40, సాయి ప్రణవ్ 60, ఆవుల సాయికృష్ణ 94, నిధి పాయ్ (హైదరాబాద్) 110, జగిత్యాల జిల్లాకు చెందిన అనుగు శివమారుతీరెడ్డి 132, రాళ్లపల్లి వసంత్ కుమార్ 157, కమతం మహేశ్ కుమార్ 200, రావుల జయసింహారెడ్డి 217, విశాఖకు చెందిన సాహిత్య 243, అంకుర్ కుమార్ 257, బొల్లం ఉమామహేశ్వరెడ్డి 270, చల్లా కల్యాణి 285, పాలువాయి విష్ణువర్ధన్ రెడ్డి 292, గ్రంథె సాయికృష్ణ 293, వీరగంధం లక్ష్మి సుజిత 311, ఎన్. చేతనా రెడ్డి 346, శృతి యారగట్టి ఎస్ 362, సోనియా కటారియా 376, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కు చెందిన ఇప్పలపల్లి సుష్మిత 384, రేవయ్య 410, సిహెచ్ శ్రావణ కుమార్ రెడ్డి 426, ప్రకాశం జిల్లాకు చెందిన బొల్లిపల్లి వినూత్న 462, రెడ్డి భార్గవ్ 772, నాగుల కృపాకర్ 866 ర్యాంకులతో సత్తా చాటారు.

సివిల్స్‌లో ఎస్పీ కుమార్తె

- **ఉమా హారతికి ఆల్ ఇండియాలో మూడో ర్యాంకు**

నవతెలంగాణ- నారాయణపేట టౌన్

యూపీఎస్సీ పరీక్షలో నారాయణపేట ఎస్పీ ఎస్.వెంకటేశ్వర్లు కుమార్తె నూకల ఉమా హారతి ఆల్ ఇండియాలో మూడో ర్యాంకు సాధించారు. ఈ క్రమంలో మంగళవారం జిల్లా కలెక్టర్‌ను ఉమా హారతి కలిశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉమాహారతికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్‌ను కలవగా.. శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో కష్టపడి చదివానని, తనకు తల్లిదండ్రులు ఎంతో సహకరించారని హారతి తెలిపారు.

పోడు భూములకు పట్టాల పంపిణీ

(మొదటిపేజి తరువాయి)

పొందుతున్న వారితో పాటు నూతనంగా పోడు పట్టాలు అందుకోబోతున్న గిరిజన లబ్ధిదారులతో క్రోడీకరించాలన్నారు. మిగతా రైతులకు ఏవిధంగానైతే రైతుబంధు అందుతున్నదో వారికీ అలాగే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వమే బ్యాంకు అకౌంట్‌ను తెరిచి పోడు భూముల పట్టాల యాజమానులకు నేరుగా వారి ఖాతాల్లో రైతుబంధు డబ్బులను జమచేస్తుందని తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను ఆదేశించారు. పోడు భూముల పంపిణీ కార్యక్రమానికి తానే స్వయంగా హాజరవుతానని సీఎం ప్రకటించారు.

జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యాచరణకు సంబంధించి ఈ నెల 25న జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సు నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఆ సమావేశంలో మంత్రులు, జిల్లా ఎస్పీలు పాల్గొంటారు.

ఇండ్ల స్థలాల పంపిణీ

ఆయా గ్రామాల్లో ఉన్న నివాసయోగ్యమైన ప్రభుత్వ భూములను అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇండ్ల నిర్మాణాల కోసం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వారికి పట్టాల పంపిణీ చేయాలని సూచించారు.

జులైలో గృహలక్ష్మి పథకం ప్రారంభం

గృహలక్ష్మి పథకానికి సంబంధించిన గైడ్‌లైన్స్‌ను త్వరితగతిన తయారు చేయాలనీ, జూలై నెలలో గృహలక్ష్మి పథకం ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. జూలైలోనే దళితబంధు కొనసాగింపు కోసం ఏర్పాట్లు చేయాలని సీఎస్‌ను ఆదేశించారు.

నిమ్స్ ఆస్పత్రి నూతన భవనానికి శంకుస్థాపన

వైద్య ఆరోగ్య దినోత్సవమైన జూన్ 14న నిమ్స్ ఆస్పత్రి విస్తరణ పనులకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నారు. రెండువేల పడకలతో నూతనంగా నిర్మించనున్న సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

2న గన్ పార్కు వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు

- **అదే రోజు సచివాలయంలో జాతీయ పతాకావిష్కరణ**
- **22 వరకు ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు**
- **రోజుకో రంగానికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు**
- **22న అమరుల సంస్మరణ కార్యక్రమం**
- **దశాబ్ది ఉత్సవాల రోజువారీ షెడ్యూల్‌ను విడుదల చేసిన సీఎం**

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 22వ వరకు మొత్తం 21 రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో సంబంధిత షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రెటరియేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ షెడ్యూల్‌ను ఖరారు చేశారు.

షెడ్యూల్

జూన్ 2 : హైదరాబాద్‌లోని గన్ పార్కు వద్ద గల అమర వీరుల స్థూపానికి సీఎం నివాళులర్పిస్తారు. అనంతరం డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయ ప్రాంగణంలో కేసీఆర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరిస్తారు. తర్వాత దశాబ్ది ఉత్సవ సందేశాన్నిస్తారు. అదే రోజున రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ, దశాబ్ది ఉత్సవ సందేశాలుంటాయి.

జూన్ 3 : ఆ రోజును తెలంగాణ రైతు దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని రైతు వేదికలే కేంద్రంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు .... రైతులతో కలిసి సామూహిక భోజనాలు చేస్తారు.

జూన్ 4 : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని, పోలీస్ శాఖ సమర్థవంతమైన సేవలను వివరించే విధంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తారు.

జూన్ 5 తెలంగాణ విద్యుత్ విజయోత్సవ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. నియోజకవర్గ స్థాయిలో వినియోగదారులు, రైతులు, విద్యుత్ ఉద్యోగుల సమావేశాలుంటాయి. ఆ రోజు సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తారు. అదే రోజు సింగరేణి సంబురాలను కూడా నిర్వహిస్తారు.

జూన్ 6 : తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. పారిశ్రామికవాడలు, ఐటీ కారిడార్లలో సభలు నిర్వహిస్తారు.

జూన్ 7 : సాగునీటి దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆ రంగంలో సాధించిన ప్రగతిని వివరిస్తూ నియోజకవర్గాల్లో సభలుంటాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తారు. సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

జూన్ 8 : ఊరూరా చెరువుల పండుగను నిర్వహిస్తారు. డప్పులు, బోనాలు, బతుకమ్మలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జూన్ 9 : తెలంగాణ సంక్షేమ సంబురాలు నిర్వహిస్తారు. నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వం అందించిన ఆసరా పింఛన్లు, కళ్యాణ లక్ష్మి తదితర సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సభలు నిర్వహిస్తారు. ఇదే అంశాలపై హైదరాబాద్ రవీంద్రభారతిలో సభ ఉంటుంది.

జూన్ 10 : తెలంగాణ సుపరిపాలన దినోత్సవంగా నిర్వహిస్తారు. అన్ని జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో పరిపాలనా సంస్కరణల ద్వారా జరిగిన మేలును వివరిస్తారు.

జూన్ 11 : తెలంగాణ సాహిత్య దినోత్సవంగా జరుపుకుంటారు. జిల్లా స్థాయిలో కవి సమ్మేళనాలు, రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం ఉంటుంది.

జూన్ 12 : అన్ని నియోజకవర్గాల్లో తెలంగాణ రన్ నిర్వహిస్తారు. యువకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఉదయం ఆరు గంటలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

జూన్ 13 : తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటారు. ఉత్తమ మహిళా ఉద్యోగులను సన్మానిస్తారు.

జూన్ 14 : తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవంగా నిర్వహిస్తారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో 2 వేల పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖానా నూతన భవనానికి, విస్తరణ పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తారు.

జూన్ 15 : తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవంగా జరుపుకుంటారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు సాధించిన ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, ఉత్తమ మండలాల ఎంపీపీలకు సన్మానం చేస్తారు.

జూన్ 16 : తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవంగా జరుపుకుంటారు. ప్రతి కార్పొరేషన్, ప్రతి మున్సిపాల్టీ, ప్రతి పట్టణం సాధించిన ప్రగతిని వివరించేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జూన్ 17 : తెలంగాణ గిరిజన దినోత్సవాన్ని నిర్వహిస్తారు. నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహిస్తారు.

జూన్ 18 : తెలంగాణ మంచినీళ్ల పండుగను నిర్వహిస్తారు.


జూన్ 19 : తెలంగాణ హరితోత్సవం ఉంటుంది. అన్ని గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతారు. అటవీశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అడవులు పెరిగిన తీరును వివరిస్తారు.

జూన్ 20 : తెలంగాణ విద్యా దినోత్సవం నిర్వహిస్తారు. అన్ని విద్యాసంస్థల్లో సభలు నిర్వహించి, ఆ రంగంలో సాధించిన ప్రగతిని వివరిస్తారు. అదే రోజున ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మన ఊరు – మన బడి పాఠశాలలకు రిబ్బన్ కట్ చేస్తారు. 10 వేల గ్రంథాలయాలను, 1, 600 డిజిటల్ క్లాస్ రూంలను ప్రారంభిస్తారు. విద్యార్థులకు, వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలను నిర్వహిస్తారు.

జూన్ 21 : తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవంగా నిర్వహిస్తారు. అన్ని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనా మందిరాల్లో కార్యక్రమాలుంటాయి.

జూన్ 22 : అమరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. అన్ని పల్లెలు, పట్టణాలు, నగరాలు, విద్యాలయాల్లో శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటిస్తారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ తీర్మానాలను ప్రవేశపెడతారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కళాకారులతో భారీ ప్రదర్శన నిర్వహిస్తారు. నూతనంగా నిర్మించిన అమరుల స్మారకాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరిస్తారు.

ఉద్యమం ఉధృతం



(మొదటిపేజి తరువాయి)

తరలివచ్చి పాల్గొన్నారు. ప్లకార్డులు చేబూని నినాదాలు హోరెత్తించారు. జాతీయ జెండాలను భుజాన వేసుకొని రెపరెపలాడించారు. అరుదైన సందర్భాల్లో మాత్రమే నిరసనలను అనుమతించే ఇండియాగేట్ ప్రాంతంలో భారీ పోలీసు బలగాలను మోహరించారు. వాహనాల రాకపోకలను కూడా దారి మళ్లించారు.

జమ్మూ కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ వీల్‌ఛైర్‌లోనే హాజరయ్యారు. సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, బజరంగ్ పూనియా, సంగీతా ఫోగట్, సత్యవర్త్ కడియన్ వంటి అగ్రశ్రేణి రెజ్లర్లతో పాటు వేలాది మంది ప్రజలు ప్రదర్శనలో భాగస్వామ్యం అయ్యారు. రెజ్లర్ల అభ్యర్థన మేరకు సంయుక్త కిసాన్ మోర్చాతోపాటు రైతు సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాల శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చాయి. నిర్భయ ఉద్యమం తర్వాత, ఈ ఉద్యమం ఇండియాగేట్ ప్రాంతంలో అతిపెద్ద మహిళా ఉద్యమంగా మారింది. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేసే వరకు పోరాటం నుంచి వెనక్కి తగ్గబోమని వినేశ్ ఫోగట్‌తో సహా నిరసనకారులు ప్రకటించారు. బ్రిజ్‌భూషణ్ నార్కోటెక్ పరీక్ష చేయించుకోమని చేసిన ఛాలెంజ్‌ను స్టార్స్ కూడా స్వీకరించారు.

నవచిత్రం


సాయి ధరమ్ తేజ్

మార్క్.. అలియాస్ మార్కండేయులు

మామా అల్లుళ్ళ ద్వయం పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ మొదటిసారి కలిసి నటిస్తున్న చిత్రం 'బ్రో'. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై జీ స్టూడియోస్‌తో కలిసి టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి పి.సముద్రఖని దర్శకుడు. దర్శకులు త్రివిక్రమ్ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు.

అభిమానులతో పాటు ప్రేక్షకుల్లోనూ ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన పవన్‌కళ్యాణ్ ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్ ఆ అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి సాయి ధరమ్ తేజ్ పాత్రకి సంబంధించిన ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ని విడుదల చేసింది చిత్ర బృందం.

'బ్రో' చిత్రంలో మార్క్ అలియాస్ మార్కండేయులు అనే పాత్రలో సాయి ధరమ్ తేజ్ కనువిందు చేయనున్నారు. బుధవారం సాయంత్రం 4:14 గంటలకు మార్క్ పాత్ర ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. తెల్లటి దుస్తులు ధరించి ఫస్ట్‌లుక్‌లో ఎంతో అందంగా కనిపిస్తున్నారు సాయి తేజ్. మోషన్ పోస్టర్‌లో గడియారాన్ని చూపిస్తూ మార్కండేయులుగా సాయితేజ్ పాత్రను పరిచయం చేసిన తీరు అందర్నీ ఆకట్టుకుంటోంది. బ్యాక్ గ్రౌండ్‌లో 'బ్రోదిన జన్మలేషం.. బ్రోవగ ధర్మశేషం.. బ్రోచిన కర్మహాసం.. బ్రోదర చిద్విలాసం' అనే శ్లోకం వినిపిస్తుండగా శాంతికి చిహ్నంలా తెల్ల దుస్తుల్లో సాయి తేజ్ పాత్రను పరిచయం చేయడం మెప్పిస్తోంది. ఈనెల 18న 'బ్రో' టైటిల్‌ని ప్రకటిస్తూ పవన్ కళ్యాణ్ ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేయగా అద్భుతమైన స్పందన లభించింది. "కాలః త్రిగుణ సంశ్లేశం.. కాలః గమన సంకాశం..' అనే శ్లోకంతో పవన్ కళ్యాణ్ పాత్రను పరిచయం చేసిన తీరు కట్టిపడేసింది. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ మోషన్ పోస్టర్ అత్యధిక వీక్షణలతో సోషల్ మీడియాలో సంచలన రికార్డులు సృష్టించింది. ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్మాణ సంస్థ ఎక్కడా వెనకాడకుండా భారీస్థాయిలో నిర్మిస్తోంది.

ఈ సినిమా చాలాకాలం పాటు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోవడమే కాకుండా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ స్థాయిని మరింత పెంచే చిత్రమవుతుందని నిర్మాతలు నమ్మకంగా ఉన్నారు. ప్రస్తుతం చివరి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా జూలై 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల విడుదల కానుంది.

అందరూ ఎంజాయ్ చేసే సినిమా


సుమంత్ ప్రభాస్

లహరి ఫిల్మ్స్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి చేస్తున్న సినిమా 'మేమ్ ఫేమస్'. సుమంత్ ప్రభాస్ దీనికి దర్శకత్వం వహించడంతో పాటు ఇందులో ప్రధాన పాత్ర పోషించారు. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 26న ఈ సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో హీరో, దర్శకుడు సుమంత్ ప్రభాస్ మీడియాతో మాట్లాడుతూ, 'నేను చేసిన 'పిల్ల పిలగాడు' వెబ్ సిరీస్ చాలా మందికి రీచ్ అయ్యింది. దీంతో అనురాగ్, శరత్ పిలిచి మంచి కథతో వస్తే సినిమా చేస్తామన్నారు. నేను చెప్పిన కథ వాళ్ళకి నచ్చింది. దీంతో రైటర్, డైరెక్టర్‌గా సైన్ చేశాను. అయితే ఇందులో నేను చేసిన పాత్ర కోసం చాలా ఆడిషన్స్ చేశాం. కానీ ఎవరూ సరిగ్గా కుదరలేదు. షూట్‌కి వెళ్ళే పది రోజులు ముందు ఇందులో నటుడిగా చేరాను. ఇదంతా నిర్మాతలు నాపై పెట్టుకున్న నమ్మకం వలనే సాధ్యమైంది. సినిమాని సింక్ సౌండ్‌లో షూట్ చేశాం. ఊర్లో ఏం చేసినా ఫోకస్, ఫేమస్ అవ్వాలనే ఆలోచన ఉన్న కుర్రాళ్ళ కథ ఇది. అందుకే దీనికి మేమ్ ఫేమస్ అని టైటిల్ పెట్టాం. ఇందులో నటించిన అందరూ దాదాపుగా కొత్తనటీనటులే. చాలా క్లీన్ ఫిల్మ్ ఇది. ఫ్యామిలీ అంతా కూర్చుని హ్యాపీగా ఎంజాయ్ చేస్తూ చూసే సినిమా' అని అన్నారు.

స్విట్జర్లాండ్‌లో భోళాశంకర్ స్టెప్పులు


చిరంజీవి

చిరంజీవి, మెహర్ రమేష్ కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. రామబ్రహ్మం సుంకర భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర యూనిట్ ఓ పాట చిత్రీకరణ కోసం స్విట్జర్లాండ్ వెళ్ళారు. అక్కడ చిరంజీవి, తమన్నాలపై ఓ సాంగ్‌ని గ్రాండ్‌గా చిత్రీకరించారు.

ఈ పాటకు సంబంధించిన విశేషాలను చిరంజీవి స్వయంగా సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు.

స్విట్జర్లాండ్‌లో కళ్ళు చెదిరే అందాలతో మైమరిపించే లొకేషన్స్‌లో భోళాశంకర్ కోసం తమన్నాతో ఆటపాట ఎంతో ఆహ్లాదంగా జరిగింది! ఈ పాట ప్రేక్షకులందరినీ, మరింతగా అభిమానులందరినీ మెప్పిస్తుందని చెప్పగలను! త్వరలోనే మరిన్ని సంగతులు పంచుకుందాం! అప్పటివరకూ ఈ 'చిరు లీక్స్' పిక్స్ అంటూ లొకేషన్ స్టిల్స్‌ని షేర్ చేశారు. మహతి స్వర సాగర్ ఈ పాట కోసం రాకింగ్ నెంబర్‌ని స్కోర్ చేశారు. ప్రస్తుతం సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.

క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్ సమపాళ్లలో ఉండనున్నాయి. తమన్నా కథానాయికగా నటిస్తుండగా, చిరంజీవి సిస్టర్‌గా కీర్తి సురేష్ కనిపించనుంది. సుశాంత్ ఈ సినిమాలో లవర్ బాయ్ పాత్రలో నటిస్తున్నారు. ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

రఘు బాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, సురేఖా వాణి, శ్రీ ముఖి, హైపర్ ఆది, ఉత్తేజ్, వీర్, షహ్వార్ అలీ, తరుణ్ అరోరా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్, డైలాగ్స్: తిరుపతి మామిడాల, ఫైట్ మాస్టర్స్: రామ్-లక్ష్మణ్, దిలీప్ సుబ్బరాయన్, కాచే కంపాక్డీ, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్.

జీరో బడ్జెట్‌తో గండ

సినిమా అంటేనే కోట్ల బడ్జెట్‌తో కూడుకున్న వ్యవహారం. అలాంటిది జీరో బడ్జెట్‌తో సినిమా సాధ్యమా? అంటే సాధ్యమే అంటున్నారు దర్శకుడు వారణాశి సూర్య. ఓ వినూత్న ప్రయోగానికి ఆయన తెరతీస్తూ ఈజీ మూవీస్ బ్యానర్‌పై 'గండ' అనే చిత్రాన్ని తెరకెక్కించారు.

జీరో బడ్జెట్‌తో పాలిటిక్స్ ప్రారంభించిన పవన్ కళ్యాన్ స్ఫూర్తితో జీరో బడ్జెట్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నానని అంటున్నారు దర్శకుడు వారణాశి సూర్య.


వారణాశి సూర్య, శివశక్తి దత్త

ఈ చిత్ర టీజర్‌ను బుధవారం ప్రసాద్ లాబ్స్‌లో రిలీజ్ చేశారు. ఈ వేడుకకు రచయిత శివశక్తి దత్త ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'వారణాశి సూర్య చేస్తోన్న జీరో బడ్జెట్ చిత్రం గురించి విని మొదట ఆశ్చర్యపోయాను, ఆ తర్వాత ఆనందించాను. ఈ సినిమా సక్సెస్ కావాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాను. డబ్బు లేకున్నా చేయాలన్న ఉత్సాహం, తపన ఉంటే చాలని ఈజీ సినిమా వారు ఈ సినిమాతో నిరూపిస్తున్నారు. ఈ ప్రయోగం ఎంతో మంది ఔత్సాహికులకు ఆదర్శంగా నిలవాలని, ఈ సినిమా ట్రెండ్ సెట్టర్‌గా మారాలని కోరుకుంటున్నా. గండ అంటే మగవాడు అని అర్థం. ఈ సినిమా గండరగండడుగా పేరు తెచ్చుకోవాలి' అని అన్నారు. 'తెలుగు సినిమా చరిత్రలో మొదటి జీరో బడ్జెట్ మూవీ ఇది. మా టీమ్ అంతా కొత్తవారే. కంటెంట్ నమ్ముకుని సినిమా తీశాం. ఇక నుంచి మా సంస్థ నుండి వరుసగా జీరో బడ్జెట్ చిత్రాలు వస్తాయి. మా జీరో బడ్జెట్ సినిమాకి అన్ని విధాలుగా సహకరిస్తోన్న రచయిత శివశక్తి దత్తకి ధన్యవాదాలు. త్వరలో ట్రైలర్‌ని కూడా రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమా అందరికీ కచ్చితంగా నచ్చుతుంది' అని దర్శకుడు చెప్పారు.

నేటి సమాజానికి ప్రతిబింబమే మళ్ళీ పెళ్లి


పవిత్ర లోకేష్

నరేష్ వి.కె, పవిత్ర లోకేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఎం.ఎస్.రాజు రచన, దర్శకత్వం వహించగా, విజయ కృష్ణ మూవీస్ బ్యానర్ పై నరేష్ నిర్మించారు. ఈనెల 26న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా నాయిక పవిత్ర లోకేష్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'చాలా విరామం తర్వాత ఈ సినిమాతో మళ్ళీ హీరోయిన్‌గా మీ ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. నా కెరీర్ ప్రారంభం నుంచి పాత్రలపై దృష్టి పెట్టానే తప్ప హీరోయిన్‌గా చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. దర్శకులు గిరీష్ కాసరవెల్లి నన్ను కథానాయికగా చేసి, రెండు సినిమాలు తీయటం నా అదృష్టం. ఈ సినిమా మా బయోపిక్ కాదు. అయితే ఈ కథ సమాజానికి అద్దం పడుతుంది. ఇలాంటి పరిస్థితులు, ఆలోచనలు సమాజంలో ఉన్నాయి. అలాగే మనం సమాజంలో కొన్ని కండీషన్స్ పెట్టుకుని ఉంటాం. దాన్ని దాటితే బోల్డ్ అంటాం. ఈ రకంగా చూసుకుంటే ఇందులో చాలా బోల్డ్ ఉంటుంది. ఆడియన్స్ తప్పకుండా కనెక్ట్ అవుతారు. ఎంఎస్ రాజు ఈ కథ చెప్పినప్పుడు నచ్చింది. ఆయన దర్శకత్వంలో చేయడం ఆనందంగా ఉంది. ఆయన చాలా యూత్‌ఫుల్, ట్రెండీగా ఆలోచిస్తారు. ఈ కథని కూడా ట్రెండీగా ప్రజెంట్ చేశారు. ఈ సినిమాలో చాలా మంచి మ్యూజిక్ ఉంది. మళ్ళీ ఫైనల్ కాపీ చూసిన తర్వాత చాలా సంతృప్తినిచ్చింది. అంత అద్భుతంగా వచ్చింది. ప్రస్తుతం ఒక కన్నడ సినిమా, అలాగే నితిన్‌తో ఓ సినిమా చేస్తున్నాను. ఇంకొన్ని కథలు వింటున్నాను' అని తెలిపారు.

సరికొత్త కాన్సెప్ట్

'ఏ బ్యూటీఫుల్ గర్ల్' చిత్ర హీరో నీహాల్ కోదాటి. 'బటర్‌ఫ్లై 'చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ సరసన హీరోగా, అలాగే 'ఆహా'వారి 'పంచతంత్ర' కథలులో ప్రధాన పాత్రలలో ఒకరిగా, అడివి శేష్ 'ఎవరు' చిత్రంలో తన పాత్రతో నీహాల్ కోదాటి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నాడు. రవి ప్రకాష్ బోడపాటి జెన్ నెక్ట్స్ మూవీస్ వ్యవస్థాపకుడు, 'ఏ బ్యూటీఫుల్ గర్ల్' చిత్ర రచయిత, దర్శకుడు కూడా. ఆయన ఛార్మి 'మంత్ర' చిత్రానికి రచన చేయటంతో పాటుగా నిర్మించాడు. అలాగే ఆయన ఇటీవల అనుపమ పరమేశ్వరన్, భూమిక చావ్లా, నీహాల్ కోదాటి నటించిన 'బటర్‌ఫ్లై' చిత్రాన్ని కూడా నిర్మించారు. 'ఏ బ్యూటిఫుల్ గర్ల్' చిత్ర కథానాయిక దృషికా చందర్. న్యూయార్క్‌లో గ్రాడ్యు యేషన్ పూర్తి చేసిన హైదరాబాద్ అమ్మాయి. దృషికా చందర్ నటించిన తొలి చిత్రం 'మానసానమహ'. ఇటీవలే ప్రపంచంలోనే అత్యధిక అవార్డులు అందుకున్న చిత్రంగా గిన్నిస్ రికార్డు సాధించింది. 2022లో ఆస్కార్‌కి అర్హత సాధించిన తొలి తెలుగు చిత్రం కూడా ఇదే. దృషిక జాతీయంగా, అంతర్జాతీయంగా దాదాపు 40 'ఉత్తమ నటి' అవార్డులను గెలుచుకుంది. అలాగే దృషికా రెండు హిందీ చిత్రాలను కూడా పూర్తి చేసింది. అందులో ఒకటి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైంది. ఓ మంచి కాన్సెప్ట్‌తో 'ఏ బ్యూటీఫుల్ గర్ల్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుందనే ధీమాని దర్శకుడు, రచయిత రవి ప్రకాష్ బోడపాటి అన్నారు.



'ఏ బ్యూటీఫుల్ గర్ల్' చిత్ర బృందం

కంపెనీల చట్టాన్ని ఉల్లంఘించారు

- అదానీ పవర్‌పై కంపెనీల రిజిస్ట్రార్ తీర్పు
- జరిమానాల వడ్డింపు



న్యూఢిల్లీ : గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ పవర్ కంపెనీ రెండు వేర్వేరు సందర్భాలలో కంపెనీల చట్ట నిబంధనలను ఉల్లంఘించిందని కంపెనీల రిజిస్ట్రార్ గుజరాత్ కార్యాలయం ఈ నెల ప్రారంభంలో తీర్పు చెప్పింది. 2017-18, 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాలలో కొన్ని లావాదేవీలను బయటపెట్టనందుకు అదానీ పవర్‌ను దోషిగా తేల్చింది. దీనికి సంబంధించి కంపెనీ ఛైర్‌పర్సన్ గౌతమ్ అదానీ, ఆయన సోదరుడు రాజేష్ అదానీ, కంపెనీ సీఈఓ వినీత్ ఎస్ జైన్‌లకు రూ. 75,000 చొప్పున జరిమానా విధించింది. 2014-15, 2016-17 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి వార్షిక రిటర్న్‌లు దాఖలు చేయడంలో జాప్యం చేసినందుకు కూడా ఆ కార్యాలయం కంపెనీని తప్పు పట్టింది. దీనికి సంబంధించి అదానీ పవర్ కంపెనీ, దానికి చెందిన ముగ్గురు అధికారులకు రూ. 10,200 చొప్పున జరిమానాలు విధించింది. ఈ రెండు సందర్భాలకు సంబంధించి ఈ నెల 8న జారీ చేసిన ఆదేశాలు 15వ తేదీన అందుబాటులోకి వచ్చాయి.


కంపెనీల చట్టంలోని సెక్షన్ 189 ప్రకారం సంస్థలు తాము కుదుర్చుకునే ఒప్పందాలకు సంబంధించిన లావాదేవీలను వెల్లడించాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనను పాటించడంలో అదానీ కంపెనీ విఫలమైందని కంపెనీల రిజిస్ట్రార్ గుజరాత్ కార్యాలయం అధికారి ఆర్‌సీ మిశ్రా తీర్పు చెప్పారు. అప్పటికే వ్యాపార సంబంధాలు ఉన్న రెండు పక్షాల మధ్య కుదిరే ఒప్పందాలే ఈ లావాదేవీలు. ఇలాంటి లావాదేవీలను నమోదు చేసి అధికారులకు, కంపెనీ బోర్డుకు తెలియజేయాల్సి ఉంటుంది. ప్రయోజనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నివారించేందుకు లావాదేవీలను బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో కొన్ని మినహాయింపులు ఉంటాయంటూ అదానీ పవర్ చేసిన వాదనను అధికారి తోసిపుచ్చారు.

కంపెనీల చట్టంలోని సెక్షన్ 92 (4) ప్రకారం వార్షిక సర్వసభ్య సమావేశం ముగిసిన 60 రోజుల లోగా సంస్థలు తమ వార్షిక రిటర్న్‌లను కంపెనీల రిజిస్ట్రార్‌కు సమర్పించాలి. అయితే అదానీ పవర్ కంపెనీ సమర్పించిన రిటర్న్‌లలో వాటాదారుల వివరాలను చేర్చలేదు. ఈ కేసులో రాజేష్ అదానీ, వినీత్ ఎస్ జైన్‌తో పాటు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి వినోద్ భండావత్‌లకు జరిమానా విధించారు. అదానీ పవర్‌పై వచ్చిన తీర్పు ప్రతిని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ సామాజిక మాధ్యమాలలో షేర్ చేశారు.

ఆటలు

వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ షెడ్యూల్ ఇదే..

వేర్వేరు గ్రూపుల్లో విండీస్, శ్రీలంక




న్యూఢిల్లీ : ఈ ఏడాది చివర్లో జరగబోయే వన్డే వరల్డ్ కప్ కోసం క్వాలిఫయర్స్ షెడ్యూల్‌ను ఐసీసీ మంగళవారం ప్రకటించింది. ఈ క్వాలిఫయర్స్ టోర్నీ జూన్ 18 నుంచి జులై 9 వరకూ జింబాబ్వేలో జరగనుంది. ఇందులో 10 టీమ్స్ పోటీ పడనున్నాయి. వీటిని రెండు గ్రూపులుగా విడదీశారు.

గ్రూప్-ఎలో వెస్టిండీస్, జింబాబ్వే, నెదర్లాండ్స్, నేపాల్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ), గ్రూప్-బిలో శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్, ఒమన్, యూఏఈ ఉన్నాయి. గ్రూప్ స్టేజ్‌లో మొత్తం 20 మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత సూపర్ 6 స్టేజ్‌కు ఆరు జట్లు అర్హత సాధిస్తాయి. వీటిలో రెండు టీమ్స్ ఫైనల్‌కు చేరతాయి. ఇవే వరల్డ్ కప్ ప్రధాన టోర్నీకి వెళ్తాయి.

వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ తొలి మ్యాచ్ జూన్ 18న రెండుసార్లు ఛాంపియన్ వెస్టిండీస్, యూఎస్ఏ మధ్య జరుగుతుంది. ఇక జూన్ 19న మాజీ ఛాంపియన్ శ్రీలంక, యూఏఈ మధ్య జరగనుంది. ఇప్పటికే ఇండియా సహా 8 టీమ్స్ నేరుగా వరల్డ్ కప్ టోర్నీకి అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఈ టోర్నీ అక్టోబర్, నవంబర్ నెలల్లో ఇండియాలో జరుగుతుంది.

క్వాలిఫయర్స్ నుంచి రెండు టీమ్స్ వరల్డ్ కప్ ప్రధాన టోర్నీకి వెళ్లనుండటంతో మొత్తం పది జట్లు.. ఆ మెగా టోర్నీలో ట్రోఫీ కోసం తలపడతాయి. ఇప్పటికే ఇండియా, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, న్యూజిలాండ్, ఇంగ్లండ్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు క్వాలిఫై అయిన విషయం తెలిసిందే. అయితే మాజీ ఛాంపియన్లు వెస్టిండీస్, శ్రీలంకల భవితవ్యం ఈ క్వాలిఫయర్స్‌లో తేలనుంది.

సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ జూన్ 1 వరకు పొడిగింపు



న్యూఢిల్లీ : ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆప్ నేత మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు మంగళవారం జూన్ 1 వరకు పొడిగించింది. ఈ సందర్భంగా సిసోడియాకు జైలులో కుర్చీ, టేబుల్, పుస్తకాలు అందించడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని న్యాయమూర్తి జైలు అధికారులను ఆదేశించారు. ఇక సిసోడియాను ఢిల్లీ కోర్టు నుంచి బయటకు తీసుకు వస్తున్న సమయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఢిల్లీ సర్వీసెస్ విషయంలో కేంద్రం ఆర్డినెన్స్‌ను భర్తీ చేసే బిల్లును ప్రస్తావిస్తూ.. ప్రధాని నరేంద్ర మోడీకి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదు. మోడీ చాలా అహంకారిగా మారారు' అని ఆయన అన్నారు. కాగా, ఢిల్లీ ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని 2021 నవంబర్ 17న అమల్లోకి తెచ్చింది. అయితే అవినీతి ఆరోపణల కారణంగా 2022 సెప్టెంబర్ చివరలో ఆ పాలసీని రద్దు చేసింది. ఈ వ్యవహారంలో సీబీఐ, ఈడీలు పెట్టిన కేసుల్లో సిసోడియా నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే.

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ

అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలి : మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్సవాల్లో వైద్యారోగ్యశాఖకు కేటాయించే రోజు నుంచి కిట్ల పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని చెప్పారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 6.84 లక్షల మంది మహిళలకు లబ్దిపొందుతారని తెలిపారు. గర్భం దాల్చిన తర్వాత 14 నుంచి 26 వారాల్లో రెండో ఏఎన్‌సీ సమయంలో, 27 నుంచి 34 వారాల సమయంలో మూడో ఏఎన్‌సీ సమయంలో రెండు సార్లు కిట్లు పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు. మొదటి రోజు 24 జిల్లాల్లో 111 కేంద్రాల్లో కిట్ల పంపిణీ ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో రక్తహీనత అధికంగా ఉన్న తొమ్మిది జిల్లాల్లో కిట్లను పంపిణీ చేస్తున్న సంగతిని ఆయన గుర్తుచేశారు.

కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రారంభించిన తర్వాత 2014లో తల్లుల మరణాల రేటు 92 నుంచి ప్రస్తుతం 43కు తగ్గిందని తెలిపారు. వీటిని తగ్గించడంలో దేశంలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సంఖ్యను మరింత తగ్గించేందుకే కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం రూపొందించినట్టు తెలిపారు. నాలుగు ఏఎన్‌సీ చెకప్‌లు, కేసీఆర్ కిట్లు, అమ్మ ఒడి వాహనాలు, మాతా శిశు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు వంటివి రాష్ట్రంలో మాతా శిశు సంరక్షణకు దోహదం చేస్తున్నాయని చెప్పారు. ప్రోటీన్లు, మినరల్స్, విటమిన్లు, ఐరన్‌లను పోషకాహారం ద్వారా అందించి రక్త హీనత తగ్గించడం, హిమోగ్లోబిన్ శాతం పెంచడం న్యూట్రీషన్ కిట్ల లక్ష్యమని తెలిపారు. ఒక్కో కిట్ విలువ రూ.రెండు వేలు కాగా, మొత్తం పంపిణీకి రూ.277 కోట్లు ఖర్చవుతున్నట్టు అంచనా వేసినట్టు తెలిపారు. న్యూట్రిషన్ కిట్‌లో కిలో న్యూట్రీషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూర, ఐరన్ సిరప్ 3 బాటిళ్లు, 500 గ్రాముల నెయ్యి, కప్పు, పల్లి పట్టి 200 గ్రాములు, ప్లాస్టిక్ బుట్ట ఉంటాయని స్పష్టం చేశారు.

సిద్ధమైన పల్లె, బస్తీ దవాఖానలు ప్రారంభించాలి...

ప్రాథమిక వైద్యాన్ని పటిష్టం చేయడంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన పల్లె, బస్తీ దవాఖానాలు వెంటనే ప్రారంభించాలని హరీశ్ రావు ఈ సందర్భంగా ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన సబ్ సెంటర్ల నిర్మాణాలు, మరమ్మతు పనులను వేగవంతం చేయాలని కోరారు. దూరంగా కాకుండా, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇవి ఏర్పాటు చేయాలని సూచించారు.

అభినందనలు

కంటి వెలుగులో భాగంగా పరీక్షలు చేయడం పట్ల వైద్యాధికారులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులను హరీశ్ రావు అభినందించారు. ఇప్పటి వరకు రీడింగ్ గ్లాసెస్ 21.46 లక్షల మందికి, 13 లక్షల మందికి ప్రిస్కిప్షన్ గ్లాసెస్ ఇచ్చినట్టు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేతా మహంతి పాల్గొన్నారు.

కోహ్లీ ఎమోషనల్ పోస్ట్..



థాంక్యూ బెంగళూరు అంటూ ఫొటోలు షేర్

న్యూఢిల్లీ : ఐపీఎల్ 16వ సీజన్‌లో ఆర్‌సీబీ లీగ్ స్టేజ్‌కే పరిమితమైంది. ప్లేఆఫ్స్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శన చేసిన గుజరాత్ చేతిలో ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలోనే ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ కోహ్లీ మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ భావోద్వేగ పోస్ట్ చేశాడు. 'ఈ సీజన్‌లో మెరుగ్గా ఉన్నప్పటికీ దురదృష్టవశాత్తూ మనం లక్ష్యానికి కొద్ది దూరంలో నిలిచిపోయాం. నిరాశ చెందినప్పటికీ.. మనం ఎప్పుడూ తలెత్తుకునే ఉండాలి. ఈ ప్రయాణంలో మాకు అడుగడుగునా అండగా నిలిచిన అభిమానులకు రుణపడి ఉంటాం. మా కోచ్‌లు, మేనేజ్‌మెంట్, మా జట్టు సభ్యులకు కృతజ్ఞతలు. మరింత బలంగా తిరిగొస్తాం" అని కోహ్లీ రాసుకొచ్చాడు. థాంక్యూ బెంగళూరు అంటూ ఫొటోలు షేర్ చేశాడు.

ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లో టాప్ స్కోరర్‌గా రైనా...



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)..! దేశంలో 2008లో ఈ లీగ్ మొదలైంది..! అప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 15 సీజన్‌లు పూర్తయ్యాయి..! ప్రస్తుతం కొనసాగుతున్నది 16వ సీజన్.! మరో ఐదు రోజుల్లో ఈ సీజన్ కూడా ముగియనున్నది. ఈ సీజన్‌లో ఎన్నో రికార్డులు బద్దలయ్యాయి..! టీమ్ టోటల్స్ పరంగా, సెంచరీల సంఖ్యపరంగా, సిక్సర్‌లు, బౌండరీల సంఖ్యపరంగా ఇలా లెక్కలేనన్ని రికార్డులు ఈ ఐపీఎల్ సీజన్‌లో నమోదయ్యాయి.ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లో మొత్తం 24 ఇన్నింగ్స్ ఆడిన సురేశ్ రైనా 714 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. ఆ తర్వాత 21 ఇన్నింగ్స్ ఆడి 522 పరుగులతో కెప్టెన్ ఎంఎస్ ధోని రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ సీజన్ ప్లే ఆఫ్స్‌లో భారీ స్కోర్‌లు సాధిస్తే ధోని టాప్ ప్లేస్‌లోకి వెళ్లే అవకాశం ఉంది. ఇక వీరి తర్వాత షేన్ వాట్సన్ 12 ఇన్నింగ్స్‌లో 389 పరుగులు, మైఖేల్ హస్సీ 11 ఇన్నింగ్స్‌లో 388 పరుగులు, ఫాఫ్ డూప్లెసిస్ 14 ఇన్నింగ్స్‌లో 373 పరుగులతో వరుసగా 3, 4, 5వ స్థానాల్లో ఉన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886